ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
కడప
శుక్రవారం 18 ఆగస్టు 2017



● సామాజిక మాధ్యమం.. మత్తులో యువత
● అపరిచితులతో.. అనర్థాలు
● తల్లిదండ్రులూ.. బహు పరాక్
● పిల్లలేం చేస్తున్నారో ఓ కన్నేయండి

facebook పేరుతో వల

చిక్కారా.. విలవిల

నెల్లూరు జిల్లా పొదలకూరు మండలానికి చెందిన ఒక వ్యక్తి పాలిటెక్నిక్ చదివాడు. బెంగుళూరు, హైదరాబాదు వంటి ప్రాంతాలలో కాంట్రాక్టర్ల వద్ద ఇంజనీర్‌గా పని చేస్తుంటాడు. అయితే ఉద్యోగం చేస్తుంటే వస్తున్న ఆదాయం చాలదనుకున్నాడో.. లేదా అమ్మాయిలతో ఆడుకోవాలనుకున్నాడో.. ఫేస్‌బుక్‌ను వలగా విసిరాడు. అమ్మాయి పేరుతో ఉన్న ఫేస్‌బుక్ అకౌంట్లకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి వాళ్లతో స్నేహం చేశాడు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నంటూ. స్నేహం ముదిరిన తరువాత ప్రేమ కబుర్లు చెప్పి పెళ్ళి చేసుకుంటానన్నాడు. ఇంతలో తనకు వేరే కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చిందని, ఆ ఉద్యోగం వస్తే బాగా జీతం వస్తుందని, అందుకు ముందుగా కొంత డబ్బు కట్టాలంటూ అమ్మాయిలను అడిగాడు. ఇలా రాయచోటికి చెందిన ఓ అమ్మాయిని మోసం చేశాడు. అయితే ఆ అమ్మాయి ధైర్యం చేసి తాను మోసపోయిన విషయాన్ని పోలీసులకు పిర్యాదు చేసింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి. అతన్ని కటకటాలెనక్కి పంపించారు. ఇతను సుమారు పది మందికి పైగా అమ్మాయిల జీవితాలతో ఆడుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయచోటి నుంచి కథనం 6లో

అక్రమాలకు అడ్డాగా వీఎన్ పల్లె



● రెవెన్యూ మాయాజాలంతో సంక్షేమ ఫలాలు పక్కదారి
● కీలక అధికారే ప్రధాన సూత్రధారి
● లేని భూములకు పట్టాలు
● తెలిసినా పట్టించుకోని ఉన్నతాధికారులు

వీరపునాయునిపల్లె మండలం అక్రమాలకు అడ్డాగా మారింది. ఇటీవల వేంపల్లె మండలంలోని చింతలమడుగుపల్లె వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో రుణాలు పొందేందుకు వీరపునాయునిపల్లె మండలంలోని భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు సమర్పించారు. విచారణలో అవి తప్పుడు పత్రాలుగా తేలడంతో కొందరు అధికారులపై సివిల్, క్రిమినల్ చర్యలకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇదే తరుణంలో లేని భూములకు పట్టాలు పుట్టించడం వల్ల ఆ పత్రాల ఆధారంగా పలు ప్రభుత్వ, సంక్షేమ పథకాలను అక్రమార్కులు దక్కించుకుంటున్నట్లు తెలుస్తోంది. సహకార సంఘంలోని రుణాల్లోనే కాకుండా ప్రభుత్వం అమలు పరుస్తున్న అన్ని సంక్షేమ పథకాల్లో నకిలీ పత్రాలే రాజ్యమేలుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందుకు ప్రధాన కారకుడు రెవెన్యూ శాఖలోని ఓ కీలక అధికారి అనే ఆరోపణలున్నాయి.




మోటార్‌సైకిళ్లను ఢీకొన్న కారు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

స్నేహితుడి వివాహానికి కడప నుంచి మోటార్‌సైకిల్‌పై పులివెందుల బయల్దేరిన ముగ్గురు స్నేహితులు చదిపిరాళ్ల గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. వల్లూరుకు చెందిన వెంకటశివారెడ్డి (25) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ కడపకు చెందిన మహేష్ (25), శ్యామ్ (26) రిమ్స్‌లో కన్నుమూశారు.

అడుగంటిన ప్రాజెక్టులు

● ప్రధాన ప్రాజెక్టుల్లో డెడ్‌స్టోరేజీ ● చెమ్మారుతున్న చిన్న రిజర్వాయర్లు ● ప్రశ్నార్థకంగా మారిన కృష్ణా నీరు



వర్షాభావ పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగించేందుకు అన్నదాతకు ఏ అవకాశమూ లేకుండా పోయింది. వర్షాలు ఆలస్యంగా వచ్చినా సాగునీటి ప్రాజెక్టులైనా వెసులుబాటు కలిగిస్తాయన్న ఆశలూ లేవు. వర్షాలు రాకపోవడంతో రిజర్వాయర్లలోకి నీరు చేరకపోగా కృష్ణాజలాల ఆధారంగా నిర్మించిన ప్రధాన ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చే పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రాంతంలో వర్షాలు కురవకపోయినా ఎగువ రాష్ట్రాల్లో కురిసే వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు చేరితే తద్వారా జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులలోకి నీరు చేరేది. వీటితో పాటు జిల్లాకు ప్రధాన వ్యవసాయ ఆదరవు అయిన కేసీకెనాల్‌కు నీరు వచ్చేది. ఈ ఏడాది ఈ ప్రధాన ప్రాజెక్టులకు నీరు వచ్చే పరిస్థితులు ఇప్పట్లో కనిపించడం లేదు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే కడప రైతును కరువు కబళించక తప్పదు.

దేశాన్ని ముందుకు తీసుకువెళుతున్న మోదీ

● నోట్ల రద్దుతో బయటపడ్డ అవినీతి డబ్బు పేదలకు పంపిణీ ● దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నీ అవినీతిమయం : కందుల రాజమోహన్ రెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు కందుల రాజమోహన్‌రెడ్డి

కడప, అర్బన్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ ఈ మూడున్నరేళ్ళ పరిపాలనలో దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పర్చారని రాష్ట్ర బీజేపీ నాయకుడు కందుల రాజమోహన్ రెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 71 సంవత్సరాల స్వాతంత్ర భారతదేశంలో గతంలో పరిపాలించిన పాలకులు కుటుంబ పాలన సాగించారన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న భారతదేశంలో ప్రాంతీయ, వర్గ, కుల, మత బేదాలను ప్రోత్సహించారన్నారు. బీజేపీ పాలనలో అటువంటి విభేదాలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజలను సమానంగా న్యాయం చేస్తున్నారన్నారు. గత సంవత్సరం అమలు చేసిన నోట్ల రద్దుతో దేశంలో లక్షా 73 కోట్ల రూపాయలు నల్ల డబ్బు బయటపడిందని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారన్నారు. ఈ ధనాన్ని పేద ప్రజలకు త్వరలో పంపిణీ చేస్తారన్నారు. మోదీ విదేశీ పర్యటనల్లో అన్ని దేశాలతో సత్సంబంధాలపై మాట్లాడారన్నారు. భారత భూభాగాన్ని ఆక్రమించాలని చైనా కాలు దువ్వుతుంటే ప్రపంచ దేశాలన్నీ భారత్ కు మద్దతునిస్తున్నాయన్నారు. ప్రధాని విదేశీ పర్యటనల వలనే ఈ లాభం చేకూరిందన్నారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నీ అవినీతి, రాచరిక పాలన సాగిస్తున్నాయన్నారు. బీజేపీ కేవలం ప్రజాస్వామ్య పాలన సాగిస్తోందని తెలిపారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ గురించి బీజేపీ పెద్దలతో తాను మాట్లాడానన్నారు. కడప జిల్లాలో పర్యటించిన టాస్క్‌ఫోర్స్ తన నివేదికలో ఇక్కడి ఇనుము పనికిరాదని నివేదిక ఇచ్చిందని, దానిని పునః పరిశీలించాలని అడిగానన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వం నెల్లూరు, ఒంగోలు ప్రాంతాలలో ముడి సరుకు పరీక్షించనుందన్నారు. డిసెంబర్ 10వ తేదీలోగా నివేదిక ఇవ్వనుందని తాను ఇంకా ముందుగానే ఇవ్వాలని కోరానన్నారు.

జిల్లాకు రాష్ట్ర విభజన చట్టప్రకారం ఏమేమి రావాలో అన్నీ వస్తాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో బీజేపీ బూత్‌స్థాయి నుంచి అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల నిమిత్తం రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ఈనెల 29, 30న జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాష్ట్రంలో పర్యటిస్తారన్నారు. అందరూ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేఎంఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలమారెడ్డి, బీజేపీ నాయకులు సాంబశివా, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదినేని రామసుబ్బయ్య, నగర అధ్యక్షుడు ఎరిక లప్ప, నగర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2317 మంది ఎస్‌జీటీలకు

బదిలీ ఉత్తర్వులు విడుదల

శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి



ఇంటర్వ్యూ

కడప, ఎర్రముక్కపల్లె

జిల్లాలో బదిలీలకు సంబంధించి 2317 మంది ఎస్‌జీటీలకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ తెలిపారు. బదిలీల ప్రక్రియపై ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: బదిలీ ప్రక్రియ ఎప్పటి నుంచి ప్రారంభమైంది ?

జవాబు : జూలై 21 నుంచి ప్రారంభమైంది. అదే నెల 29వ తేదీ ముగియాల్సి ఉండగా అయితే కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా కొంత ఆలస్యం జరిగింది.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది ఉపాధ్యాయులకు బదిలీలు జరిగాయి?

జవాబు : 4650 మందికి బదిలీలు జరిగాయి.

ప్రశ్న: ఎస్‌జీటీల బదిలీల్లో చాలా ఆరోపణలు వచ్చాయి?

జవాబు: కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా మరికొన్ని సిబ్బంది చిన్న చిన్న పొరపాట్ల ద్వారా ఆరోపణలు వచ్చాయి కానీ అవన్నీ అధిగమించాం.

ప్రశ్న: ఎస్‌జీటీ బదిలీల్లో 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని ఏమి చేశారు?

జవాబు : లాంగ్ స్టాండింగ్ ఎస్‌జీటీలు కొంతమంది బదిలీలకు గైర్హాజరయ్యారు. వారి సీనియారిటీ ప్రకారం అది జనరేట్ అయిపోయింది.

ప్రశ్న: డీఈవో పూలింగ్‌లో వున్న ఉపాధ్యాయుల పరిస్థితి?

జవాబు : అవసరాన్ని బట్టి వారిని విధుల్లోకి తీసుకుంటాం.

ప్రశ్న: ఎంతమందికి నోటీసులు జారీ చేశారు?

జవాబు : బదిలీల ప్రక్రియకు గైర్హాజరైన ఉపాధ్యాయులు 43 మందికి నోటీసులు జారీ చేశాము.

నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో

కడప టీడీపీ నేతలు


ఎమ్మెల్సీ ఫరూక్‌తో కలిసి ప్రచారంలో హరిప్రసాద్, సుభాన్‌బాషా

కడప, అర్బన్: నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో గురువారం కడప టీడీపీ నేతలు పాల్గొన్నారు. నంద్యాలలోని 32, 33, 34 డివిజన్ లలో ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఫరూక్‌తో కలిసి కడప టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, మైనార్టీ నాయకుడు సుభాన్ బాష, నాగరాజు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్, సుభాన్ బాషా మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం ఖాయమన్నారు. అయితే అధిక మెజార్టీ కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఉర్దూ అకాడమి రాష్ట్ర చైర్మన్ నౌమాన్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

మబ్బులు ఉన్నప్పుడు వరికి యూరియా వేయవద్దు


రామనపల్లె వరి పొలాల్లో పొలంబడి

చెన్నూరు : ఆకాశంలో మబ్బులు ఉన్నప్పుడు వరిలో తెగుళ్ళు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆ సమయంలో వరికి యూరియా వేయవద్దని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామనపల్లె, చెన్నూరులలో పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వరిలో తెగుళ్ళ నివారణకు సూచనలిస్తూ ప్రస్తుతం ఎండుతెగుళ్ళ, తెల్లతెగుళ్ళ ఎక్కువగా ఉంటుందని ఎండుతెగుళ్ళ నివారణకు యూరియా వేయాల్సి వస్తే ముందుగా పొలం ఆరబెట్టి 10 కిలోల యూరియాకు 20 కిలోల పొటాష్ కలిపి వేయాలన్నారు. అలాగే బ్యాక్టయంమైషిష్ పిచికారి చేయాలన్నారు. తెల్లతెగుళ్ళ నివారణకు క్లోరోపైరీపాస్ మందును లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్లు లేక కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటికి రెండు గ్రాముల వంతున కలిపి పిచికారి చేయాలన్నారు. పొలం గట్ల మీద ఎలాంటి తెగుళ్ళు కలిగించే మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మాధురి, శివశంకర్, నలినీ, రైతులు రామనపల్లె సురేంద్రనాథరెడ్డి, ముండ్ల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం



బద్వేలు వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న రామసుబ్బారెడ్డి, కడపలో మాట్లాడుతున్న రామాంజులరెడ్డి తదితరులు

ఆంధ్రజ్యోతి, కడప సిటీ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స (ఏపీయూడబ్ల్యూజే) రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందని ఆ యూనియన్ నాయకులు రామాంజులరెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భవించి 60 ఏళ్ల అయిన సందర్భంగా గురువారం సాయంత్రం కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి జర్నలిస్టు నేతలు పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భవించిందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, ఇంటిస్థలాలు, హెల్త్‌కార్డులను మంజూరు చేయించిందన్నారు. డెస్క్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కూడా పోరాడుతుందన్నారు. పత్రికా స్వేచ్ఛపై జరిగే దాడిని ఎప్పటికప్పుడు ఖండిస్తూ రాజీ లేని పోరాటాలు చేస్తోందన్నారు.

కడప జిల్లాలో కూడా అ ర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటిస్థలాలు మం జూరు కావడంలో ఏపీయూడబ్ల్యూజేది ఎనలేని పాత్ర అన్నారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి మనకు రావాల్సిన హక్కులను ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్లు ఆంజనేయులు, శ్రీనివాసులు, నాగిరెడ్డి, కిశోర్, ప్రభాకర్‌రెడ్డి, కెమెరామెన్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

బద్వేలు : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆవిర్భావ దినోత్సవాన్ని బద్వేలులో ఏపీయూడబ్ల్యూజే నాయకుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. అనంతరం పట్టణంలోని వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే 1957 ఆగస్టు 17వ తేదీ ఆరంభమైన నాటి నుంచి జర్నలిస్టుల వృత్తి, వేతన భద్రత, సంక్షేమం, వృత్తి రక్షణ, పత్రికా స్వేచ్ఛ వంటి ప్రధాన అంశాల లక్ష్యంతో నాయకత్వం పనిచేసిందన్నారు. 60 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ పత్రికా స్వేచ్ఛను పరిరక్షణ దినంగా భావించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం

● రోడ్లన్నీ జలమయం - ఆనందంలో రైతులు




రాజంపేటలో వర్షం కురవడంతో జలమయమైన రోడ్లు, కొత్తబస్టాండు వద్ద భారీగా నిలిచిన వర్షపు నీరు

రాజంపేట టౌన్: జిల్లాలో గురువారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. దీంతో రోడ్లన్నీ జలమయ మయ్యాయి. రైతుల్లో ఒకింత ఆనందం వెల్లు వెత్తింది. రాజంపేటలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ మధ్యకాలంలో ఈ మాదిరిగా వర్షం రాజంపేటలో కురవలేదు. కురిసిన వర్షానికి రాజంపేట కొత్తబస్టాండు ప్రాంగణం, మార్కెట్‌లో, పోస్ట్ ఆఫీసు వద్ద వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ప్రధాన రహదారులన్నీ, వీధుల్లోని మెయిన్ రోడ్లు కూడా జలమయమ య్యాయి. మెయిన్ రోడ్లలో మోకాళ్ల లోతు మేర నీరు నిలిచింది. ఒక్కసారిగా ఉన్నట్లుండి వర్షం పడటంతో పాత బస్టాండులోని ప్రయాణికులు షాపుల్లోకి వెళ్లి తలదాచుకున్నారు. ఈ వర్షం కురవడంతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని పంటలు నీరు లేక ఇబ్బంది పడుతూ ఉండగా ఈ వర్షం కురవడంతో కొంత ఉపశమనం లభించిందని రైతులు అంటున్నారు.

పెద్దముడియం

పెద్దముడియం మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండలంలోని ఉలువపల్లె, పెద్దపసుపుల, ఎన్.కొట్టాలపల్లె గ్రామాల వద్ద వంకలు ఉరకలు వేశాయి. ఉలువపల్లె వంక రోడ్డుపై ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటల పాటు రవాణా ఆగిపోయింది. పొలాల్లో వర్షపు నీరు వేగంగా వచ్చి చేరడంతో మండలంలోని పలు కుంటలు, కోనేరులకు జలకళ వచ్చింది. పెద్దపసుపుల చెరువుకు వర్షపునీరు నెమ్మదిగా వచ్చి చేరుతోంది. పొలాల గట్ల వెంబడి ఉన్న ఉన్న పంట కాలువల్లో వర్షపునీరు ఉరకలు వేసింది. మొత్తం మీద ఈ ఏడాదిలో గురువారం కురిసిన వర్షం భారీ వర్షమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రైతాంగం సాగు చేసిన పత్తి, కంది, వరి పంటలకు ఆసరా దొరికినట్లు అయింది. మొత్తం మీద గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో చెక్‌డ్యాంల వద్ద నీరు ఉరకలు వేస్తూ కనిపించింది.




పెద్దముడియంలో ఉలువపల్లె రోడ్డుపై ప్రవహిస్తున్న వంక, ఉలువపల్లె వంక వద్ద నిలిచిన రవాణా

రోడ్డు ప్రమాదంలో

ముగ్గురు యువకులు మృతి

● ఒకరు సంఘటనా స్థలంలో - ఇద్దరు రిమ్స్‌లో

● రెండు ద్విచక్ర వాహనాలనూ ఢీకొన్న కారు



మృతి చెందిన వెంకటశివారెడ్డి




చికిత్స పొందుతూ రిమ్స్‌లో మృతి చెందిన వారు

కమలాపురం రూరల్: కమలాపురం మండల పరిధిలోని చదిపిరాళ్ల సమీపంలోని సాయిబాబా దేవాలయం వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందగా ఒకరు చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకెళితే... కడప నుంచి రెండు ద్విచక్ర వాహనాల్లో నలుగురు యువకులు పులివెందులలోని ఓ వివాహానికి హాజరై బయలుదేరగా చదిపిరాళ్ల గ్రామ సమీపంలోని సాయిబాబా దేవాలయం వద్దకు రాగానే ఎర్రగుంట్ల నుంచి కడప వైపు వస్తున్న ఏపీ04ఏవీ 0279 నెంబరు గల కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వెంకటశివారెడ్డి (25) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 ద్వారా కడప రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మహేష్(26), శ్యామ్ (25)లు మృతి చెందారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

ఘర్షణ కేసులో

14 రోజుల రిమాండ్

లింగాల : దొండ్లవాగు గ్రామంలో పొలం విషయంపై ఘర్షణ పడి దాడి చేసిన కేసులో గంగాధర్‌రెడ్డి అనే వ్యక్తికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గత నెల 6వ తేదీన దొండ్లవాగు గ్రామంలో ఓ పొలానికి సంబంధించి గంగాధర్‌రెడ్డి తన మేనమామపై దాడి చేశాడు. 13వ తేదీన ఈ ఘటనకు సంబంధించి అరెస్టు చేస్తారనే భయంతో లింగాల పోలీస్‌స్టేషన్ వద్ద వాస్మోల్ సేవించాడు. దీంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు కేసులకు సంబంధించి గురువారం అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరుపర్చగా గంగాధర్‌రెడ్డికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కల పెంపకంలో ఆదర్శవంతంగా ఉండాలి




మొక్కలు నాటుతున్న కలెక్టర్ బాబూరావునాయుడు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

రామాపురం: రాష్ట్రంలో మొక్కల పెంపకంలో జిల్లా ఆదర్శవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బాబూరావు నాయుడు అన్నారు. ఆర్‌హెచ్‌జీబీయం ఎస్ఎస్ ఆధ్వర్యంలో కుమ్మరపల్లె మెగా వాటర్‌షెడ్ పరిధిలోని బైనేని కొండ ప్రాంతంలో నాటిన అడవి మొక్కలను గురువారం ఆయన పరిశీలించారు. అడవి ప్రాంతం కావడంతో వేప, కానుగ, నేరేడు మొక్కలను నాటినట్లు ఆర్‌హెచ్‌జీబీయంఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి రత్నం కలెక్టర్‌కు వివరించారు. నాటిన మొక్కలు పచ్చదనంతో ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణ చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం ఐడబ్ల్యూఎంపీ వాటర్‌షెడ్‌లో నాటిన సపోట మొక్కలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులతో మొక్కల పెంపకానికి సంబంధించిన వివరాలను, వాటి సంరక్షణ, ఇతర అంశాలపై అడిగి తెలుసుకొన్నారు. రైతులు ఇష్టపడి పండ్ల మొక్కల పెంపకానికి ఆసక్తి చూపేటట్లయితే మరిన్ని మొక్కలు అందజేయాలన్నారు. కాకుళారం కేఎఫ్‌డబ్ల్యు సాయిల్ ప్రాజెక్టులో చేసే కనకాంబరాల పూల తోటలు, కూరగాయల తోటల్లో తిరిగి అక్కడి రైతులతో వాటి దిగుబడి, రాబడి గురించి అడిగి తెలుసుకొన్నారు. రైతులు వాతావరణానికి అనుకూలంగా పంటలు పండించాలని ఆయన సూచించారు. వాటర్ షెడ్ పరిధిలో నీటిపై అవగాహన కల్పించాలని, నాబార్డు ఏజీఎం శ్రీనివాసులు సలహా ఇచ్చారు. సాయిల్ ప్రాజెక్టుతో పాటుపై కార్యక్రమాలు కూడా టి. సుండుపల్లె, సంబేపల్లె మండలాల్లో చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడబ్ల్యుఎంపీ చంద్రకాంత్, టీఏలు రాచరాయుడు, ప్రభాకర్, రఫీ, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందులు

సిద్దవటం: మండల పరిధిలోని మూలపల్లె గ్రామంలో 195 పశువులకు నట్టల నివారణ మందులు తాపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ మహబూబ్‌బాషా, భాకరాపేట వైద్యుడు శివరామిరెడ్డి, మాచుపల్లె వైద్యాధికారి మాధవిలత, అట్లూరు మాధవరెడ్డి పశువులకు గర్భధారణ, సూటి, నట్టల నివారణ, గొంతు వాపు చికిత్సలు చేసి పశువులకు ఉచితంగా మందులు తాపారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మల్లు సంజీవరెడ్డి సూటి పశువులు ఉన్న రైతులకు ఉచితంగా ఎముకల పొడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్‌యాదవ్, పాడి రైతులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో రెవెన్యూ గ్రామసభ



ఓబులవారిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ నరసింహులు రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో రైతుల నుంచి భూముల ఆన్ లైన్ కోసం అధికంగా అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం ప్రత్యేకించి భూ సమస్యల పరిష్కారానికి రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భూముల ఆన్ లైన్, కుటుంబ సభ్యుల నుంచి విడిపోయిన వారికి భూముల పంపకం, తదితర విషయాలపైన ప్రత్యేకంగా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో ఆర్ఐ బాషా, వీఆర్వో రైతులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో రెండు రోజుల వర్క్‌షాపు





మ్యాట్‌ల్యాబ్ వర్క్‌షాపులో మాట్లాడుతున్న విక్రమ్, హాజరైన విద్యార్థులు

రాజంపేట రూరల్: స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంట్రడక్షన్ టు మ్యాట్‌ల్యాబ్ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాదు మ్యాట్‌ల్యాబ్ ట్రైనర్ విక్రమ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీఈ విభాగం విద్యార్థులకు పలు అంశాలపై ఆచారణాత్మకంగా వివరిస్తానని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ఎలక్ట్రానిక్స్ రంగం శాస్త్ర సాంకేతికతతో ముందుకు దూసుకెళుతుందని, దానికి కారణం మ్యాట్‌ల్యాబ్ అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ సీహెచ్ నాగరాజు, ప్రొఫెసర్ అబ్దుల్ రహీం, షాప్ కో-ఆర్డినేటర్ శ్యామలాదేవి, కె.రాముడు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎం.ఆర్ వ్యాక్సిన్ పిల్లలకు తప్పనిసరి

● మెడికల్ అధికారి డాక్టర్ సానె శేఖర్



చిన్నారికి ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ సానె శేఖర్

రాజంపేట టౌన్: ఎంఆర్ వ్యాక్సిన్ పిల్లలకు తప్పనిసరి అని రాజంపేట మెడికల్ అధికారి డాక్టర్ సానె శేఖర్ అన్నారు. గురువారం రాజంపేట పట్టణంలోని పలు అంగన్ వాడీ సెంటర్లలోని చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ టీకాను వేశారు. ముందుగా రాజంపేట పట్టణంలోని హైదర్ నగర్‌లో అంగన్ వాడీ టీచర్ భాగ్యవతి సమక్షంలో చిన్నారులకు టీకాను వేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సానె శేఖర్, శివకుమార్‌లు దగ్గరుండి ప్రతి చిన్నారికి టీకాలను వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తట్టు, రూబెల్లా వ్యాధి రాకుండా ఉండేందుకు టీకా వేస్తున్నా మన్నారు.

అలాగే పట్టణంలోని సాతుపల్లె అంగన్ వాడీ, కృష్ణానగర్ అంగన్ వాడీ, సుద్దగుంతల్ అంగన్ వాడీ, ఇంకా తదితర అంగన్ వాడీ సెంటర్లలో టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ జి.వి.రాజమ్మ, అంగన్ వాడీ కార్యకర్తలు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిరెడ్డిపల్లె పాఠశాల తనిఖీ

ఓబులవారిపల్లె: మండలంలోని బాలిరెడ్డి పల్లెలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్ రాజు తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులను విద్యాప్రగతిపై పలు ప్రశ్నలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు సిద్దారెడ్డి పాల్గొన్నారు.

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక

రాజంపేట టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో రాజంపేట నూతన నగర కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా కో-కన్వీనర్ సుబ్బరాయుడు హాజరై నగర కార్యదర్శిగా హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో బాగ్ కన్వీనర్‌గా ఆంజనేయులు, సహబాగ్ కన్వీనర్ తిరుమలేషు, ఉపాధ్యక్షులుగా సాయి, మహేష్, సతీష్, నగర సంయుక్త కార్యదర్శిగా అమృత, మణి, హాస్టల్ ఇన్ చార్జి మణికృష్ణ ఇంకా తదితరులను ఎన్నుకున్నారు. ఏబీవీపీ విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న శరత్, అమ్మ హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు

రాజంపేట: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను అందరితో పాటు సమానంగా చూడాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్ కుమార్‌రాజు అన్నారు. గురువారం మన్నూరు హైస్కూల్‌లోని భవిత సెంటర్‌లో ఉన్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు కువైట్ అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా విద్యాసామగ్రిని, సామాన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన శరత్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణి స్తున్నారని, వారి ఎదుగుదలకు ప్రతిఒక్కరూ తోడ్పడాలన్నారు. అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా గుణం ప్రశంసనీయమన్నారు. అనంతరం బ్యాగులు, టబ్బు, పలకలు, పెన్నులు, పుస్తకాలు, ఆటవస్తువులు, ప్లేట్లు ఇంకా తదితర సామన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది బి.వి.రమణారావు, లాయర్ సయ్యద్ నాసిరుద్దీన్, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సెక్రటరీ రమేష్, గౌరవ సలహాదారి పెంచల్, రాజంపేట కన్వీనర్ రమేష్‌బాబు, ప్రశాంత్, భవిత సెంటర్ టీచర్లు నాగమణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి



నరవకాటి పల్లెలో జరిగిన గ్రామసభలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

ఒంటిమిట్ట: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి సూచించారు. మండలంలోని నరవకాటిపల్లెలో గురువారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామసభల ద్వారా రైతులకు సంబంధించిన భూ సమస్యలను భూ రికార్డుల్లో తప్పులుదొర్లి ఉంటే సరిచేస్తామన్నారు. అనంతరం రైతులు భూ సమస్యలపైన గ్రామంలో దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అర్చన, వీఆర్వో చలపతి, సర్వేయర్ రామ్మోహన్, సర్పంచ్ నరసమ్మ, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల నిరసన

రాజంపేట: ఇల్లు, ఇంటి స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డులకై సీపీఐ పిలుపు మేరకు ఆగస్టు 17న జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలో భాగంగా గురువారం రాజంపేట ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మహేష్, ఎంఎస్ రాయుడులు మాట్లాడుతూ కడప జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, జిల్లాలోని రైతులందరికీ అన్ని రకాల బ్యాంక్ అప్పులు రద్దు చేయాలని, అర్హులైన వారికి 60 గజాల ఇంటి స్థలాలు ఇచ్చి గూడు కల్పించాలన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో అన్ని కులాలు, మతాల వారికి శ్మశాన వాటిక స్థలాలను కేటాయించాలన్నారు. గ్యాస్ సబ్సిడీ వ్యతిరేకిస్తూ నిర్వీర్యం అవుతున్న చౌక దుకాణాల పరిరక్షణ అవసరమన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రాన్ని అందించారు.



ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతి ఇస్తున్న సీపీఐ నాయకులు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు అందించాలి

● డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రైతులకు అందేలా చూడాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి సూచించారు. ఇక్కడి వెలుగు కార్యాలయంలో గురువారం ఒంటిమిట్ట, నందలూరు, సిద్దవటం, పెనగలూరు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలకు పండ్లతోటల పెంపకం, పశుగ్రాస క్షేత్రాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వెలుగు సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల లక్ష్యాలను సాధించేలా వెలుగు సిబ్బంది పనిచేయాలని చెప్పారు. పండ్లతోటల పెంపకం, పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుపై రైతులకు అవగాహన పెంచాలని సూచించారు. అందులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో రాజంపేట ఏరియా కో-ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, రాజంపేట ఒంటిమిట్ట ఏపీఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రామచంద్రారెడ్డి, హాజరైన వెలుగు సిబ్బంది

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

● పులివెందుల ఏఎస్పీ క్రిష్ణారావు


పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ క్రిష్ణారావు

సుండుపల్లె: ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు పులివెందుల ఏఎస్పీ క్రిష్ణారావు తెలిపారు. గురువారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌ను మొదటిసారి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మొక్కలను, పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్‌ను పరిశీలించడంతో పాటు రికార్డులను పరిశీలించి పోలీసులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం తమ పోలీసు సిబ్బంది ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎంతో కృషి చేస్తోందని, భవిష్యత్తులో కూడా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ఇసుక అక్రమ రవాణా, బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలియజేశారు. అసాంఘీక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై తమకు సమాచారం అందజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు. రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగా గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు వారి వివరాలను పోలీస్‌స్టేషన్ వద్ద అందజేసి అనుమతి పొందాలన్నారు. వినాయకుడి ప్రతిమల వద్ద అల్లర్లు సృషిస్తే కమిటీ సభ్యులే బాధ్యత తీసుకోవాలని హెచ్చరించారు. ఈయన వెంట రాయచోటి రూరల్ సీఐ నరసింహారాజు, సుండుపల్లె ఎస్ఐ నరసింహారెడ్డిలు ఉన్నారు.

రూబెల్లా, తట్టు వ్యాధులను తరిమికొట్టాలి

నందలూరు : ఎంఆర్ వ్యాక్సిన్ ద్వారా రూబెల్లా, తట్టు వ్యాధులను తరిమికొట్టాలని సీహెచ్ఓ పిల్లిపిచ్చయ్య పేర్కొన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి 15సంవత్సరా టల పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయడం జరుగుతోందన్నారు. ఈ వ్యాదులకు ఇంతకు ముందు టీకాలు వేయించి ఉన్నా, ప్రస్తుతం తప్పనిసరిగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని అన్నారు. గాంధీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పీహెచ్ ఎన్ షంషాద్‌బేగం, పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, విజయలక్ష్మీ, ఏఎన్ఎం సుజాత, అమృతవాణి, ఆశావర్కర్ వరలక్ష్మీ, వైద్యసిబ్బంది పిల్లలు పాల్గొన్నారు.


పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

మైనార్టీలకు ఇంటర్వ్యూలు

సిద్ధవటం : మండల వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు ఋణాలకు 600 మందికి ఇంటర్వ్యూలు గురువారం జరిగినట్లు ఎంపీడీవో జయసింహ తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువతి యువకులు 850మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 600మంది మాత్రమే హాజరైయ్యారని ఎంపీడీవో తెలిపారు. సిద్దవటం ఎస్‌బీఐ, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఉప్పరపల్లె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పాతకడప ఎస్‌బీఐ బ్యాంకు, భాకరాపేట, ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది, జన్మభూమి కమిటీ సభ్యులు జగదీష్‌కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాజశేఖర్ యాదవ్, పార్ల రమణయ్య, ప్రభుత్వ అధికారి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం రెవెన్యూ గ్రామసభలు

నందలూరు : రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ దార్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని టి.వి.పురం గ్రామంలో సర్పంచ్ దొమ్మరాజు జయసుధ అధ్యక్షతన రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సభల ద్వారా రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతోందన్నారు. భూ వివరాలు ఆధార్‌తో అనుసంధానం చేయడం జరుగుతోందన్నారు. కొన్ని సర్వే, సబ్ డివిజన్ నెంబర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కానందున వాటి నమోదు కొరకు తగు చర్యలు తీసుకొంటామన్నారు.

ఈ గ్రామసభలో రైతుల నుంచి 14 అర్జీలు వచ్చాయని, త్వరలో ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వో భోగాదయ్య, రైతులు పాల్గొన్నారు.

రామయ్య దర్శనం సంతోషకరం

ఒంటిమిట్ట : కోదండరామయ్యను దర్శించుకోవడం సంతోషకరంగా ఉందని చిత్తూరు జిల్లా తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ బి.దుర్గాభవానీ అన్నారు. గురువారం రాత్రి శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏకశిలా రామున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యుల ద్వారా తీర్థప్రసాదాలు స్వీకరించి ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలని నేడు అనేక మంది బాలికలు పాఠశాలల స్థాయిలో మధ్యలోనే చదువులను మానేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ బాలికలను పీజీ వరకు చదివించి వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె చెప్పారు. ఈమె వెంట ప్రొఫెసర్ల బృందం ఉన్నారు.


దుర్గాభవానీకి ఆలయ చరిత్రను వివరిస్తున్న రాఘవాచార్యులు

సినిమా గైడ్

రాజంపేట

సమద్ :లై
సుదర్శన్ :నేనే రాజు నేనే మంత్రి
పీవై :ఫిదా
బీఎస్: నక్షత్రం
ఎన్ఎస్ఆర్: జయజానకి నాయక

వివాహితపట్ల అసభ్య ప్రవర్తన

ఒంటిమిట్ట : మండలంలోని కోనరాజుపల్లె గ్రామానికి చెందిన బాలిపోగు కదిరయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బాలిపోగు చిన్నసుబ్బయ్యతో పాటు మరికొందరు కలిసి దాడి చేసినట్లు ఎస్ఐ ధనుంజేయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు.. బాలిపోగు కదిరయ్య, అతని తమ్ముడి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 13వ తేదీన చింతరాజుపల్లె అరుంధతివాడలో జరిగిన వివాహానికి హాజరైయ్యారు. అక్కడ కదిరయ్య మరదలైన బాలిపోగు బుజ్జమ్మ పట్ల చిన్న సుబ్బయ్య అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం తెలుసుకున్న కదిరయ్య కోపంతో చిన్న సుబ్బయ్యను మందలించాడు. దీనిపై ఆగ్రహించిన చిన్న సుబ్బయ్య మరో నలుగురు వ్యక్తులతో కలిసి ఇంటికి స్కూటర్‌పై వెళుతున్న కదిరయ్యను అమ్మవారిపల్లె గ్రామం వద్ద అడ్డగించి పాదరక్షలతో దాడి చేశాడు. ఈ సంఘటనపై బాధితుడు కదిరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్న సుబ్బయ్యతో పాటు వెంకటసుబ్బయ్య, నాగేంద్ర, సుధాకర్, సుబ్బయ్యలపైన గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కొటికేవాండ్లపల్లెలో వైద్య శిబిరం

సుండుపల్లె: చిన్నగొల్లపల్లెలోని కొటికేవాండ్లపల్లెను పట్టి పీడిస్తున్న జ్వరాలు అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి జిల్లా మలేరియా అధికారి త్యాగరాజు, సుండుపల్లె వైద్యాధికారిణి సమీరా, ఆరోగ్య సిబ్బంది గురువారం కొటికేవాండ్లపల్లెలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి లార్వాను పరిశీలించారు. వైద్యశిబిరంలో 30 మందికి వైద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరిసర ప్రాంతాల్లో అబేట్ చల్లించారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి త్యాగరాజు మాట్లాడుతూ జ్వరాలు ఉన్నాయని, లార్వా కూడా ఎక్కువగానే ఉందని తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశీలించి ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం ధరి చేరకుండా చూసుకోవాలన్నారు.

అలాగే వారినికి ఒకసారి డ్రైడే పాటించేలా చూసుకోవాలని వివరించాలన్నారు. ఈయన వెంట సబ్‌యూనిట్ ఆఫీసర్ జయచంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్ శివారెడ్డి వైద్య సేవలు అందించారు.


లార్వాను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ఫేస్‌బుక్‌తో వల.. చిక్కారో విలవిల



సరదా కోసం ఫేస్‌బుక్

హృతిక్‌రెడ్డి, డిగ్రీ విద్యార్థి, రాయచోటి

సరదా కోసం నేను ఫేస్‌బుక్‌ను వాడుతున్నా.. ఫ్రెండ్స్ అందరికీ ఫేస్‌బుక్ అకౌంటు ఉంది. అయితే మంచి పనుల కోసమే వినియోగించుకోవాలి. తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

రాయచోటి

● జిల్లాలోని ఖాజీపేటలో తండ్రి నడుపుతున్న టీ దుకాణంలో పని చేస్తున్న యువకుడు కొన్ని నెలల కిందట అనూహ్యంగా ఉరి వేసుకుని చనిపోయాడు.అతని మృతిపైన అక్కడి పోలీసులు విచారించగా దిమ్మతిరిగే విషయాలు బయటపడ్డాయి. టీ దుకాణం యజమాని తన కొడుక్కి ఒక కొత్త ఆండ్రాయిడ్ ఫోన్‌ను కొనిచ్చాడు. ఆ ఫోన్‌ను వాడుకుంటున్న ఆయన కొడుకు కొత్తగా ఫేస్‌బుక్ అకౌంటుతెరిచాడు. ఒకరోజు ఎవరో అమ్మాయి పేరు కనపడడంతో ఇతను ఆ అకౌంటుకు ఫ్రెండ్ రిక్వెస్టు పంపించాడు. వెంటనే అక్కడి నుంచి రిప్లై వచ్చింది. తొలుత చాటింగ్.. ఆ తరువాత స్వయంగా ఫోన్ చేశారు. ఎవరో అమ్మాయి మాట్లాడడంతో.. టీ కొట్టు అబ్బాయి కూడా మాటలు కలిపాడు. ఇద్దరూ కొన్ని నెలల పాటు ప్రేమకబుర్లు చెప్పుకున్నారు. దీన్ని అలుసుగా తీసుకుని ఏదో ఒక అవసరం ఉందంటూ.. అవతల నుంచి అమ్మాయి అడగడంతో .. అప్పు చేసి పలుమార్లు కలిపి సుమారు రూ.70 వేల వరకు ఆ అమ్మాయి బ్యాంకు అకౌంటులో వేశాడు. అయితే ఆ తరువాత తాను మోసపోయానేమో అనే అనుమానం టీ కొట్టు అబ్బాయికి వచ్చింది. ఇంతలో ఇతను రూ.80 వేలు అప్పు చేసిన విషయం కుటుంబ సభ్యులకు తెలిసి నిలదీయడంతో.. ఉరి వేసుకుని చనిపోయాడు. పోలీసుల విచారణలో అతనితో ఫ్రెండ్ షిప్ చేసింది అమ్మాయి కాదని.. అతనికి అమ్మాయిలాగా మాట్లాడడం బాగా వచ్చని బయట పడింది. ఇలా అతని చేతిలో సుమారు పదిమంది వరకు మోసపోయినట్లు గుర్తించారు. నిందితుని ఖాజీపేట పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

● తూర్పుగోదావరి జిల్లాలో ఇటీవల ఒక అమ్మాయి విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఫేస్‌బుక్‌లో పరిచయం అయిన ఒకడు.. బాగా దగ్గర అయి.. ఇప్పుడు పెళ్లి చేసుకోవడం లేదంటూ.. బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసింది.. పై మూడు సంఘటనల్లోనూ ఫేస్‌బుక్ ద్వారానే అమాయకులు బలి అయిపోయారు. స్నేహం కోసం వాడుకోవాల్సిన ఫేస్‌బుక్‌తో సమస్యల్లోకి వెళ్లారు.

అపరిపక్వ వయసు...

అనాలోచిత.. అవాంఛిత కోర్కెలు..

చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్.. జియో వంటి నెట్‌వర్క్‌ల అపరిమిత ఉచిత నెట్ సేవలు.. దీంతో సామాజికమాధ్యమం మత్తులో యువత కూరుకుపోతోంది. ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమం కోరల్లో చిక్కి అనర్థాలు తెచ్చుకుంటున్నారు. అవతల మనిషి ఎలా ఉంటాడో.. తెలియదు.. అసలు ఆడో.. మగో కూడా తెలియదు.. ప్రభాస్, కోహ్లీ.. సచిన్.. తమన్నా.. అనుష్క.. సాయి పల్లవి వంటి వాళ్ల అందమైన ఫొటోలతో.. ప్రొఫైల్.. స్నేహం చేయాలంటూ.. రిక్వెస్ట్ రాగానే.. వెనుకా ముందు చూడకుండా యాక్సెప్ట్ చేయడం.. వాళ్ళతో చాటింగ్ చేయడం.. మొదలు పెట్టేస్తున్నారు. చాటింగ్‌తో ఫ్రెండ్‌షిప్ మొదలు పెట్టి.. చీటింగ్‌కు గురై పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఫేస్‌బుక్ ఫ్రెండ్‌షిప్‌తో కేటుగాళ్ల చేతిలో అమ్మాయిలు మోసపోవడం.. కిలాడీల చేతిలో అబ్బాయిలు మోసపోవడం నిత్యం చూస్తూనే ఉన్నాం.



చట్టం నుంచి తప్పించుకోలేరు:

సీఐ మహేశ్వర్‌రెడ్డి, రాయచోటి

ఇటీవల కాలంలో ఆండ్రాయిడ్, ఐఎస్‌వో ఫోన్లు ఎక్కువగా మార్కెట్‌లో లభిస్తున్నాయి. అదే సమయంలో నెట్ సేవలు అతి చౌకగా లభిస్తున్నాయి. అందువల్ల యువత ఎక్కువగా సెల్‌ఫోన్‌కు అలవాటు పడుతోంది. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సోషల్ మీడియా కూడా అలవాటుగా మారుతోంది. కొత్త పరిచయాలవల్ల తప్పులు జరుగుతున్నాయి. అమ్మాయిలు, అబ్బాయిలు ఇరువైపుల నుంచి తప్పులు జరుగుతున్నాయి. అయితే కొందరు మోసగాళ్లు దీన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. అటువంటి మోసగాళ్లు చట్టం నుంచి తప్పించుకోలేరు. బాధితులు కూడా మోసపోయిన తరువాతైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలి. అప్పుడే మోసగాళ్లను అరికట్టగలం. ప్రేమ, ఉద్యోగాలు, పెళ్ళిళ్ల వంటి పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు.



యువత జాగ్రత్తగా ఉండాలి

రామసునీల్‌రెడ్డి, ఓ విద్యాసంస్థ కరస్పాండెంట్ , రాయచోటి

యువత సామాజిక మాధ్యమం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అవతలి వ్యక్తులు ఎటువంటి వాళ్లో తెలియకుండా.. వాళ్లతో స్నేహం చేయడం తప్పు.. మన వ్యక్తిగత అంశాలు పంచుకోవడం ఇంకా తప్పు. ఏదో సరదాగా ఉపయోగించుకోవాల్సిన ఫేస్‌బుక్‌తో సమస్యలు తెచ్చుకోవడం బాధాకరం. పిల్లలకు ఆండ్రాయిడ్ ఫోన్లు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు ఆలోచించుకోవాలి.



కమ్యూనికేషన్ కోసం ఫేస్‌బుక్

నాగేంద్ర, డిగ్రీ విద్యార్థి, రాయచోటి

నా స్నేహితులతో కమ్యూనికేషన్ కోసమే నేను ఫేస్‌బుక్‌ను వాడుతున్నా. అదే సమయంలో నా ఆలోచనలు, భావాలను నా స్నేహితులతో పంచుకుంటా. ఫేస్‌బుక్‌ను వాడడంలో అప్రమత్తంగా ఉండాలి. ఫేస్‌బుక్ అకౌంటు ఉండడం ప్రతిష్ఠగా యువత భావించకూడదు. ప్రత్యేకించి అమ్మాయిలు ఫేస్‌బుక్ వినియోగంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి.

జాగ్రత్త లేకపోతే.. సమస్యలే

తెలిసీ తెలియని వయసులో ఉన్న యవతతో పాటు ఒంటరిగా ఉన్న అమ్మాయిలు, మహిళలు మోసగాళ్ళకు చిక్కుతున్నారు. తొలుత తీయని మాటలతో పరిచయం మొదలు పెట్టి.. తరువాత తమ విశ్వరూపం చూపుతున్నారు. వ్యక్తిగత విషయాలు తెలుసుకుని, ఏకాంతంగా ఉన్న ఫొటోలు తీసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా రోజూ జరుగుతూనే ఉన్నాయి. సరదాగా మొదలు పెట్టిన ఫేస్‌బుక్.. ప్రాణాలు తీసే.. ప్రమాదకర ఆటగా మారుతోంది. పిల్లలకు విలువైన ఫోన్లను కొనిస్తున్న తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలి. వారేం చేస్తున్నారో ఓ కంట కనిపెడుతూ ఉండాల్సిన అవసరం ఉంది.

అక్రమాలకు అడ్డాగా వీఎన్‌పల్లె

ప్రొద్దుటూరు

వీరపునాయునిపల్లె మండలం భూ అక్రమాలకు అడ్డాగా మారింది. లేని భూములకు పట్టాలు పుట్టించి బ్యాంకుల పుట్టిముంచుతున్న ఎందరో అక్రమార్కులకు ఈ మండలంలోని కొందరు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే ఓ కీలక రెవెన్యూ అధికారే ఇందులో ప్రధానపాత్ర వహించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారంటూ సహకార శాఖలోని ఓ అధికారి జిల్లా అధికార యంత్రాంగానికి నివేదిక కూడా సమర్పించినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకుంటే తప్పుడు పత్రాలు సృష్టించిన కీలక అధికారి జైలుకుపోయే అవకాశాలున్నట్లు సమాచారం. కొన్నేళ్లుగా ఇదే మండలంలో పనిచేస్తున్న ఈ అధికారి వేలాది రూపాయలు ముట్టచెబితే ఏదో ఒక సర్వే నంబరుతో భూమి హక్కు పత్రాన్ని తయారు చేసి ఇవ్వడం, అవసరం లేదనుకున్నప్పుడు దాన్ని తొలగించడం అలవాటై పోయిందని విశ్వసనీయ సమాచారం. భూమి ఎక్కడుందో కూడా తెలియని కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాల ద్వారా పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీ విత్తనాలతోపాటు అనేక పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నట్లు తెలుస్తోంది. పండ్ల తోటల పెంపకం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకు సంబంధించి కూడా ఈ మండలంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు కలిగిన వ్యక్తులు అడ్డదారిన లబ్ధిపొందిన ట్లు తెలుస్తోంది. దీనికితోడు కొంత మంది అధికారులు కూడా వీరికి సహకరిస్తుండటంతో ప్రభుత్వం రైతుల అభివృద్ధికోసం ఖర్చు చేస్తున్న ప్రజాధనం దుర్వినియోగమవుతున్నట్లు స్పష్టమవుతోంది. ఉపాధి హామీలో కూడా మొక్కలు నాటినట్లు చూపుతూ లెక్కలు మెక్కారనేది ఆరోపణలున్నాయి. ఈ తతంగం పై ఉన్నతస్థాయి అధికార వర్గం సమగ్రమైన విచారణ నిర్వహిస్తే వాస్తవాలు బహిర్గతమయ్యే అవకాశాలున్నాయి. కాగా గతంలో ఆరెకరాల పొలం ఉన్న ఓ రైతు తన చుట్టూ ఉన్న ప్రభుత్వ పొలాన్ని సాగు చేసుకుని వాటికి పట్టాలు తయారు చేయించుకుని సుమారు వంద ఎకరాల ఆసామిగా ఎదిగారనేది సమాచారం. చింతలమడుగు పల్లె సొసైటీలో రుణం కోసం ఇచ్చిన పత్రాలను పరిశీలిస్తే ఆ సర్వే నంబర్లకు సంబంధించిన భూమి చెరువుగా తేలినట్లు సమాచారం.

● ఆయనపై ఎందుకంత మమకారం?

కొన్నేళ్లుగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తూ భూమిలేని వ్యక్తులకు కూడా పట్టాలను అందించిన ఆ అధికారిపై ఉన్నతస్థాయి అధికార వర్గానికి ఎందుకంత మమకారమో అంటూ ప్రజలు పేర్కొంటున్నారు. ఆయనపై పలు దఫాలుగా అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికి కనీసం ఆయన్ను బదిలీ కూడా చేయకుండా ఇక్కడే కొనసాగించడంపై పలువురు చర్చించుకుంటున్నారు. ఎక్కువ భాగం ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఓ రైతు ఈ అధికారికి బినామీగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూములను రైతుల పేర్లతో రికార్డుల్లో ఎక్కించి ఆ పత్రాల ఆధారంగా కోట్లాది రూపాయలను రుణాలుగా తీసుకుని పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి వీరపునాయునిపల్లె మండలంలో కొంత కాలంగా ప్రభుత్వం నుంచి రైతులకు అందుతున్న సాయం పూర్తిస్థాయిలో సద్వినియోగం అయిందా లేదా అనేది తేల్చాలని ప్రజలు విన్నవిస్తున్నారు. త్వరలో పత్తిపంట నష్టానికి సంబంధించి ఈ మండలానికి సుమారు రూ.కోటి వరకు పరిహారం అందే అవకాశాలు ఉన్నాయని, కనీసం ఆ మొత్తాన్ని అయినా అక్రమార్కులకు చెందకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● ఈ అంశంపై వీరపునాయునిపల్లె తహసీల్దార్ బి.కృష్ణానాయక్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అక్రమాలు జరిగాయనేది తన దృష్టికి కూడా వచ్చిందన్నారు. ఎవరు చేసింది తాను చెప్పలేనని, వివిధ పనుల్లో బిజీగా ఉండటం వల్ల పరిశీలించలేకపోయానని పేర్కొన్నారు. నకిలీ పత్రాలు పంపిణీ చేసిన విషయం చాలా పాతదని, ఇప్పుడు అలాంటివి జరగడంలేదని వివరించారు.

మినీ లోకం



నువ్వే నిలువెత్తు బంగారానివి డియర్...
నీకు బంగారంతో పనేంటి...!

అడుగంటిన సాగునీటి ప్రాజెక్టులు

కడప, ఆంధ్రజ్యోతి

జిల్లాలో నదులన్నీ ఎండిపోయాయి. కేసీకెనాల్‌కు నీరు రాలేదు. సాగునీటి ప్రాజెక్టులు అడుగంటాయి. ఈ పరిస్థితి కఠోర కరువుకు సాక్ష్యంగా దర్శనమిస్తోంది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను పరిశీలిస్తే ఒకటి, రెండు ప్రాజెక్టుల్లో మాత్రమే డెడ్‌స్టోరేజీ వుండగా కొన్ని ప్రాజెక్టుల్లో చెమ్మ ఆరుతోంది. దీంతో సాగునీటి ప్రాజెక్టుల కింద ఆయకట్టు సాగుకు గడ్డుకాలం ఏర్పడింది. ఒక్క కేసీకెనాల్ కిందనే సుమారు 1.20 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది. కాలువకు నీరు వస్తే కనీసం 90 వేల ఎకరాలు సాగులోకి వచ్చేది. బ్రహ్మంసాగర్ కింద 1.60 లక్షల ఎకరాల ఆయకట్టు వుంది. గండికోట ప్రాజెక్టు కిందనే 60 వేల ఎకరాలకు సాగునీరివ్వాలని అంచనాలు వేశారు. గాలేరు-నగరి కింద 1.55 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు వుంది. చిన్నా చితక ప్రాజెక్టుల కింద వేల ఎకరాల్లో ఆయకట్టు సాగులోకి రావాల్సి వుంది. జిల్లాలో నీటి నిల్వ వుంచుకునేందుకు ఏ జిల్లాలో లేని విధంగా సాగునీటి ప్రాజెక్టులు వున్నా అలంకారప్రాయంగా మారాయి.

అడుగంటిన దశలో...

సాగునీటి ప్రాజెక్టులు జిల్లాలో నీరులేక వెలవెలబోతున్నాయి. జిల్లాలో తెలుగుగంగ, గాలేరు-నగరి కింద పలు రిజర్వాయర్లు వున్నాయి. వీటితో పాటు చిత్రావతి, మైలవరం, అన్నమయ్య, వెలిగల్లు, పైడిపాలెం, పింఛా తదితర ప్రాజెక్టులు వున్నప్పటికీ ఈ ఏడు వాటి ద్వారా ప్రయోజనం కలిగే పరిస్థితులు కనిపించడం లేదు. 17.730 టీఎంసీల సామర్థ్యం గల బ్రహ్మంసాగర్‌లో 2.43 టీఎంసీల నీరు మాత్రమే వుండగా 26.850 టీఎంసీల సామర్థ్యం కలిగిన గండికోట ప్రాజెక్టులో కేవలం 0.820 టీఎంసీలు మాత్రమే నీరు వుంది. డెడ్‌స్టోరేజీ కంటే తక్కువగా మాత్రమే ఇక్కడ నీరు వుంది. 10 టీఎంసీల సామర్థ్యం కలిగిన సీబీఆర్‌లో పూర్తిగా నీరు అడుగంటింది. కేవలం 0.166 టీఎంసీల నీరు మాత్రమే వుండగా 9.960 టీఎంసీల సామర్థ్యం కలిగిన మైలవరంలో కూడా డెడ్‌స్టోరేజీ కంటే అట్టడుగున 0.481 టీఎంసీల నీరు మాత్రమే వుంది. చిన్న ప్రాజెక్టు వెలిగల్లులో 4.640 టీఎంసీల సామర్థ్యానికి 1.428 టీఎంసీల నీరు వుంది. మిగిలిన రిజర్వాయర్లలో పూర్తిగా నీరు అడుగంటింది. వర్షాభావంతో కరువు కాటుకు గురైన రైతు ప్రాజెక్టుల ద్వారా కూడా ప్రయోజనం లేకపోవడంతో తీవ్రవేదనకు గురవుతున్నారు.

నెమ్మదించిన జీవనోపాధులు

● ముందుకు కదలని ప్రతిపాదనలు ● ఆర్థికసాయం కోసం ఎదురుచూపులు



అగర్‌బత్తీల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం





అగర్‌బత్తీలను తయారు చేస్తున్న మహిళలు, తయారుఅయిన అగర్ బత్తీలు

ప్రొద్దుటూరు: ప్రభుత్వం మహిళల కోసం రూపొందించిన జీవనోపాధుల కార్యక్రమం ఇటీవలి కాలంలో కొంతమేర నెమ్మదించింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మెరుగైన జీవనోపాదుల కల్పనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోనే వారికి ఉపాధి మార్గాలు చూపేందుకు పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పలు రంగాల్లో మహిళలకు శిక్షణలిచ్చారు. కుట్లు, అల్లికలు, తినుబండారాల తయారీ నుంచి దుస్తులు నేయడం, గార్మెంట్ దుస్తుల తయారీ, అగర్‌బత్తీల తయారీ లాంటి తదితర రంగాల్లో డీఆర్‌డీఏ, వెలుగు పథకం ద్వారా మహిళలకు శిక్షణలిచ్చారు. ఈ శిక్షణలు పొందిన వారికి వివిధ రుణసాయం అందించి ఇంటి వద్దనే ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవనోపాధులను మరింత మెరుగుపరిచేందుకు గత కొన్ని సంవత్సరాలు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఒక్క టైలరింగ్‌లోనే 1711 మంది సభ్యులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారు. ఇందులో కొంతమంది సభ్యులు నెలకు సుమారు రూ.5 వేల వరకు ఇంటి వద్దనే ఉంటూ సంపాదిస్తున్నారు. ఇక కొండాపురం, ముద్దనూరు మండలాల్లో గత ఏడాది సాంఘిక సంక్షేమ శాఖ, ఈ ఏడాది బీసీ సంక్షేమ శాఖల వసతి గృహ విద్యార్థులకు 8 వేల జతల దుస్తులను తయారు చేసే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కానీ ఇటీవలి కాలంలో ప్రత్యేకించి జీవనోపాధుల కోసం మహిళలకు ఇచ్చే శిక్షణలు బాగా తగ్గించినట్లు తెలుస్తోంది. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా నిర్వహించే తినుబండారాల తయారీ శిక్షణకు పరిమితమైనట్లు తెలుస్తోంది.

ముందుకు కదలని ప్రతిపాదనలు : మెరుగైన జీవనోపాధుల కల్పనలో భాగంగా శిక్షణ పొందిన మహిళలకు ఉపాధి కల్పించేందుకు రూపొందించిన ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదనేది సమాచారం. పాడి పంటల తర్వాత జిల్లాలో వేలాది మంది కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు పలుచోట్ల కొత్త మగ్గాలు కావాలంటూ డీఆర్‌డీఏ వెలుగు నిర్వహించిన సర్వేలో కోరారు. ఇందులో భాగంగా సిద్దవటం మండలంలోని మాధవరంలో సభ్యులకు చేనేత రంగంలో మరింత మెరుగైన శిక్షణ ఇచ్చి వారికి మగ్గాలను ఇవ్వాలనేది ఒక ప్రతిపాదన. దీంతో పాటు మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాలలో మహిళ సభ్యులు మరగ్గాలను కోరారు. ఒక్కొక్క యూనిట్ ధర రూ.65 వేలు ఉంటుంది. సుమారు 38 పవర్ లూమ్ యూనిట్స్ కావాలంటూ ప్రతిపాదనలు పంపారు. సుమారు నెలన్నరకు పైగా ఈ ప్రతిపాదనలు అలాగే ఉన్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు మరికొన్ని ప్రాతిపాదనలు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

ఆర్థిక సాయం కోసం : పేదరిక నిర్మూలనకు నాబార్డు కూడా చర్యలు తీసుకుంటుంది. నాబార్డు ఆర్థికసాయంతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు శిక్షణలిస్తున్నారు. ఇందులో భాగంగా 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దువ్వూరు మండల కేంద్రంలో అగరుబత్తీల తయారీలో శిక్షణ ఇచ్చారు. కర్నూలు నుంచి ట్రైనర్లను తీసుకొచ్చారు. రెండు నెలల వ్యవధిలో 101 మందికి శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారిలో అగర్‌బత్తీల పరిశ్రమ ఏర్పాటు చేసుకునేందుకు 51 మంది ముందుకొచ్చారు. ఇందులో ఒక్కొక్కరికి రూ.1.60 లక్షల నుంచి రూ.1.90 లక్షల వరకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ మొత్తంలో 33 శాతం మేర పరిశ్రమల శాఖ నుంచి పీఎంఈజీపీ కింద యూనిట్లకు సబ్సిడీ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించారు. దువ్వూరులోని స్టేట్ బ్యాంక్ 35 మందికి, గుడిపాడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ 16 మందికి ఆర్థిక సాయం అందించేందుకు ఒప్పుకున్నారు. కానీ ఉన్నఫళంగా ఈ పక్రియ ఆగిపోవడంతో మహిళా సభ్యులు ఆర్థికసాయం కోసం ఎదురు చూస్తున్నారు.

రుణం కోసం ఎదురుచూపులు



వెలుగు ద్వారా అగర్‌బత్తీల తయారీ శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకున్నాం. అప్పటి అధికారులు డ్వాక్రా మహిళలకు ఆర్థిక స్వావలంబన అందించేందుకు శిక్షణ తీసుకున్న మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామన్నారు. ఏడాది గడుస్తున్నా రుణం అందకపోవడంతో అగర్‌బత్తీల మిషన్‌ను కొనుగోలు చేయలేకపోయాం.

- చౌడూరు వరాలు, దువ్వూరు

బ్యాంకుల చుట్టూ తిరిగాం



అగర్‌బత్తీల తయారీలో నెల రోజులపాటు శిక్షణ పూర్తి చేసుకున్నాం. తయారీకి మిషన్‌ను ప్రభుత్వమే బ్యాంకు ద్వారా అందిస్తామన్నారు. పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. అగర్‌బత్తీ తయారీ మిషన్ అందిస్తే కుటుంబాన్ని పోషించుకునేందుకు వీలవుతుంది.

- కొర్రపాటి సులోచన, దువ్వూరు

8 నెలలు గడుస్తున్నా.....



8 నెలల నుంచి రుణాలు ఇస్తామంటున్నారు. బ్యాంకులలో అన్ని ఆధారాలు అందజేశాం. ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆదుకునేందుకు రుణాలు అందజేస్తే మరికొంతమంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తాం. రుణాలు అందిస్తే ఉపాధి దక్కుతుంది. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి జిల్లాకు పేరు తెస్తాం.

- గంటెన లక్ష్మీదేవి, దువ్వూరు

19న మోదుగుల పెంచలయ్య

పెంచలకోన మహా పాదయాత్ర

రాజంపేట : శ్రీ అన్నమాచార్య ఇంజనీరింగ్ విద్యాసంస్థల అధినేత మోదుగుల పెంచలయ్య అధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఉదయం 6 గంటలకు మహాపాదయాత్ర జరుగుతుందని కన్వీనర్ అజయ్‌బాబు తెలిపారు. సుమారు 100 రోజులుగా దీక్ష చేస్తున్న మోదుగుల పెంచలయ్య అధ్వర్యంలో సుమారు 1000 మంది ఈ మహా పాదయాత్రలో పాల్గొంటారన్నారు. రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, జిల్లాలోని అనేక ప్రాంతాలు చిత్తూరు జిల్లా నుంచి ఈ మహా పాదయాత్రలో వందలాది మంది భక్తులు పాల్గొంటారన్నారు. రాజంపేట నుంచి శనివారం ఉదయం 6 గంటలకు ఈ మహా పాదయాత్ర ప్రారంభమై హత్యరాల, బెస్తపల్లె, చక్రంపేట, చిట్వేలి, రాజుకుంట, రాపూరు మార్గాల ద్వారా పెంచలకోనకు ఈ పాదయాత్ర జరుగుతుందన్నారు. సుమారు 17 సంవత్సరాలుగా నిరంతరాయంగా పెంచలకోన నృసింహస్వామిపై అపరభక్తితో ఈ దీక్ష చేస్తున్నారన్నారు. ప్రతి ఏడాది వంద రోజుల పాటు దీక్ష చేసి తదనంతరం పాదయాత్ర నిర్వహించడం పెంచలయ్యకు ఆనవాయితీగా వస్తోందన్నారు. అదే క్రమంలో వంద రోజులు దీక్ష పూర్తి చేసి శనివారం మహా పాదయాత్రకు బయలుదేరుతున్న మోదుగుల పెంచలయ్య పాదయాత్రలో అందరూ పాల్గొంటారని అజయ్‌బాబు వెల్లడించారు.

బిరబిర రైల్వే బ్రిడ్జి నిర్మాణం


శరవేగంగా కడప-రాయచోటి మార్గంలోని ఆర్‌ఓబి పనులు

కడప , రవీంద్రనగర్

కడప-రాయచోటి రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ బ్రిడ్జి నిర్మాణ వ్యవధి రెండు సంవత్సరాలు మాత్రమే ఇచ్చినందున నిర్మాణ పనులు ఊపం దుకున్నాయి. 2016 నవంబర్‌లో మొదలు పెట్టిన ఈ బ్రిడ్జి 2018 ఆగస్టునాటికి పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఎండా, వాన, గాలితో సంబంధం లేకుండా పనులు జరుగుతున్నాయి. రాయచోటి రైల్వేగేటు వలన చాలా మంది బస్సులలో వెళ్ళే ప్రయాణీకులు, వాహనదారులు, స్కూల్‌కు వెళ్ళే పిల్లలు రైల్వేగేటు వేసి నపుడు గంటల కొద్దీ వేచి ఉండాలి. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు పని చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఈ మార్గమంతా గుంతలతో నిండిపోయి బురదమయమై వాహనాలు పోవడానికి ఇబ్బందిగా మారింది. హైవే కావడంతో వాహనాల రద్దీతో వర్షం వచ్చినపుడు గుంతలలో నీరు చేరడంతో వాహనాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. స్పీడ్‌గా వచ్చే వాహనాలు కిందపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. దెబ్బతిన్న ప్రాంతంలో గ్రావెల్ తోలించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.



రైల్వేగేటుతో భలే ఇబ్బందులు
గంగులయ్య, టీచర్

కడప-రాయచోటి మార్గంలో సీకే దిన్నెవద్ద రైల్వేగేటు వేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయితే ఇబ్బంది లేకుండా బాగుంటుంది.



వాహన దారుల అగచాట్లు
రవీంద్రనాథ్, దుకాణదారుడు

గుంతల రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అందులో రైల్వేగేటు వేసినపుడు వర్షం వస్తే వెయిటింగ్ చేయాలంటే కష్టంగా ఉంది. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా కావాలని కోరుకుంటున్నాం.



గుంతల మయంగా మారిన రోడ్డు
శ్రీనివాసులు, టైలర్

బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కానీ రోడ్లు గుంతలు పడి వర్షం వచ్చినపుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నాం.


శరవేగంగా జరుగుతున్న కడప-రాయచోటి మార్గం చింతకొమ్మదిన్నెవద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు



నష్టపరిహారం అందించి కాలువలు పూర్తి చేయాలి
ధనిశెట్టి ఓబయ్య, మాజీ నీటి సంఘం అధ్యక్షులు. పోరుమామిళ్ల.

తెలుగుగంగ కాలువ నిర్మాణాలకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి పెండింగ్ కాలువ పనులను పూర్తిచేసిన పోరుమామిళ్ల చెరువుకు నీరందించి రైతులను ఆదుకోవాలి.



లైనింగ్ పనులు పూర్తి చేయాలి
రాళ్లపల్లె, నరసింహులు, ఉపసర్పంచ్ , పోరుమామిళ్ల.

పెండింగ్‌లో ఉన్న తెలుగుగంగ కాలువ నిర్మాణాలు పూర్తిచేసి లైనింగ్ పనులను కూడా వేగవంతంగా చేయాలి. పోరుమామిళ్ల చెరువుకు నీరందేలా చూడాలి.



పనులు జరిగేలా చర్యలు చేపట్టాలి
తోటా బ్రహ్మయ్య, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు, దమ్మనపల్లె.

ఏండ్ల తరబడి తెలుగుగంగ కాలువ పెండింగ్ పనులు అలాగే ఉండిపోయాయని, దమ్మనపల్లె ప్రాంతంలో కొంత వరకు కాలువలు తీసి మధ్యలో నిలిపివేశారని, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి కాలువ పనులను పూర్తి చేయాలి.


రెడ్డికొట్టాలకు వెళ్లే దారిలో పిచ్చిమొక్కలతో నిండిన కాలువ
కొండుగారిపల్లె సమీపంలో దెబ్బతిన్న లైనింగ్ పనులు
రైతుల భూములకు

నష్టపరిహారమెన్నడో ?

తెలుగుగంగ పెండింగ్ కాలువలు పూర్తయ్యేదెన్నడు..

పోరుమామిళ్ల

నిధులకు కొదవలేదంటున్నారు, కానీ ఎనిమిదేళ్లుగా రైతులకు సంబంధించి తెలుగుగంగ కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందలేదు, ఫలితంగా తెలుగుగంగ కాలువ పనులు నిలిచిపోయాయి, ఎస్‌డిసి అధికారులు కొందరికి నోటీసులు ఇచ్చారు, కొందరికి ఇవ్వడం మరిచారు. తెలుగుగంగ స్పెషల్ ఆఫీసర్లు మాత్రం రైతులతో చర్చలు జరుపుతున్నారు, భూములకు సంబంధించి నష్టపరిహారం అందుతుంది అంటున్నారేకానీ, తెలుగుగంగ 9వ బ్లాక్‌కింద 45 ఎకరాలకు సంబంధించి నష్టపరిహారం అందలేదు. రైతులు మాత్రం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు, కాలువలు పెండింగ్‌లో ఉన్నందున గతంలో నిర్మాణం జరుపుకున్న కాలువలు పాచిపట్టి కంపచెట్లతో నిండిపోయాయి, ముఖ్యంగా 9వ బ్లాక్‌లో కేబీసీ, బిఇఎఫ్ విభాగాల్లో ప్రధాన కాలువలు, పిల్లకాలువలు పెండింగ్‌లో ఉన్నాయి, ఎ బ్లాక్‌లో 3.605 కిలోమీటర్ల మేరకు మేజర్ కాలువకు సంబంధించి పనులు జరగాల్సి ఉంది. శంఖవరం నుంచి చింతలపల్లె ఏరియాకు సంబంధించి మైనర్‌కాలువ 525 మీటర్లు జరగాల్సి ఉంది. మైనర్ 2లో 2 కిలోమీటర్ల వరకు మార్కాపురం నుంచి ఎస్సీకాలనీ వరకు పనులు జరగాల్సి ఉంది. మైనర్-3 కింద శంఖవరం నుంచి ముద్దంవారిపల్లెకు 1.625 మీటర్లు, మైనర్-4కింద ముద్దంవారిపల్లె వద్ద 1.85 కిలోమీటర్ల వరకు కాలువ పనులు జరగాల్సి ఉంది. 9వ బ్లాకు బి విభాగంలో చింతలపల్లె నుంచి కట్టకిందిపల్లె వరకు 1.05 కిలోమీటర్ల వరకు మైనర్ కాలువ కింద 2 కిలోమీటర్లు, కట్టకిందపల్లె వరకు పనులు జరగాల్సి ఉంది. 9వ బ్లాక్ సి.కింద పోరుమామిళ్ల చెరువు సమీపంలో 100మీటర్లు పనులు జరగాల్సి ఉంది. 9వ బ్లాక్-డిలో మైనర్ 1లో 0.7కిలోమీటర్లు, వీధుల్లపల్లె దగ్గర-2లో 3 కిలోమీటర్లు, రంపాడు నుంచి రెడ్డికొట్టాల వరకు మైనర్-3లో 500 మీటర్లు రెడ్డికొట్టాలలో మైనర్-4లో 1.46 కిలోమీటర్లు, గుర్రప్పగారిపల్లె ప్రాంతంలో కాలువ పనులు చేయాల్సి ఉంది. 9వ బ్లాక్-ఇ విభాగంలో మేజర్ 1.1కిలోమీటర్లు, దమ్మనపల్లె ప్రాంతంలో పనులు చేయాల్సి ఉంది. 9-ఎఫ్ బ్లాక్ విభాగంలో మేజర్ కాలువ విభాగానికి సంబంధించి 7.925కిలోమీటర్లు, పోరుమామిళ్ల చెరువు 1వ తూము నుంచి నర్సింగ్ కొట్టాల వరకు కాలువ పనులు జరగాల్సి ఉంది. ఈ కాలువలకు సంబంధించి భూములు కోల్పోనున్న రైతులకు ఎప్పుడు నష్టపరిహారం చెల్లిస్తారో, ఎప్పుడు ఈ కాలువ పనులు పూర్తి అవుతాయో వేచి చూడాల్సిందే.


నిర్మాణం పూర్తి చేసుకోని కాలువ


మొలకెత్తుతున్న పుట్టగొడుగులు


యూనిట్‌లో పుట్టగొడుగులు పరిశీలిస్తున్న దృశ్యం

ఉపాధికి 'పుట్ట' పౌష్టికాహారానికి 'దిట్ట'



ప్రజల్లో అవగాహన పెరిగింది..
- రంజిత, కేవీకే శాస్త్రవేత్త

పుట్టగొడుగుల వాడకంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. మార్కెట్‌లో వీటికి డిమాండ్ బాగా వుంది. యువత కుటీర పరిశ్రమలు పెట్టుకొని ప్రజలకు అందించాలి. ఉపాధిని పెంచుకోవాలి.



కుటీర పరిశ్రమగా...
- నాగవేణి, కడప

తక్కువ ఖర్చుతో కూడినది కాబట్టి నిరుద్యోగ యువత వీటిని ఎంపిక చేసుకుని కుటీర పరిశ్రమగా పెట్టుకుని ప్రభుత్వం అందించే ఆర్థికసాయం పొంది ఉపాధి పెంచుకోవచ్చు. ఇంట్లోనే వుంటూ చూసుకోవచ్చు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం ఆసక్తి చూపుతున్న యువత



రెట్టింపు ఆదాయం
- రామచంద్రారెడ్డి, పుట్లంపల్లె

పుట్టగొడుగుల్లో నష్టం రాదు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు ఆదాయం వస్తుంది. ఇంటి వద్దనే సొంతంగా పుట్టగొడుగులు పెట్టుకొని ప్రతిరోజు ఐదు కిలోల వరకు అమ్ముతాను. దీంతో ఆదాయం బాగా వుంటుంది.



నెలకు రూ.25 వేలు ఆదాయం
రాజాచారి

పుట్టగొడుగులు ద్వారా నెలకు రూ.25వేలు సంపాదిస్తున్నాను. ప్రజల్లో అవగాహన పెరగడంతో ముందుగానే ఆర్డర్ చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ వుంది. యువతకు ఇది చక్కని అవకాశం.

సీకే దిన్నె

కుటీర పరిశ్రమగా...

పుట్టగొడుగులు పెంపకం అధిక ఖర్చుతో కూడుకున్నది కాదని, చిన్న కుటీర పరిశ్రమగా స్థాపించుకోవచ్చునని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకు అవసరమైన సదుపాయాలు సులభంగా చేసుకోవచ్చు.

పుట్టగొడుగుల పెంపకానికి కావాలసినవి..

స్పాన్ , వరిగడ్డి, కవర్లు, రబ్బరు బ్యాండ్లు, పార్మాలిన్ అనే ఐదు వస్తువులు కావాలి. వరిగడ్డిని మొదట 12 గంటలు నానబెట్టి 20 నిముషాలు ఉడకబెట్టాలి. స్పాన్ విత్తనాన్ని వరిగడ్డికి వరుసగా వేసుకోవాలి. కవరు నిం డిన తరువాత కవరుకు రంధ్రాలు పెట్టాలి. అలా 15-20 రోజులలో చీకటిగదిలో పెడితే బూజు తయారవుతుంది. ఆ తరువాత వెలుతురు గదిలో పెడితే వారం పదిరోజులలో పుట్టగొడుగులు వస్తాయి. ఒక్కో చెద నుంచి రెండు కేజీల పుట్టగొడుగులు వస్తాయి.


మార్కెట్‌లో అమ్మకానికి కవర్లలో పుట్టగొడుగులు

సొంతంగా పెట్టుకున్నా.. *కొండమ్మ, ఇందిరానగర్*



నాకు చదువురాదు. కానీ కేవీకేలో ఇచ్చిన శిక్షణకు హాజరై నేర్చుకున్నాను. ప్రస్తుతం నేను ఇంట్లో సొంతంగా పెట్టుకుని నడుపుతూ నెలకు రూ.5వేలు సంపాదిస్తున్నారు.

పుట్టగొడుగుల పెంపకం ఎంతో లాభదాయకమని, యువతకు ఉపాధితో పాటు ప్రజలకు మంచి పౌష్టికాహారం అందించేందుకు కూడా చక్కగా ఉపయోగపడుతుంది. దీంతో గ్రామీణ యువతతో పాటు పట్టణ ప్రాంతాలకు చెందినవారు కూడా ఉపాధిగా మలచుకొని జీవిస్తున్నారు. ప్రభుత్వం వారికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని యువత కోరుతోంది.

అధిక పోషకాలు

పుట్టగొడుగులు, అధిక పోషక విలువలు కలిగి ఉంటాయి. హైబీపీ, షుగరు, గుండెజబ్బు, క్యాన్సర్ వున్న వారికి ఇవి ఎంతో మంచి ఆహారం. తక్కువ కొవ్వు శాతం కలిగి మాంసకృత్తులు అధికంగా వుంటాయి. విటమిన్ డి అధికంగా ఉండే ఈ పుట్టగొడుగులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ వుంది.



వాణిజ్య పంటల కంటే కీరదోస సాగులో లాభాలు ఎక్కువ
మల్లికార్జున, రైతు, కర్ణంవారిపల్లె

గతంలో వాణిజ్య పంటలు సాగు చేశాను, 4ఎకరాల్లో వచ్చిన లాభం కంటే, 70సెంట్లలో సాగుచేసిన కీర దోసలో వచ్చిన లాభం ఎక్కువ. రైతన్నలు ఆధునిక వంగడాలను సాగుచేస్తే లాభాలు వస్తాయి.



40సెంట్లలో రూ. 50వేలు వచ్చింది
శివనారాయణరెడ్డి, రైతు, నల్లగొండుపల్లె.

40సెంట్లలో రూ. 50వేలు వచ్చింది, ఎటువంటి కూలి పెట్టకుండానే కుటుంబ సభ్యులమే పని చేసుకుంటున్నాం. దాంతో కూలి ఖర్చు కూడా మిగులుతోంది. వాణిజ్యపంటలు సాగు చేసినా మిగలడం అంతంత మాత్రమే. కీరదోస సాగులో డబ్బులు బాగామిగులుతున్నాయి.

కరవు కాలంలో సిరులు కురిపిస్తున్న కీర దోస సాగు

ఆనందం వ్యక్తం చేస్తున్నరైతన్నలు


పొలంలో కీరదోసను సేకరిస్తున్న మహిళ



కలసపాడు

ఆరుగాలం కష్టించి,, శ్రమించి పంటలను సాగు చేస్తున్న రైతన్నలకు మిగిలింది ఏమీలేదు. ప్రతి ఏడాది అప్పులుపాలు అవడం తప్ప. అయితే కొంత మంది రైతులు కొత్త కొత్త పంటలను సాగు చేస్తూ లాభాలను అర్జిస్తున్నారు. శ్రమ ఎక్కువ అయిన లాభాలు వస్తుండటంతో రైతన్నలు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు. కలసపాడు మండలంలో ఇటీవల కీరదోస సాగు ఊపందుకుంది. మండలంలో సుమారు 500 ఎకరాల్లో కీరదోస సాగు చేపట్టారు. ఎకరాకు 3 నెలల్లో లక్ష రూపాయల పైగా లాభం వస్తున్నట్లు తెలుస్తుంది. కీరదోసను రెండు అంగుళాల శైజున్న కాయలకు కేజీకి రూ.28, కొద్దిగా పెద్దగా ఉన్న కాయలకు రూ. 18, దానికంటే మరికొద్దిగా పెద్దగా ఉన్న కాయలకు రూ. 10, అంతకంటే పెద్దగా కాయలకు కేజీకి రూ. 4లకు రైతన్నలకు వస్తుంది. అంతేగాకుండా విత్తనాలు ఇచ్చిన దళారులే ఇంటి వద్దకు వచ్చి కొనుగోలు చేసుకొని పోతుండటంతో రవాణాఖర్చు కూడా మిగులుతుందని రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో వాణిజ్య పంటలైన పత్తి, సజ్జ మాత్రమే రైతన్నలకు లాభాలు వచ్చేవి. అయితే కీరదోస సాగులో రైతన్నలకు మూడు నెలల కాలంలోనే ఎకరాకు లక్ష రూపాయలు మిగులుతుండటంతో రైతన్నలు సాగుపట్ల ఆసక్తిచూపుతున్నారు. కొద్దిపాటి నీటితోనే రైతన్నలకు కరువుకాలంలో లాభాలు కురిపిస్తున్నాయి.

ఉల్లి లొల్లి...

పులివెందుల టౌన్

వంటింట్లో ఉల్లి ఉండాలంటే జేబుకు చిల్లు పడుతుంది. 20 రోజుల క్రితం వరకు కిలో రూ. 10 నుంచి రూ.15 ఉన్న ఉల్లిపాయలు ప్రస్తుతం రూ.40కు చేరింది. రైతు బజార్‌లో ధర కిలో రూ.30 పలుకుతుండగా బహిరంగ మార్కెట్‌లో రూ.40లకు విక్రయిస్తున్నారు. 15 రోజుల నుంచి ప్రతి రోజు ధర పెరుగుతూనే ఉంది. ధర పెరుగుదలకు కారణం అర్థం కావడం లేదు. కొంతమంది ఉత్పత్తి తగ్గిందని, డిమాండ్ పెరిగిందని చెబు తున్నారు. ఉల్లిపాయ ఎక్కువగా ఉత్పత్తి చేసే పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలతో పాటు రెండు తెలుగురాష్ట్రాల్లో ఉత్పత్తి తగ్గిందని, కలకత్తాలో డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబు తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఉన్న ఉల్లిపాయలను గోడౌన్ లో దాచి ధర పెంచుతున్నారని కొందరు అంటున్నారు. అధిక లాభాలు దండు కోవడానికి ఏటా ఇలా చేస్తున్నారని విని యోగదారులు మండిపడుతున్నారు. రెండు నెలల క్రితమే ఉల్లిపాయలను గోడౌన్ లకు తరలించినట్టు తెలుస్తోంది. అధికారులు తగిన చర్యలు చేపట్టి ఉల్లి ధరలు తగ్గించే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరగకుండా ధరల నియంత్రణచట్టం తేవాలని అభిప్రాయ పడుతున్నారు.


బహిరంగ మార్కెట్‌లో రూ. 40
రైతుబజార్‌లో రూ.30

Who can approach Insurance Ombudsman?

BANKING KNOWLEDGE / FINANCIAL AWARENESS

BANK PO/ CLERKS EXAM SPECIAL

1. What is PMVVY? Give details.
a) Pradhan MantriVayaVandanaYojana (PMVVY)
b) The scheme is open to people aged 60 years and above
c) For monthly pension, the minimum amount to be invested is Rs.1.5 lakhs and the maximum is Rs.7.5 lakhs. LIC has been given mandate to operate the scheme
d) The scheme is exempt from GST
e) All the above

2. When currency notes of denominations of Rs. 1000 and Rs. 500 (specified bank notes or SBNs), valued at Rs. 15.4 trillion and constituting 86.9 percent of the value of total notes in circulation, were demonetized?
a) 2015 b) November 8, 2016
c) 2014 d) 2012 e) 2011

3. MSM releases will also feature salient facts, data and tables that are germane to the topic. What is MSM (in RBI)?
a) Money Street Memos
b) Mint Street Memos
c) Many Street Memos
d) Most Stressed Memos
e) None of these

4. Current Account and Saving Account (CASA) deposits are called as what?
a) High cost deposits b) Costly deposits
c) Low cost deposits d) Fixed deposits
e) None of these

5. Pradhan Mantri Jan-DhanYojana (PMJDY) accounts can be linked with which of the following?
a) Aadhar card number and mobile phone number
b) PMSBY or PMJJBY c) APY
d) All the above e) None of these

6. A significant amount of Specified Bank Notes (SBNs) viz., Rs.500 (old) & Rs. 1000 (old) flowed into which of the following special types of accounts in 2016?
a) Basic Saving Bank Deposit Account (BSBDA);
b) PMJDY Accounts; Kisan Credit Card (KCC);
c) Dormant or inoperative accounts; co-operative banks' accounts with SCBs;
d) Bullion trader/jewellers' accounts; and loan accounts.
e) All the above

7. About 85 per cent of the total collections by LIC of India in November 2016 were under which of the following?
a) The 'single premium' policies, which are paid in lump sum
b) Monthly c) Quarterly
d) Annually e) None of these

8. The Reserve Bank's Central Board, at its meeting held recently, approved the transfer of surplus to the Government of India amounting to Rs. 306.59 billion for the year ended________ .
a) June 30, 2017 b) December 2016
c) March 31, 2017 d) April 30, 2017
e) None of these

9. Which type of General Insurance Policies can be purchased online?
a) Motor (2-wheeler & Private car)
b) Health/ Personal Accident/
c) Overseas Mediclaim/ Householder/
d) Shopkeeper/ Pravasi Bhartiya Bima Yojana
e) All the above

10. When a person can renew his general insurance policy?
a) Only from 30 days before the expiry date of policy till the date of expiry
b) Within one year from the date of expiry
c) Within 2 years from the date of expiry
d) Within 5 years from the date of expiry
e) None of these

11. Who are entitled to join PRADHAN MANTRI SURAKSHA BIMA YOJANA?
a) All savings bank account holders in the age 18 to 70 years in participating banks
b) Below 5 years of age
c) Below 10 years of age
d) Below 12 years of age
e) None of these

12. What is the premium per member under PMSBY?
a) Rs.12/- per annum per member
b) Rs.100/- c) Rs.150/-
d) Rs.250/- e) None of these

13. Who is the Master Policy Holder for PMSBY?
a) LIC b) RBI
c) Participating Bank will be the Master policy holder on behalf of the participating subscribers
d) NABARD e) None of these

14. What is "Group insurance"?
a) Insurance for only one person
b) Insurance cover obtained by a group of individuals, either through an employer or otherwise, under a single contract;
c) Insurance for a married couple only
d) Insurance only for unmarried person
e) None of these

15. What is the method of Appropriation of Premium in PMSBY?
a) Insurance Premium to Insurance Company: Rs.10/- per annum per member
b) Reimbursement of Expenses to BC/ Micro/Corporate/Agent : Rs.1/- per annum per member
c) Reimbursement of Administrative expenses to participating Bank: Rs.1/- per annum per member
d) All the above e) None of these

16. Insurance Ombudsmen are appointed by the Governing Body and are empowered to entertain which type of complaints in respect of personal line insurances?
a) any partial or total repudiation of claims by an insurer
b) Any dispute in regard to premium paid or payable in terms of the policy
c) any dispute on the legal construction of the policies in so far as such disputes relate to claims
d) delay in settlement of claims; and non-issue of any insurance document to customers after receipt of premium
e) All the above

17. Who can approach Insurance Ombudsman?
a) Any aggrieved individual who has taken an insurance policy on persona lines
b) if deceased the legal heir(s) under such policy
c) Both (a) and (b) d) Supreme Court
e) None of these

18. Is there any time limit to approach the insurance ombudsman?
a) Within one year of the rejection by the insurer of the representation of the complaint or the insurer's final reply to the representation
b) Within 2 years c) Within 4 years
d) Within 5 years e) None of these

19. When the accident cover for the member shall terminateand nobenefit will be payable, under PMSBY?
a) On attaining the age of 50 years
b) On attaining age 70 years (age nearest birth day).
c) On attaining the age of 40 years
d) On attaining the age of 30 years
e) None of these

20. Aninsurance Ombudsman shall be appointed for a term of how many years? Give details?
a) 3 years
b) Shall be eligible for reappointment provided that no person shall hold office as an Ombudsman after he has attained the age of seventy years.
c) Both (a) and (b)
d) After the age of 75 years
e) None of these

21. "Health insurance business" means the effecting of contracts for which of the following ?
a) For sickness benefits
b) Medical, surgical or hospital expense benefits, whether in-patient or out-patient travel cover and
c) Personal accident cover
d) All the above e) None of these

22. No policy of life insurance shall be called in question on any ground whatsoever after the expiry of how many years from the date of the policy? (i.e., from the date of issuance of the policy or the date of commencement of risk)
a) three years b) 4 years c) 5 years
d) 6 years e) None of these

23. A contract of marine insurance is an agreement whereby the insurer undertakes to indemnify the assured, in the manner and to the extent thereby agreed, against which of the following?
a) Marine losses, that is to say, the losses incidental to marine adventure
b) Air cargo c) Railway transport
d) Road transport e) None of these

24. State Bank of India (SBI) has informed that it has introduced 'Work from Home Policy' for whom? Give details?
a) Permanent Officers in the Bank.
b) The facility can be availed occasionally up to 5 days a month or for a longer duration
c) It is subject to approval by the Competent Authority not less than officers in the grade of TEGS-VI i.e. Deputy General Manager/TEGSS-I i.e. Chief General Manager
d) All the above e) None of these

25. Which bank has launched a facility where by its existing customers can avail personal loansupto Rs.15 lakhs at its ATMs?
a) ICICI Bank b) Citi Bank
c) American Express d) SBI
e) None of these

26. The second life insurer in India to go public soonis?
a) SBI Life b) LIC
c) New India Insurance
d) United India Insurance
e) Oriental Insurance

Praturi Potayya Sarma

ANSWERS

		7) a	12) a	17) c	22) a
		8) a	13) c	18) a	23) a
1) e	4) c	9) e	14) b	19) b	24) d
2) b	5) d	10) a	15) d	20) c	25) a
3) b	6) e	11) a	16) e	21) d	26) a

ఉద్యోగాలు

బిఎంఆర్‌సిఎల్

బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బిఎంఆర్‌సిఎల్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్షన్ ఇంజనీర్ పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 20
కాంట్రాక్ట్ వ్యవధి: మూడేళ్లు
విభాగాలు - ఖాళీలు: టెలికం 2, ట్రాక్షన్ 2, ఎఎఫ్‌సి 2, సిగ్నలింగ్ 1, సివిల్ / ఆర్ఎస్ఎస్ 2, సిస్టం డిజైన్ 2, ఇ & ఎం లిఫ్ట్స్ & ఎస్కలేటర్స్ 3, టివిఎస్ & ఇసిఎస్ 2, డిపో 2
వేతనం: నెలకు రూ.35910 + ఇతర అలవెన్సులు
అర్హత: (డిప్లొమా/ బిఇ/ బిటెక్)(మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్/ మెకట్రానిక్స్/ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్/ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ / ఇండస్ట్రియల్ కంట్రోల్/ టెలి కమ్యూనికేషన్ / అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ డిజిటల్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ నెట్ వర్కింగ్/ పవర్ ఎలక్ట్రానిక్స్/ సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 35 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
అభ్యర్థులు ముందుగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొని దాని హార్డు కాపీని కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 26
చిరునామా: General Manager(HR), Bangalore Metro Rail Corporation Limited, III Floor, BMTC Complex, K.H.Road, Shanthinagar, Bangalore 560027
వెబ్‌సైట్: www.kannada.bmrc.co.in

అడ్మిషన్స్

ఎస్‌కెఎల్‌టిఎస్‌హెచ్ యు

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం (ఎస్‌కెఎల్‌టిఎస్ హెచ్ యు)- ఉద్యాన **బిఎస్సీ (ఆనర్స్)**లో ప్రవేశానికి ఉద్దేశించిన **హార్టిసెట్ 2017**కు దరఖాస్తులు కోరుతోంది.
దరఖాస్తు స్వీకరణకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
దరఖాస్తు పంపాల్సిన చిరునామా: ద రిజిస్ట్రార్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్ర నగర్, హైదరాబాద్ - 500030
వెబ్‌సైట్: www.skltshu.ac.in

ఐఐఎఎస్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ (ఐఐఎఎస్)- కింద పేర్కొన్న రీసెర్చ్ విభాగాల్లో **ఫెలోషిప్**లకోసం దరఖాస్తులు కోరుతోంది
రీసెర్చ్ విభాగాలు: సోషల్/ పొలిటికల్ అండ్ ఎకనామిక్ ఫిలాసఫీ/ కంపేరటివ్ ఇండియన్ లిటరేచర్ (యాన్షెంట్/ మెడ్‌లెవల్/మోడ్రన్ / ఫోక్/ ట్రైబల్)/ కంపేరటివ్ స్టడీస్(ఫిలాసఫీ/ రెలిజియన్ / హిస్టరీ-హిస్టరియోగ్రఫీ, ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ)/ ఎడ్యుకేషన్ / కల్చర్/ ఆర్ట్స్ - పర్ఫార్మింగ్ ఆర్ట్స్, క్రాఫ్ట్స్/ ఫండమెంటల్ కాన్సెప్ట్స్ అండ్ ప్రాబ్లమ్స్ ఆఫ్ లాజిక్ అండ్ మేథమెటిక్స్/ ఫండమెంటల్ కాన్సెప్ట్స్ అండ్ ప్లాబ్లమ్స్ ఆఫ్ నేచురల్ అండ్ లైఫ్ సైన్సెస్/ స్టడీస్ ఇన్ ఎన్విరాన్ మెంట్/ ఇండియన్ సివిలైజేషన్ ఇన్ ద కాంటెస్ట్ ఆఫ్ ఏషియన్ నైబర్స్/ ప్రాబ్లమ్స్ ఆఫ్ కాంటెంపరరీ ఇండియా ఇన్ ద కాంటెస్ట్ ఆఫ్ నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ నేషన్ బిల్డింగ్
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్ లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 30
చిరునామా: Secretary, Indian Institute of Advanced Study, Shimla- 171005
వెబ్‌సైట్: www.iias.ac.in

భారతదేశ భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?

భూగోళశాస్త్రం

1. 'జాగ్రఫీ' పదాన్ని మొదట ఉపయోగించిన శాస్త్రవేత్త?
ఎ) హెకాటియస్ బి) ఫ్రెడరిక్ రాట్జెల్
సి) ఎరటోస్థనీస్ డి) అరిస్టాటిల్
2. భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) రాట్జెల్ బి) హెకాటియస్
సి) అరిస్టాటిల్ డి) అనాగ్జిమెండర్
3. ఆధునిక భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) ఎరటోస్థనీస్ బి) అల్ఇద్రిసి
సి) అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ డి) టాలమి
4. భారతదేశ భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) జెమ్స్ రన్నెల్ బి) సర్‌జాన్ ఎవరెస్ట్
సి) విలియం లాంబ్టన్ డి) ఎవరూ కాదు
5. రాజకీయ భూగోళశాస్త్ర వ్యవస్థాపకుడు ఎవరు?
ఎ) అరిస్టాటిల్ బి) ఫ్రెడరిక్ రాట్జెల్
సి) హెకాటియస్ డి) మెర్కెటర్
6. శాస్త్రీయంగా మొదటి ప్రపంచ పటం తయారు చేసింది?
ఎ) హెకాటియస్ బి) అల్ఇద్రిసి
సి) టాలమి డి) అనాగ్జిమెండర్
7. 'అట్లాస్' పదాన్ని తొలిసారి ఉపయోగించింది ఎవరు?
ఎ) మెర్కెటర్ బి) చైనీయులు
సి) రాట్జెల్ డి) కార్ల్ రిట్టర్
8. ప్రపంచ పటంలో దక్షిణాన్ని పైభాగంలో చూపింది ఎవరు?
ఎ) టాలమి బి) అల్ఇద్రిసి
సి) మెర్కెటర్ డి) హెకాటియస్
9. ఖగోళశాస్త్ర బైబిల్ అని ఏ గ్రంథాన్ని పిలుస్తారు?
ఎ) ఆస్ట్రాలజి బి) కాల్టోగ్రఫి
సి) ఆల్మజిస్ట్ డి) ఏదీకాదు
10. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన కోపర్నికస్ ఏ దేశస్థుడు?
ఎ) పోలెండ్ బి) గ్రీక్ సి) స్పెయిన్ డి) హాలెండ్
11. రోదసీ యాత్రికుడికి బయట ఉన్న ఆకారం ఏ రంగులో కనిపిస్తుంది?
ఎ) నీలం బి) ఎరుపు సి) తెలుపు డి) నలుపు
12. కింది వాటిలో విశ్వ ఆవిర్భావ సిద్ధాంతం కానిది ఏది?
ఎ) భూకేంద్రక సిద్ధాంతం బి) బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం
సి) డోలనా సిద్ధాంతం
డి) నిరంతరసృష్టి సిద్ధాంతం
13. డోలనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) జార్జ్ అబ్జెలియోటర్
బి) అలెన్ శాండెజ్
సి) హెర్మన్ బాండీ డి) థామస్ గోల్డ్
14. వాయు పరికల్పన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) లాప్లాస్ బి) ఇమాన్యూయెల్ కాంట్
సి) చాంబర్లీన్ & మౌల్టన్
డి) రస్సెల్స్
15. గ్రహాల పరికల్పన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) ఇమాన్యూయెల్ కాంట్ బి) లాప్లాస్
సి) జీన్స్ & జెఫ్రీన్ డి) చాంబర్లీన్ & మౌల్టన్
16. విశ్వ దీవులు అని వేటిని అంటారు?



ఎ) గెలాక్సీలను బి) నిహారికలను
సి) దుమ్ముధూళి కణాలను
డి) శూన్య ప్రదేశాన్ని
17. పాలపుంతకు సమీపంలో ఉన్న గెలాక్సీ ఏది?
ఎ) హైడ్రా బి) క్లెస్టర్
సి) ఆండ్రోమెడా డి) బెటిర్‌గ్లెక్స్
18. విశ్వంలో అతి పెద్ద నక్షత్రం ఏది?
ఎ) సూర్యుడు బి) సిరియాస్
సి) ప్రాక్సిమాసెంటావరి డి) బెటిల్‌గ్లక్స్
19. విశ్వంలో దూరాలను కొలవడానికి ఉపయోగించే అతి పెద్ద ప్రమాణం ఏది?
ఎ) కాంతి సంవత్సరం బి) అస్ట్రానామికల్ యూనిట్
సి) పార్‌సెక్ డి) ఏదీకాదు
20. ఒక కాంతి సంవత్సరం =
ఎ) 9.3×8^{10} km బి) 9.8×10^{12} km
సి) 9.3×10^{12} km డి) 9.4×10^{12} km
21. దక్షిణ ధృవం వద్ద నుంచి ఆకాశంలో కనిపించే నక్షత్ర సమూహాన్ని ఏమంటారు?
ఎ) ఉర్సుమెజర్ బి) గ్రెట్‌బేర్
సి) సప్తర్షి మండలం డి) ఉర్సుమైనర్
22. గెలాక్సీలకు, నిహారికలకు మధ్య గల ఖాళీ ప్రదేశ శాతం ఎంత?
ఎ) 97% బి) 98% సి) 99% డి) 96%
23. పాలపుంత అనే గెలాక్సీని 'స్వర్గానికి దారులు' అని ఏ దేశస్థులు పిలుస్తారు?
ఎ) చైనా బి) గ్రీక్
సి) హిబ్రూ డి) ఎస్కిమోలు



పర్వతం నాగార్జున
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్

24. చైనా అంతరిక్ష నావికులను ఏమని పిలుస్తారు?
ఎ) ఆస్ట్రోనాట్స్ బి) కాస్మోనాట్స్
సి) టైకోనాట్స్ డి) ఏదీకాదు
25. నక్షత్రాలకు జన్మస్థానాలు అని వేటిని అంటారు?
ఎ) గెలాక్సీలు బి) నిహారికలు
సి) పాలపుంత డి) శూన్యప్రదేశం
26. కృష్ణబిలాలను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
ఎ) ఐన్‌స్టీన్ బి) రాస్‌గన్
సి) స్టీఫెన్ హాకిన్స్ డి) ఆల్ఫ్‌వెస్
27. కృష్ణబిలాలపై పరిశోధన చేసిన భారతీయుడు ఎవరు?
ఎ) సుబ్రమణ్యం చంద్రశేఖర్
సి) వెంకట్రామన్ రాధాకృష్ణన్
సి) హరగోవింద్ ఖొరానా డి) ఎవరూ కాదు
28. నక్షత్రాల్లో అధిక శాతం గల వాయువు?
ఎ) హీలియం బి) నైట్రోజన్
సి) ఆక్సిజన్ డి) హైడ్రోజన్
29. నక్షత్రాల్లో ఉష్ణోగ్రతను కొలిచే పరికరం?
ఎ) క్రైమోమీటర్ బి) కాస్మోక్రోనా
సి) పైరోమీటర్ డి) ఏదీకాదు
30. గ్రహాల జాబితా నుంచి తొలగించిన ప్లూటో గ్రహానికి ఏ నంబర్ కేటాయించారు?
ఎ) 134340 బి) 144240 సి) 134240 డి) 134342
31. సూర్యుని పరిభ్రమణ కాలం ఎంత?
ఎ) 250 కాంతి సంవత్సరాలు
బి) 250 మిలియన్ సంవత్సరాలు
సి) 27 మిలియన్ సంవత్సరాలు డి) ఏదీకాదు
32. సూర్యుని కాంతి భూమిని చేరడానికి పట్టే కాలం?
ఎ) 500 సెకన్లు బి) 600 సెకన్లు
సి) 450 సెకన్లు డి) 550 సెకన్లు
33. ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్యునిలో కనిపించే భాగం ఏది?
ఎ) ప్రోటోస్పియర్ బి) కరోనా
సి) క్రోమోస్పియర్ డి) ఏదీకాదు
34. ఆకాశంలో ఇంద్రధనస్సు ఏర్పడటానికి కారణం?
ఎ) కాంతి విక్షేపణం బి) కాంతి పరిక్షేపణం
సి) కాంతి అవక్షేపణం డి) కాంతి వివర్తనం
35. సూర్యునికి, భూమికి మధ్య ఉండే గరిష్ఠ దూరం?
ఎ) 147 మిలియన్ కి.మీ.
బి) 149.5 మిలియన్ కి.మీ.
సి) 152 మిలియన్ కి.మీ.
డి) 153 మిలియన్ కి.మీ.
36. సూర్యగ్రహణ సమయంలో సూర్యునిలో కనిపించే భాగం?
ఎ) ఫొటోస్పియర్ బి) క్రోమోస్పియర్
సి) కరోనా డి) ఏదీకాదు
37. సూర్యునిలో అతి చల్లని ప్రాంతం?
ఎ) క్రోమోస్పియర్ బి) సూర్యాంకాలు
సి) కరోనా డి) ఏదీకాదు
38. సూర్యుని గురుత్వాకర్షణశక్తి భూమి కంటే ఎన్ని రెట్లు ఎక్కువ?
ఎ) 28 రెట్లు బి) 27 రెట్లు సి) 13 రెట్లు డి) 29 రెట్లు
39. సూర్యునిలో అత్యంత వేడిగా ఉండే ప్రాంతం?
ఎ) ఫొటోస్పియర్ బి) క్రోమోస్పియర్
సి) కేంద్రం డి) ఏదీకాదు
40. ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్యునిలో కనిపించే రంగులు?
ఎ) ఎరుపు, నారింజ బి) ఎరుపు, ఆకుపచ్చ
సి) ఎరుపు, తెలుపు డి) ఎరుపు - పసుపు

సమాధానాలు

1) సి	7) ఎ	13) బి	20) సి	27) ఎ	34) ఎ
2) బి	8) బి	14) బి	21) డి	28) డి	35) సి
3) సి	9) సి	15) డి	22) ఎ	29) సి	36) సి
4) ఎ	10) ఎ	16) ఎ	23) బి	30) ఎ	37) బి
5) బి	11) డి	17) సి	24) సి	31) బి	38) ఎ
6) డి	12) ఎ	18) డి	25) బి	32) ఎ	39) సి
		19) సి	26) సి	33) సి	40) ఎ

ఉద్యోగాలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - రెగ్యులర్ & కాంట్రాక్ట్ స్పెషలిస్ట్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21
రెగ్యులర్ పోస్టులు: డిజిఎం(సైబర్ సెక్యూరిటి) 1, ఎజిఎం(సైబర్ సెక్యూరిటి) 1, డిఎం(ఐఎస్ ఆడిట్) 5
కాంట్రాక్ట్ పోస్టులు: వైస్ ప్రెసిడెంట్- కస్టమర్ అనలిటిక్స్(ఎసెట్ ప్రోడక్ట్స్) 1, సీనియర్ మేనేజర్(ప్రోడక్ట్ స్పెషలిస్ట్) 2, వైస్ ప్రెసిడెంట్ - కంప్లయింట్స్ మేనేజ్‌మెంట్ 1, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (ఐఎస్ ఆడిట్) 5, సీనియర్ మేనేజర్ (ఐఎస్ ఆడిట్) 5
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.sbi.co.in

సిసిఆర్‌హెచ్

సెంట్రల్ కౌన్సెల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి (సిసిఆర్‌హెచ్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన **జూనియర్ రీసెర్చ్ ఫెలో**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 5
క్యాంపస్‌లు: రీజనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, గుడివాడ క్లినికల్ రీసెర్చ్ యూనిట్, తిరుపతి
వేతనం: నెలకు రూ.25,000 + హెచ్ఆర్ఏ
ఎంపిక: టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ: ఆగస్టు 26న
వెబ్‌సైట్: www.ccrhindia.nic.in

ఐఐఎఫ్‌పిటి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ (ఐఐఎఫ్‌పిటి)- కింది పోస్టుల భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టులు - ఖాళీలు: రీసెర్చ్ అసోసియేట్ 1, సీనియర్ రీసెర్చ్ ఫెలో 2, జూనియర్ రీసెర్చ్ ఫెలో 4, ప్రాజెక్ట్ అసిస్టెంట్ 2
దరఖాస్తు ఫీజు: 500 **ఇంటర్వ్యూ:** ఆగస్టు 22న
వేదిక: Indian institute of food processing Technology, pudukkottai road, Thanjavur-613005, Tamilnadu.
వెబ్‌సైట్: www.iifpt.edu.in

ఎన్ఐపిసిసిడి

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ & చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ ఐపిసిసిడి)- కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 25
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(సైన్స్/ కామర్స్/ సోషల్ సైన్స్) లేదా తత్సమాన అర్హత ఉన్నవారు అర్హులు. పిహెచ్‌డి/ ఎంఫిల్ + ప్రొఫెషనల్ / టెక్నికల్ నాలెడ్జ్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
వయసు: 65 ఏళ్లకు మించరాదు
వేతనం: నెలకు రూ.45,000
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.nipccd.nic.in/vac.html

సిఎస్ఐఆర్ - ఐఎంఎంటి

సిఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటి)- **ప్రాజెక్ట్ స్టాఫ్** భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 13
అర్హత: బిఎస్సీ(మినరల్ ప్రాసెసింగ్/కెమిస్ట్రీ)/ ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) / ఎంటెక్(ఎన్విరాన్ మెంటల్ ఇంజనీరింగ్/ సైన్స్/ మినరల్ ప్రాసెసింగ్/ కెమికల్ ఇంజనీరింగ్/ బయో టెక్నాలజీ)/ (బిఇ/ బిటెక్)(మెటలర్జీ/ కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్)/ డిప్లొమా (మెటలర్జీ/ మెకానికల్/ కెమికల్) పూర్తిచేసి ఉండాలి.
ఇంటర్వ్యూలు: ఆగస్టు 29, 30
వెబ్‌సైట్: www.immt.res.in

బిఆర్ఎయు

డా. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ - ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 5
విభాగాలు: లా 1, సోషల్ వర్క్ 1, బయో టెక్నాలజీ 1, మేథమెటిక్స్ 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ 1
దరఖాస్తు ఫీజు: రూ.2000
పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 29 **వెబ్‌సైట్:** www.brau.edu.in

ఐడబ్ల్యుఎస్‌టి

బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ & టెక్నాలజీ (ఐడబ్ల్యుఎస్‌టి)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 6
పోస్టులు: స్టెనోగ్రాఫర్ (గ్రేడ్ 2)1, ఎల్‌డిసి 3, ఫారెస్ట్ గార్డ్ 2. అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపుకోవాలి
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
చిరునామా: Director, Institute of Wood Science & Technology, 18 th Cross, PO Malleswaram, Bengaluru- 560003
వెబ్‌సైట్: http://iwst.icfre.gov.in

మంత్రి ఆది దిష్టిబొమ్మ దహనం

రైల్వేకోడూరు : పట్టణంలోని టోల్గేట్‌వద్ద మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మను గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రాజశేఖర్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దళితులను అవమానించారని ఆరోపించారు. మంత్రిగా ఉండి చదువుకుని దళితులను అవమానంగా మాట్లాడడమేంటన్నారు. దళితులు ఎన్నికలసమయంలో కావాలి, ఎన్నికలు అయిన తర్వాత పనికిరారని నాయకులు బాగానేర్చుకున్నారని తెలిపారు. వెంటనే మంత్రి ఆది భహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు.

ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు తుమ్మల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపులకు రూ.607 కోట్లు రుణాలు

రైల్వేకోడూరు : జిల్లాలో 17-18 ఆర్థికసంవత్సరానికి గాను 26,322 మంది డ్వాక్రాగ్రూపులకు రూ.607 కోట్లు రుణాలు అందించాలని జిల్లా వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం జనరిక్ మందుల దుకాణంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికి జిల్లాలో 2,830 మంది గ్రూపుల సభ్యులకు రూ.98 కోట్లు రుణాలు అందించామని తెలిపారు. అనుకున్న లక్ష్యాలు పూర్తిచేయాలని, రుణాలు తీసుకున్న గ్రూపులవద్ద తిరిగి చెల్లించేవిధంగా చర్యలుతీసుకోవాలని, తీసుకున్నరుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో హార్టీకల్చర్‌లో 8900 కిలోమీటర్లమేరకు ప్లాన్‌టేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో 85 కిలోమీటర్లవరకు ప్లాన్‌టేషన్ చేశారని, 275 కిలోమీటర్లవరకు గుంతలు తీశామని తెలిపారు. ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్, బ్యాంకులింకేజి, అవన్యూ ప్లాన్‌టేషన్, రికవరి తదితరవాటిని సక్రమంగా చేయాలని, రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లె అరుంధతివాడ, ఉర్లగట్టుపోడు అరుంధతివాడ, తాడివారిపల్లె అరుంధతివాడ, రెడ్డివారిపల్లె అరుంధతివాడ తదితర ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రాగ్రూపుల సభ్యులు రూ.4కోట్లు రుణాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. మొదటిగా అధికారులు వెళ్లి మహిళలు తీసుకున్న రుణాలు తిరిగిచెల్లించేవిధంగా చర్యలు తీసుకుని వినకుంటే ఆర్ఆర్ యాక్టు ప్రకారం వసూలు చేయాలని ఆదేశించారు. పండ్ల మొక్కల పెంపకంలో సపోటా, మామిడి, చీని, నిమ్మ, సీతాఫలం, జామ తదితర మొక్కలు నాటుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియాకో- ఆర్డినేటర్ రవికుమార్, యానాది ఏపీఎం మల్లికార్జునరాజు, హార్టీకల్చర్ ఏపీఎం నరసింహులు, బ్యాంకులింకేజి ఏపీఎం సురేష్, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టుడైరెక్టర్ రామచంద్రారెడ్డి

కాపులను విస్మరిస్తే ఏపార్టీ అయినా భస్మీపటలం

రాష్ట్రకాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామి


మీడియాతో మాట్లాడుతున్న కాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామి

రైల్వేకోడూరు : కాపులను విస్మరిస్తే ఏపార్టీ అయినా భస్మీపటలం అవుతుందని, వైఎస్‌జగన్ ఏనాడు బలిజలకు న్యాయం చేయాలని ఆలోచన చేయలేదని రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు నారానాయణస్వామి అన్నారు. గురువారం ఆయన రైల్వేకోడూరుకు వచ్చిన సందర్భంగా విలేఖర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాపులను 1915లోనే బీసీలుగా ఉన్నారని, 1921లో కులగణాంకాలు జరిగాయని, అప్పుడు అనంతపురం జిల్లాలో ఉన్న నీలంసంజీవరెడ్డిని ఓడించారన్న ఆలోచనతో బీసీలుగా ఉన్న బలిజలను రద్దుచేశారని, 1961లో జీవోనెం3250 ప్రకారం బలిజలు, కాపులు, ఒంటరి, తెలగలను బీసీ జాబితాలోచేర్చారని తెలిపారు. 1966లో కాసుబ్రహ్మానందరెడ్డి, నీలంసంజీవరెడ్డిలు కలసి కాపులను బీసీలోంచి తీసివేయించారని ఆరోపించారు. బలిజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబడిఉన్నారని, అందుకే బీసీల్లో చేర్చారని అనేకసార్లు ఉద్యమాలు చేశామన్నారు. బలిజలను అనేకరకాలుగా రాజకీయనాయకులు అణదొక్కాలని చూశారని, బలిజలు అన్నికష్టాలు, నష్టాలు చవిచూశారన్నారు. 2013లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే 13 జిల్లాల్లో కమిషన్ చేయడానికి కాపునాడు నాయకులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్చించారని, మంజూనాథ కమిషన్ వేసి బలిజలను బీసీ జాబితాలో చేర్చాలని చర్యలు తీసుకున్నారని తెలిపారు. కమిషన్ నివేదికలు ఆలస్యం అవుతున్నాయని, ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకునివెళ్లామని, క్యాబినెట్, అసెంబ్లీలో పెట్టి పార్లమెంట్‌కు కూడా పంపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారని చెప్పారు. 1994 259 ప్రకారం అసెంబ్లీలో తీర్మాణం చేస్తే చాలు అని తెలిపారు. త్వరగా కమిషన్ వారు ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలని కోరారు. వచ్చే ఎన్నికలలోపు బీసీల్లో బలిజ, కాపు, తెలగ, ఒంటరి, గాజులబలిజ తదితర వారిని బీసీజాబితాలో చేర్చితేనే బలిజలు మద్దతుగా ఉంటారని, లేకపోతే బలిజల సత్తా నిరూపిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లాకాపు అధ్యక్షుడు సగినాల సుబ్రమణ్యం, చిత్తూరుజిల్లా అధ్యక్షుడు దేపూరిభాస్కర్, జిల్లా ప్రధానకార్యదర్శి బుట్టానాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటిచలపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌తీగలు తగులుకుని బొప్పాయి కూలీ మృతి

రైల్వేకోడూరు: విద్యుత్‌తీగలు తగులుకుని బొప్పాయి కూలీ గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు. మండలంలోని కె.బుడుగుంటపల్లె గ్రామానికి చెందిన వలిపిక్రిష్ణయ్య(45) అనేబొప్పాయి కూలీ అందరిలాగే బొప్పాయి లారీ పైన ఎక్కి ప్రయాణిస్తుండగా చిట్వేలి రూటులో ప్రధానవిద్యుత్‌లైన్లు తగులుకుని అక్కడికి అక్కడే మృతి చెందాడు. కె.బుడుగుంటపల్లె గ్రామంకు శవాన్ని తరళించారు. పోలీసులు కేసు నమోదు ఏశారు.


మృతి చెందిన క్రిష్ణయ్య

సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిట్వేలి : పేదల సమస్యలను తక్షణం పరిష్కరించాలంటూ గురువారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ఎదుట సీపీఐ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు ఏరియా కార్యదర్శి ఎస్.శంకరయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఈ ప్రభుత్వం పేద ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భ్రమలు కల్పించి మాయమాటలతో పేదలను మోసగించిందని ఆరోపించారు. కడప జిల్లా సీపీఐ పార్టీ ఆదేశాల మేరకు ప్రభుత్వం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ఎంఆర్‌వో, ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన కరపత్రాన్ని ఎంపీడీవో మస్తాన్X వల్లీకి అందజేశారు. అధికారులు స్పందించి పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా చిట్వేలి ఏరియా కార్యదర్శి పందికాళ్ళ మణి, రైల్వేకోడూరు రైతు సంఘం కార్యదర్శి మలిశెట్టి రాహుల్, డీహెచ్X పీఎస్ కార్యదర్శి పెంచలయ్య, పెంచలయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలు నివారణ

రైల్వేకోడూరు : అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలు నివారణ అవుతాయని రైల్వేకోడూరు అగ్నిమాపక కేంద్రం అధికారి నెల్లూరు సుబ్బరాజు తెలిపారు. గురువారం కోడూరుపట్టణంలోని హెచ్ఎంఎంహైస్కూలు ఆవరణలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా నివారించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిలో అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే తాత్కాలికంగా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక కేంద్రం కార్యాలయంకు సమాచారం అందించాలని కోరారు. పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు కటాక్షం, ఉపాధ్యాయులు మాలతి, క్రిష్ణ, చందు, పీఈటీ శివశంకర్‌రాజు, అగ్నిమాపక ఎల్ఎఫ్ శ్రీనివాసులు, బి.శివయ్య, డి.శివయ్య, సతీష్‌మోహన్‌లు పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాలపై ఆస్పత్రిరోగులకు అవగాహనకల్పిస్తున్న సుబ్బరాజు

7వ పేకమిషన్ అమలు చేయాలి

రెండోవ రోజుకు చేరుకున్న నిరవధికసమ్మె

రైల్వేకోడూరు : 7వపే కమిషన్ వెంటనే అమలు చేయాలని కోడూరు జీడీఎస్ గ్రామీణ తపాల సేవకులు శ్రీనివాసులు, మహేష్‌చంద్ర, హరినాథ్, లక్ష్మీనారాయణ, మురళీలు డిమాండు చేశారు. ఆలిఇండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం డిమాండ్లు అమలు చేయాలని నిర్వహించిన నిరవధికసమ్మె రెండోవరోజుకు చేరుకుంది. కమలేష్‌చంద్ర కమిటీ ఏఐజీడీఎస్‌వీ సవరణలతో కూడిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని తపాలా ఉద్యోగులు డిమాండుచేశారు. జీడీఎస్ ఉద్యోగుల సంఘంనాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జీడీఎస్ తపాలా ఉద్యోగులుగా 16 సంవత్సరాలుగా పనిచేస్తున్నా తక్కువవేతనాలు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐజీడీఎస్‌వీ సూచించిన సవరణలతో సహా కమిటీరిపోర్టు వెంటనే అమలు చేయాలని, జీడీఎస్‌లకు 8 గంటల పని కల్పించి రెగ్యూలైజ్ చేయాలని, క్యాట్, ఢిల్లీ, మద్రాస్‌లకు తీర్పును అనుసరించి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, టార్గెట్ పేరుతో జడీడీఎస్‌లను బలవంతంగా చేయడం మానసికంగా వేధించడమేనని ఆందోళన వ్యక్తంచేశారు. తమ డిమాండు ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. డిమాండ్లు అమలు చేయకపోతే మాత్రం ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


సమ్మెనిర్వహిస్తున్న జీడీఎస్ ఉద్యోగులు

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

రైల్వేకోడూరు: నిరుద్యోలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీ.జగధీష్, జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్‌లు డిమాండు చేశారు. ఈ సందర్భంగా గురువారం కోడూరులోని ఎన్జీవోహోంలో ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కడపజిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయాలని, కోడూరులో ఉన్న వనరులను వినియోగించుకుని వాటిద్వారా పరిశ్రమలు ఏర్పాటుచేయాలని, అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండు చేశారు. కోడూరులో బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.


మాట్లాడుతున్న నాయకులు జగధీష్, సందీప్‌లు

గంగమ్మతల్లి ఆలయం ప్రారంభం

రైల్వేకోడూరు : మండలంలోని ఉర్లగట్టుపోడు పంచాయతీలోని వైఎస్ఆర్‌నగర్‌లో గంగమ్మతల్లి ఆలయాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు నాగిశెటి హరిహరనాథ్ సహకారంతో గంగమ్మ ఆలయాన్ని నిర్మించుకున్నామని ఏపీఎఫ్‌సీఐ సభ్యులు మూరముట్ల వెంకటరత్నం, రెడం పెంచలయ్య, సుబ్బయ్య, మూరముట్ల వెంకటరమణ, బొల్లుదా సరయ్య తదితరులు తెలిపారు. ఆలయ ప్రారంభానికి రాష్ట్రకాపునాడు అధ్యక్షులు నారాయణస్వామి, జిల్లాకాపుఅధ్యక్షుడు సగినాలసుబ్రమణ్యం, చిత్తూరుజిల్లా అధ్యక్షుడు దేపూరిభాస్కర్, జిల్లా ప్రధానకార్యదర్శి బుట్టానాగరాజు, జిల్లాఉపాధ్యక్షుడు కొండేటిచలపతి తదితరులు గ్రామస్తులు ఆహ్వానించారు.


ఆలయంలో ప్రత్యేకపూజలు చేస్తున్న కాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామి

వి.ఎం.పురంలో వైద్యశిబిరం

పెనగలూరు : పెనగలూరు మండలం వెలగచెర్ల వెంగమాంబపురంలో గురువారం పెనగలూరు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీహరి ఆదేశాలమేరకు హెల్త్ సూపర్‌వైజర్ శారదమ్మ ఆరోగ్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎక్కువ మంది ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నందు వల్ల జ్వరాలను అదుపు చేసేందుకు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అపరిశుభ్రత ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించారు. ఇళ్ళఇళ్ళు తిరిగి వివరాలు తెలుసుకొని జ్వరాలు ఉన్న వారికి మందు బిల్లలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశాకార్యకర్త కూడా పాల్గొన్నారు.

ఒకరి సంతోషం కోసం ఇతరలను ఇబ్బందిపెట్టకూడదు



శాంతి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సాయినాథ్

రైల్వేకోడూరురూరల్ : మన సంతోషాలకోసం ఇరతులను ఇబ్బందులు పెట్టేవిధంగా ప్రవర్తించడం సమాజానికి మంచిదికాదని రైల్వేకోడూరు సీఐ కె.సాయినాథ్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభాభవనంలో శాంతి సంఘం సభ్యులతో వినాయక చవితి, బక్రీదు పండుగలను శాంతి యుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. స్థానిక సీఐ సాయినాథ్, తహసీల్దారు చెంగ్రాయుడు, ఎస్సైలు వెంకటేశ్వర్లు, భక్తవత్సలం, ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సుబ్బరాజు, ఎంపీడీవో సంజీవరావుల ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు, వినాయకచవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మన సంతోషాలకోసం ఇరతులను ఇబ్బందులు పెట్టేవిధంగా వినాయక ఉత్సవాలను నిర్వహించ కూడదని తెలిపారు. వినాయక చవిత, బక్రీదు తదితర ఏపండుగలు అయినా సాంప్రదాయంగా సంతోషంగా జరుపు కోవాలని చూచించారు. వినాయక చవితి ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా హిందూ ముస్లింలు మెలగాలన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనం, కార్యక్రమాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలని చూచించారు.

వినాయక విగ్రహాలను పెట్టే వారు కమిటీగా ఏర్పడి రాజంపేట డీఎస్పీ అనుమతులు పొందాలని చూచించారు. విగ్రహాల సైజు, ఏవీదిలో పెట్టేది, కమిటీ సభ్యులు వివరాలు పోలీసువారికి తెలియజేయాలని చూచించారు. రాత్రి 10 గంటలకు మైకులను బందు చేయాలని చూచించారు. మధ్యంసేవించి నిమజ్జనంలో పాల్గొన కూడదని చూచించారు. ఉత్సవాల్లో అసభ్యకర నృత్యాలు, అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. అదేవిధంగా తహసీల్దారు, ఎస్సైలు, ఎంపీడీవో వినాయక ఉత్సవాలు, బక్రీదులను శాంతియుతంగా జరిగే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకరరాజు, ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, ముస్లిం మతపెద్దలు, వినాయక ఉత్సవ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

కోడూరులో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

రైల్వేకోడూరు : పట్టణంలోని టోల్‌గేట్ వద్ద గురువారం ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ కమ్యూనిస్టు వంక సుబ్రమణ్యం మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే ఆ దర్వంలో జర్నలిస్టుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి వారి హక్కులు సాధనకోసం సమష్టిగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు లింగాలగారి రమేష్‌బాబు, పండ్రా ప్రసాద్, నాగేంద్ర, సుబ్బరాయుడు, శర్మ మల్లికార్జున, సుగవాసి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోడూరు జర్నలిస్టులు

రాష్ట్రకాపునాడు ప్రచార కార్యదర్శిగా నాగిశెట్టి హరిహరనాథ్



హరిహరనాథ్‌కు నియామకపత్రాన్ని ఇస్తున్న నారాయణస్వామి

రైల్వేకోడూరు : రాష్ట్ర కాపునాడు ప్రచారకార్యదర్శిగా నాగిశెట్టి హరిహరనాథ్‌ను నియమించినట్లు గురువారం కాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామి ప్రకటించారు. ఈ సందర్భంగా హరిహరనాథ్‌కు కాపునాడు ప్రచార కార్యదర్శిగా నియామకపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపునాడు కార్యక్రమాలను వాడవాడలా విస్తరించేందుకు ముమ్మరంగా కృషి చేస్తామని, బలిజలను బీసీ జాబితాలో చేర్చేంతవరకు ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాపు అధ్యక్షుడు సగినాల సుబ్రమణ్యం, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు దేపూరి భాస్కర్, జిల్లా ప్రధానకార్యదర్శి బుట్టానాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి చలపతి తదితరులు పాల్గొన్నారు.

వేరే కులాలను బీసీల్లో చేర్చవద్దు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న మల్లికార్జున

పెనగలూరు : బీసీ కులాలలో ఉన్న సామాజిక వర్గసభ్యులను మాత్రమే బీసీలుగా ఉంచాలని, బీసీ కులాల్లో వేరే సామాజిక సభ్యులను చేర్చవద్దని జాతీయ బీసీ కార్యదర్శి అవ్వారు మల్లికార్జున కోరారు. ఈ సందర్భంగా ఆయన గురువారం బీసీ రాజకీయ సంకల్పయాత్రలో భాగంగా మండలంలోని సింగరెడ్డిపల్లె, సింగనమల తదితర గ్రామాల్లో పర్యటించి చేనేత, ముదిరాజు, వడ్డెర కులస్తులతో మాట్లాడారు. అనంతరం ఆయన పెనగలూరు తహసీల్దార్ కార్యాలయంకు చేరుకొని ఇతర కులాలను బీసీ కులాల్లో చేర్చవద్దంటూ డి.టి సుబ్రమణ్యంరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఆ కార్యక్రమంలో ఆయన వెంట కడప పార్లమెంట్ బీసీ కన్వీనర్ గాలి రామపరమాత్మ, ఊబీసీ రాజకీయ జిల్లా అధ్యక్షుడు జి.కె.మునయ్య, బీసీ నాయకులు బి.నరసింహులు, అవ్వారు రామ్మోహన్ , ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు ద్వారా వాహనాలకు రుణాలు

రైల్వేకోడూరు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు వాహనాలకు రుణాలు అందిస్తున్నట్లు బ్యాంకు ఆర్ఎం ఓబయ్య, మేనేజర్ హుస్సేన్‌లు తెలిపారు. గురువారం బ్యాంకు ద్వారా రుణం పొందిన వ్యక్తులకు వాహనాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాంకులో సబ్సిడీరుణాలు, వాహనాలకు రుణాలు, దుకాణాలకు రుణాలు, డ్వాక్రారుణాలు అందిస్తున్నామన్నారు. తమ బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, కోట్లా దిరూపాయల రుణాలు అందించామని, తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలని కోరారు.

భూసమస్యలు పరిష్కారానికే రైతుసేవలో రెవెన్యూశాఖ

రైల్వేకోడూరురూరల్ : రైతుల సమస్యలను గుర్తించి వాటిని సకాలంలో పరిష్కారం చూపేందుకే రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక తహసీల్దారు చెంగ్రాయుడు తెలిపారు. గురువారం మండలంలోని చియ్యవరం గ్రామంలో రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. చియ్యవరం రెవెన్యూ గ్రామంలో రెండు భూ సమస్యలకు అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. వచ్చిన దరకాస్తులు పరిశీలించి అప్పటికప్పుడే పరిష్కరించినట్లు తహసాల్దారు తెలిపారు.

రైతు సేవలో రెవెన్యూ శాఖ

పెనగలూరు : వి.ఎం.పురంలో గురువారం తహసీల్దార్ శిరీష అధ్యక్షతన రైతు సేవలో రెవెన్యూ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు రైతులు తమ భూములు ఆన్ లైన్ చేయాలని, పాసుబుక్కులు ఇవ్వాలని కోరారు.

కంపరాజుకుంట ఆక్రమణలను తొలగించాలి

చిట్వేలి : చిట్వేలి మండలం మార్గోపల్లె సమీపంలో ఉన్న కంపరాజుకుంట ఆక్రమణలకు గురై నీటి నిల్వ సామర్థ్యం కోల్పోయిందని, తక్షణం ఆక్రమణలను తొలగించాలని గురువారం జరిగిన రైతు సేవ రెవెన్యూ శాఖ కార్యక్రమంలో రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 93 ఎకరాల విస్తీర్ణం కలిగిన కంపరాజుకుంట అలుగు సహా ఆక్రమణలకు గురైందని, ఇందులో మామిడి తోటలు సాగులో ఉన్నాయన్నారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా కలెక్టర్, స్థానిక తహసీల్దార్‌లకు అర్జీలు సమర్పించినా ఫలితంలేదని రైతులు వాపోయారు. ఉన్నతాదికారులు తక్షణం స్పందించి కుంట ఆక్రమణలను తొలగించి పంటలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా సర్పంచ్ నాగేశ్వరి, సుధీర్‌రెడ్డి, పెద్ద శివయ్య, నాగరాజు, వెంకటరమణ, సుబ్రమణ్యం, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఆర్ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు అర్జీ ఇస్తున్న రైతులు

దేవాలయ ప్రారంభోత్సవంలో అన్నదానం

పెనగలూరు : పెనగలూరు వడ్డిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం నుండిగణపతిపూజ, సత్తాహం, హోమం తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

సుండుపల్లె: మండలంలోని రాయవరం బండివాండ్లపల్లె దళితవాడలో ఈ నెల 24న అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్లను గురువారం మండల టీడీపీ నాయకులు వై.శివరామిరెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుళాయిబాబుతో పాటు ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు వల్లం నాగేంద్ర, గౌరవ సలహాదారులు కె.యల్లయ్య తదితరులు ఆవిష్కరించారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 3, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. విద్యా సంస్థల్లో ప్రవేశానికి అనుకూలం. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. కుటుంబసభ్యుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లకు అనుకూలం. సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. ఇంటికి అవసరమైన వస్తువులు సమకూర్చుకుంటారు. చర్చలు, ప్రయాణాలు లాభిస్తాయి.

మిథునరాశి: (మే21-జూన్21): బిల్లులు, చెక్కులు అందుకుంటారు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. విద్య, ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఈ విషయాల్లో కొత్త ఆలోచనలు అమలు చేసేందుకు తగిన సమయం. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): సినీ, రాజకీయ రంగాల వారు లక్ష్యాలు సాధిస్తారు. దీర్ఘకాలంగా వాయిదాపడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. అలజడి తగ్గి మనశ్శాంతి లభిస్తుంది. ఆధ్యాత్మిక దృక్పథం పెరుగుతుంది.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రక్షణ రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): రాజకీయ, బోధన, న్యాయ, రక్షణ రంగాల వారు ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల సహకారం లభిస్తుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్, మ్యూచువల్ ఫండ్ వ్యవహారాలకు అనుకూలం. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): స్పెక్యులేషన్లు, పెట్టుబడులపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. శ్రీవారు, శ్రీమతి సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వృత్తిపరమైన సమావేశాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో భాగస్వామి సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. విందులు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సన్నిహితుల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. వైద్య, ఇంజనీరింగ్ విద్యార్థులకు శుభప్రదం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

తల్లిదండ్రులలో మార్పుతోనే...

ఆడ, మగ బిడ్డల మధ్య వ్యత్యాసం అంతరిస్తుంది





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడుతో ఐసీడీఎస్ పీడీ మమత, హాజరైన అధికారులు, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు

కలెక్టర్ బాబూరావునాయుడు

కడప, అర్బన్ : ఆడ, మగ పిల్లల మధ్య వ్యత్యాసానికి తల్లిదండ్రులే కారణమని వీరిలో మార్పు వచ్చినప్పుడే వ్యత్సాసం అంతరిస్తుందని కలెక్టర్ బాబూరావు నాయుడు అన్నారు. కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో గురువారం కిశోరి వికాసం పథకం అమలు పై విధి విధానాలు రూపొందించేందుకు జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని వంద జిల్లాల్లో స్త్రీ, పురుషులు నిష్పత్తిలో వ్యత్యాసం ఉందని అందులో కడప జిల్లా ఒకటి అన్నారు. జిల్లాలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 916 మంది స్త్రీలు వున్నారన్నారు. ఆ విధంగా బాలికల సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. ఈ వివక్షను రూపు మాపేందుకు జిల్లాలో బేటిబచావో-బేటి పఢావో కార్యక్రమం జరుగుతున్నదన్నారు. కిశోరి వికాసం పథకంలో డ్వాక్రా గ్రూపులను కూడా క్రియా శీలకంగా పాల్గొని విజయవంతం చేసేలా ఉపయోగించుకోవాలన్నారు. కిశోరి వికాసం పథకం అమలు పై జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్, సభ్యులుగా జాయింట్ కలెక్టర్-2, డీఈవో, ఎస్ఎస్ఏ పీవో, ఇంటర్ మీడియట్ విద్య ఆర్ఐవో, కళాశాల విద్యా ప్రాంతీయ డైరెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ, జిల్లా బీసీ సంక్షేమాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, కన్వీనర్‌గా ఐసీడీఎస్ పీడీ ఉంటారన్నారు. ఎంపిక చేయబడిన వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు జిల్లాలోని 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు ఉన్న కిశోర బాలికలకు 15 ఎంపిక చేయబడిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలో చురుకుగా ఉన్న బాలికలను ఎంపిక చేసి వారినే పీజీటీలు లేదంటే పీర్ గ్రూప్ ట్రైనర్‌గా జిల్లా మొత్తం వెయ్యి మంది బాలికలను పీజీటీలుగా తయారు చేయాలన్నారు. ఈ వెయ్యి మంది పీజీటీలను 200 టీమ్‌లుగా తయారు చేసి ఒక్కొక్క టీమ్‌లో 5 మంది పీజీటీలను చేర్చి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో వున్న గ్రామాలలో బడి మాని వేసిన కిశోర బాలికలకు అవగాహన కల్పించి కిశోర్ వికాసం పథకం విజయవంతంగా అమలు చేయాలన్నారు. కమిటీ సభ్యులు విధి విధానాలను పేర్కొని అజెండా ప్రణాళికలను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మమత, డీసీపీవో శివప్రసాద్‌రెడ్డి, డీఈవో శైలజ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, గిరిజన సంక్షేమ అధికారి లలితాభాయి, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీకాంతం, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్ల , కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాల్సిందే

ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి

కడప, ఎర్రముక్కపల్లె : మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగింపు, పదోన్నతులు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ప్యాపిట్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయలు సౌలభ్యాన్ని పురపాలక పాఠశాలలకు, ఉపాధ్యాయులకు కల్పించాలన్నారు. హెచ్ఎంలకు గెజిటెడ్ హోదా అధికారులు తదితర సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. అనంతరం డైరెక్టర్ కె.కన్నబాబుతో ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, బి.నాగేశ్వరరావుతో కలిసి చర్చించారు. ప్యాప్టో డిమాండ్‌పై చర్చించి సానుకూల నిర్ణయాలకు డైరెక్టర్ అంగీకరించి శుక్రవారం చర్చలకు ఆహ్వానించడంతో ధర్నాను తాత్కాలికంగా విరమించారు.



మున్సిపల్ డైరెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీలు

వైవీయూలో భూముల పరిశీలన

కడప, వైవీయూ : వారం రోజులుగా పెండ్లిమర్రి మండల పరిధిలోని వైవీయూనివర్సిటీకి సంబంధించిన భూములను వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చంద్రయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణరెడ్డి గురువారం పరిశీలించారు. గంగనపల్లె వీఆర్వో అధికారులతో సర్వే చేసిన తూర్పు, దక్షిణం వైపు వున్న భూములపై అధికారులు కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. వర్సిటీ ఆధినంలో 2009 సంవత్సరానికి 442.4 ఎకరాలు ఉండగా, గంగనపల్లె గ్రామ పరిధిలోని 139.99 ఎకరాలు తిప్పిరెడ్డిపల్లె గ్రామ పరిధిలోని 24.58 ఎకకాలు, రంపతాడు 48.59 ఎకరాలు కొప్పర్తి గ్రామ పరిధిలో 2.84 ఎకరాలు కేటాయించినట్లు వర్సిటీ ఇంజనీరింగ్ సిబ్బంది రిజిస్ట్రార్‌కు వివరించారు. నాలుగు రోజులుగా వర్షం కారణంగా సర్వేకు అంతరాయం కల్గిందన్నారు. ఇప్పటి దాకా సర్వే నెంబర్స్ 17, 1497, 1498, 1499, 1500 పరిధిలోని భూములు వైవీయూకు చెందినవని తెలిపారు. దక్షిణం వైపుగల భూములకు ఏర్పాటు చేసిన కంచె పరిధిలోనే భూమి కూడా వర్సిటీ ఆధినంలోనే ఉందన్నారు. సర్వే నెంబర్‌లో 1445, 1446, 1493, 1494, 1495, 1496, 1492, 1510, 20, తదితర సర్వే నెంబర్లలో సుమారు 24 ఎకరాల భూమి ప్రభుత్వ రికార్డుల ప్రకారం వర్సిటీ ఆధీనంలోనే ఉందని తెలిపారు. తూర్పు వైపు వున్న భూములకు కంచె వేసేందుకు, జిల్లా కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారులకు లేఖలు రాయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి రిజిస్ట్రార్ సూచించారు. భూముల పరిశీలనలోని అధ్యాపక సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గంగయ్య, సెక్యూరిటీ అధికారి క్రిష్ణకుమార్, ఇంజనీర్ రామచంద్రారెడ్డి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



వైవీయూ భూములను పరిశీలిస్తున్న అధికారులు

20న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

కడప, రవీంద్రనగర్ : ఈ నెల 20వ తేదీన ధన్వంతరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వధూవరుల పరిచయవేదిక నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు టీఎల్ఎన్ కుమార్, శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 20న ఉదయం 10 గంటలకు మున్సిపల్ మైదానంలోని శ్రీరాజరాజేశ్వరి దేవాలయంలో జరుపుతున్నామన్నారు. వివరాలకు 9347123082, 8885415609ను సంప్రదించాలన్నారు.

జిల్లాలో 8.4 మిల్లిమీటర్ల వర్షపాతం

కడప, సెవెన్‌రోడ్స్ : జిల్లాలో గురువారం 8.4 మి.మి. వర్షపాతం నమోదైంది.కడప డివిజన్ లో అధికంగా 14.4, రాజంపేట డివిజన్ లో 9.2, జమ్మలమడుగు డివిజన్ లో అత్యల్పంగా 0.7 మి.మి. వర్షం కురిసింది. కడప డివిజన్ లో అత్యధికంగా చక్రాయపేట మండలంలోని 74.6, రాజంపేట డివిజన్ లో చిట్వేలి మండలంలో 30.2, జమ్మలమడుగు మండలం చాపాడు మండలంలో 6.4 మి.మి. వర్ష పాతం నమోదైంది.



పెద్దముడియం వద్ద పొంగిపొర్లుతున్న వాగు

తిరుమల సమాచారం

తిరుమలకు వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ముందస్తుగా కడప టీటీడీ దేవస్థాన ఈ-దర్శన్ ద్వారా దర్శనం టిక్కెట్లు, వసతి (రూములు) పొందవచ్చు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు అందిన సమాచారం మేరకు తిరుమలలో వసతి, దర్శనం టిక్కెట్ల ఖాళీలు ఇలా వున్నాయి.

● **రూ.300 దర్శనం టిక్కెట్లు**

ఆగస్టు 28న 600, 29న 1426, 30న 1450, 31న 790, సెప్టెంబర్ 1న 970 టిక్కెట్లు ఖాళీగా వున్నాయి.

● **రూ.50 రూములు**

ఆగస్టు 24న 88 రూములు ఖాళీగా వున్నాయి.

● **రూ.100 రూములు**

సెప్టెంబర్ 19న 71, 20న 24, అక్టోబర్ 9న 40, 10న 79, 11న 69 రూములు ఖాళీగా వున్నాయి.

● **రూ.500 రూములు**

సెప్టెంబర్ 18న 2, 19న 36, అక్టోబర్ 9న 29, 10న 28, 11న 44 రూములు ఖాళీగా వున్నాయి.

● **రూ.200 రూములు (శ్రీనివాసం) తిరుపతిలో**

ఆగస్టు 24న 10, సెప్టెంబర్ 6న 9, 13న 26, 14న 8, 15న 2 గదులు ఖాళీగా ఉన్నాయి.

● టీటీడీ కల్యాణమండపాలు బుకింగ్ చేసుకునేందుకు సంప్రదించాల్సిన నెంబరు 9059948220.

టీటీడీ కార్యాలయం పనిచేయు వేళలు

● ప్రతి మంగళవారం సెలవు

● సోమ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వర కు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఆ సమయంలో దర్శనం టిక్కెట్లతో పాటు వసతి కోసం రూములను బుక్ చేసుకోవచ్చు.

గమనిక : ఈదర్శన టిక్కెట్లకు వచ్చే వారు గుర్తింపు కార్డులు తెచ్చుకోవాలి ఆధార్, రేషన్ కార్డు, ఓటర్‌కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ఏదో ఒక గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి.

తూర్పుగోదావరిపై విశాఖ విజయం



చిత్తూరు-నెల్లూరు మధ్య మ్యాచ్, సుబ్రమణ్యం (108 పరుగులు- నెల్లూరు), లిఖిత్ (5 వికెట్లు-చిత్తూరు)

కడప, రవీంద్రనగర్ నగరంలోని వైఎస్ఆర్ఆర్, ఏసీఏ, కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రీడామైదానంలో జరుగుతున్న అండర్-16 అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో కేఎస్ఆర్ఎం క్రీడా మైదానంలో తూర్పుగోదావరి జట్టుపై విశాఖ జట్టు విజయం సాధించింది. చిత్తూరు, నెల్లూరు మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కేవోఆర్ఎంలో తూర్పుగోదావరి విజయం: విశాఖ, తూర్పుగోదావరి మ్యాచ్ లో బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ 31.4 ఓవర్లలో 74 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 19 పరుగులతో తూర్పుగోదావరి విజయం సాధించింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏలో డ్రా: చిత్తూరు, నెల్లూరు మ్యాచ్ లో మూడోరోజు ఓవర్‌నైట్ స్కోర్ 209/9తో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు 82.3 ఓవర్లతో 224 పరుగులకు ఆలౌట్ అయింది.

ఇందులో ధరణి 117 పరుగులు చేశాడు. అనంతరం నెల్లూరు 88 ఓవర్లలో 176 పరుగులకు 7 వికెట్లు కోల్పోయింది. ఇందులో సుబ్రమణ్యం 108 పరుగులు చేశాడు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనానికి చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ బాబూరావునాయుడు

కడప, రవీంద్రనగర్ : ప్రశాంత వాతావరణంలో వినాయకచవితి పండుగ నిమజ్జనం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాబూరావునాయుడు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అట్టాడ బాబూజీతో కలిసి ఈనెల 25న జరిగే వినాయకచవితి పండుగలో ఎలాంటి సంఘటనలు జరగకుండా జిల్లాలో జరుపుకునేందుకు వివిధ శాఖాధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖాధికారుల సమన్వయ సహకారంతో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ప్రజలు పండుగ జరుపుకునేలా చూడాలన్నారు. నిమజ్జనం రోజున జిల్లా వ్యాప్తంగా నిమజ్జనం జరిగే ప్రదేశాలలో సంబంధిత ఆర్‌డీవోలు, మున్సిపల్ కమిషనర్లు వారి సిబ్బంది విధులు నిర్వహించేట్లు చూడాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో రోడ్లు సరిగా లేకుంటే మరమ్మత్తులు చేయించాలన్నారు. ఆర్డీవోలు, వీఆర్వోలు టీములుగా వేసి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ముఖ్య కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని 29 ప్రాంతాల్లో నిమజ్జనం కేంద్రాలుగా గుర్తించామని అక్కడే పూర్తిస్థాయిలో పోలీసు బందోబస్తు వుంటుందన్నారు. సమావేశంలో జేసీ శ్వేత తెవతీయ, కడప, రాజంపేట, జమ్మలమడుగు ఆర్డీవోలు చినరాముడు, వీరబ్రహ్మం, దేవేంద్రరెడ్డి, కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో దెబ్బతిన్న సిగ్నల్‌లైట్లు

గంటపాటు ఆగిన రాయలసీమ, ఐఆర్‌సీటీసీ రైళ్లు

రాజంపేట : రాజంపేటలో గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో రెండు రైళ్ళు గంట పాటు రాజంపేట ప్రాంతంలో ఆగిపోయాయి. సాయంత్రం 5.15 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ ఉరుములు, మెరుపులతో పిడుగు పడ్డ శబ్ధాలు భారీగా రావడంతో రాజంపేట వద్ద సిగ్నల్‌సిస్టమ్ దెబ్బతిని సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో 50 నిమిషాలు రాజంపేట రైల్వేస్టేషన్ అవుటర్‌లో తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను ఆపివేశారు. అదే సమయంలో రాజంపేటలో ఏర్పడ్డ సాంకేతిక లోపాలతో సమీపంలోని చెర్లోపల్లె రైల్వేస్టేషన్ వద్ద హైదరాబాదు నుంచి చెన్నైకు వెళుతున్న ఐఆర్‌సీటీసీ టూరిస్ట్ రైలును ఆపివేశారు. సాంకేతిక లోపాలను గుర్తించిన రాజంపేట రైల్వేస్టేషన్ మాస్టర్ సత్యనారాయణ రైల్వే ఉన్నతాధికారులకు తెలపడంతో వారు హుటాహుటిన వచ్చి సిగ్నల్ సిస్టమ్ సాంకేతిక లోపాలను సరిదిద్దడంతో యధావిధిగా రైళ్ళను 50 నిమిషాలు ఆలస్యంతో నడిపారు. రాజంపేటలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు అరగంట పాటు భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పోలీసులు క్రమశిక్షణతో రాణించాలి : ఎస్పీ



శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ అట్టాడ బాబూజీ, కమాండెంట్ రాజాకిషోర్‌బాబు తదితరులు

సిద్దవటం : భాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కు శిక్షణ పొందేందుకు వచ్చిన 256 మంది ఏఆర్ కానిస్టేబుళ్ళు క్రమశిక్షణతో ట్రైనింగ్‌ను పూర్తి చేయాలని ఎస్పీ అట్టాడ బాబూజీ తెలిపారు. 11వ బెటాలియన్ లోని ఏఆర్ కానిస్టేబుళ్ళ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ 11వ బెటాలియన్ లో శిక్షణకు వచ్చిన వారు అదృష్టవంతులు అన్నారు. ఇలాంటి ఉద్యోగాలు లేక ఎంతో మంది నిరుద్యోగులున్నారన్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రారంభించిన పోస్టులకు లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. పోలీసు శిక్షణ అనేది కొంచెం భిన్నంగానే ఉంటుంది. కష్టం లేకపోయినా అంత సులువుగా ఏమీ శిక్షణ ఉండదన్నారు. రెండు విషయాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఒకటి వ్యక్తిత్వం, రెండోది సబ్జెక్టు విషయ పరిజ్ఞానం అన్నారు. సబ్జెక్టు ఎంత ముఖ్యమైనదో వ్యక్తిత్వం కూడా అంతే ముఖ్యమన్నారు. సబ్జెక్టులో ఒకసారి సరిగ్గా రాయలేక ఫెయిల్ అయితే మళ్లీ రాసుకోవచ్చు అన్నారు. కానీ వ్యక్తిత్వంలో ఫెయిల్ అయితే ఎందుకూ పనికిరారన్నారు. శిక్షణ ఎంత కష్టంగా ఉంటే తరువాత సులభంగా ఉద్యోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కమాండెంట్ రాజాకిషోర్‌బాబు, అడిషనల్ కమాండెంట్ శామ్యూల్‌జాన్, అసిస్టెంట్ కమాండెంట్ కేశవరెడ్డి, డీఎస్పీ ఉదయ్‌కుమార్, బిడబ్ల్యూజిటి నారాయణ, ఒంటిమిట్ట సీఐ రవికుమార్, ఎస్ఐ అరుణ్‌రెడ్డి, ఆర్‌లై పి.వి.రమణ, ప్రభాకర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, ట్రైనింగ్ పోలీసులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

దువ్వూరు: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశ ప్రగతి బాగుంటుందని ఆర్డీ విజయ ఫౌండేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఐ.బయనపల్లెలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల చదువు, హక్కులపై తెలియజేశారు. ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించినప్పుడే పురుషులతో సమానంగా రాణించేందుకు వీలవుతుందన్నారు. అనంతరం మహిళలకు, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మినారాయణ, కౌన్సిలర్ మున్ని తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల్లో ప్రాథమిక పాఠశాల - భయందోళనలో చదువులు

ఖాజీపేట : పరిసరాలు పరిశుభ్రంగా వుంటే ఆరోగ్యంతో పాటు చక్కగా విద్యను అభ్యశించవచ్చు. పాఠశాల చుట్టూ కంపచెట్లు అలుముకోవడంతో భయం భయంగా విద్యార్థులు చదువు సాగిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని ముత్తులూరుపాడు దళితవాడ సమీపంలో వున్న ప్రాథమిక పాఠశాల చుట్టూ ముళ్లపొదలు అలుముకున్నాయి. విషపురుగులు పాఠశాల ప్రాంగణంలోకి వస్తుండడంతో మా పిల్లలు బడికి వెళ్ళాలంటేనే భయపడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇలా వుంటే పిల్లలకు ఎలా చదువు వస్తుందన్నారు. అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ వున్న కంపచెట్లను తొలగించి విద్యార్థుల జీవితాలకు భరోసా నింపాల్సిన అవసరం ఎంతైనా వుంది.



పాఠశాల చుట్టూ ముళ్ళపొదలు అలుముకున్న దృశ్యం



బడికి వెళ్ళాలంటే భయపడుతున్నారు

పాఠశాల చుట్టూ కంపచెట్లు దట్టంగా అలుముకున్నాయి. దీంతో పిల్లలు బడికి వెళ్ళాలటే భయపడుతున్నారు. మాకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలే దిక్కు. అధికారులు కంపచెట్లను తొలగించాలి.

- వీరాంజి, ముత్తులూరుపాడు

విషపురుగులు వస్తున్నాయి

కంపచెట్లు దట్టంగా వుండడంతో విష పురుగులు పాఠశాల ప్రాంగణంలోకి వస్తున్నాయి. దీంతో పిల్లలు భయాందోళన చెందుతున్నారు. నిత్యం భయం భయంగా చదువు సాగించాల్సి వస్తోంది. ఇది ఇలాగే ప్రతి రోజు వుంటే చదువుముందుకు ఎలా సాగుతుంది. అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలగించాల్సిన అవసరం వుంది.

- రమణ, ముత్తులూరుపాడు



అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా...ఒకరికి గాయాలు

ఖాజీపేట : కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె సమీపంలో గురువారం ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు ... మైదుకూరు సమీపంలోని అగ్రహారానికి చెందిన వెంకటసుబ్బయ్య ట్రాక్టర్‌లో పెన్నా నదిలోని ఇసుకను తీసుకొని తన స్వగ్రామానికి బయలు దేరారు. భూమాయపల్లె సమీపంలోకి రాగానే అదుపు తప్పి ప్రమాదవశాత్తు బోల్తాపడింది. వెంకటసుబ్బయ్య స్వల్పగాయాలతో బయటపడ్డాడు.



బోల్తా పడ్డ ట్రాక్టర్

అంతర్జాతీయ సదస్సుకు ట్రిపుల్ ఐటీ పీడీ ఎంపిక

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ సమన్వయకర్తగా పనిచేస్తున్న శంషాద్‌బేగం అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైంది. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొననుందని డైరెక్టర్ భగవన్నారాయణ తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల పంపిణీలో పురుషులతో పాటు మహిళలకు సమాన కోటా కల్పించాలనే అంశాలను ప్రధానం చేసుకొని జండర్ బారీర్ ఇన్ స్పోర్ట్స్ చాలెంజ్ అండ్ రెమిడెస్ అనే జర్నల్‌కు గానూ సదస్సుకు ఎంపికైంది. రాయలసీమ నుంచి ఎంపికైన శంషాద్‌బేగం హాకీ టోర్నమెంట్‌కు అంపైర్‌గా ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, బ్యాంకాక్ తదితర దేశాల్లో పాల్గొందని తెలిపారు. ఆమెను డైరెక్టర్ భగవన్నారాయణతో పాటు ఏఓ అమరేంద్రకుమార్ సంద్ర అభినందించారు.



శంషాద్‌బేగంను అభినందిస్తున్న డైరెక్టర్ భగవన్నారాయణ

ఘనంగా ప్రారంభమైన వెండిరథం పూజలు

మైదుకూరు : పట్టణంలోని అమ్మవారిశాలలో గురువారం వెండిరథం ప్రారంభోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి మూల విరాట్‌కు పవిత్ర నదుల జలములతోనూ, పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అర్చకులు ఇందిరావరశ్యామ్‌చే వెండి రథానికి సంబంధించి అమ్మవారి పూజలు చేపట్టారు. ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు తల్లం వెంకట సుబ్బయ్య దంపతులచే కలిశస్థాపన, ప్రాదోశకాలపూజ, వేద స్వస్తి చేపట్టి గురువారం రాత్రి మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ నాయకులు.మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు వెండిరథంపై వాసవీమాత గ్రామోత్సవం : అద్భుతసేవ అయిన వెండిరథంపై తొట్టతొలిగా శ్రీవాసమాత శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన రహదారులపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. వాసవీమాత ఇప్పటి వరకు వెండి సింహాసనం, వంశవృక్షం, సింహ వాహనం సేవలు లభించేవి. ఈవెండిరథం రాకతో వాసవీమాత మరో అద్భుత సేవను ఆర్యవైశ్యసభ సమకూర్చింది.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

మైదుకూరు రూరల్ : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఏ.ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులలు తెలిపిన సమాచారం మేరకు సుగాలితాండాకు చెందిన బుక్కే శ్రీరామ్‌నాయక్,చంద్రనాయక్,రామ్‌దాస్‌నాయక్‌లు తిప్పిరెడ్డిపల్లె పరిసర ప్రాంతంలో పేకాడుతుండగా వారిని అరస్ట్ చేసి 5,650 రూపాయల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు వారు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు వేలం

లింగాల: లింగాల పోలీస్‌స్టేషన్ లో 2015 సంవత్సరంలో వివిధ కేసులకు సంబంధించి పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలకు గురువారం వేలం నిర్వహించారు. ఈ వేలానికి మండలం నుంచి దాదాపు 50 మంది దాకా పాల్గొన్నారు. ఈ ఆరు ద్విచక్ర వాహనాలు వేలం వేయగా రూ.44600 వచ్చినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొ ని ద్విచక్ర వాహనాలు తీసుకున్న వారు శుక్రవారం డబ్బు లు చెల్లించి వాహనాలు తీసుకెళ్లాలని ఆయన తెలిపారు.

వైభవంగా శ్రీరామాలయ గాలిగోపుర శంకుస్థాపన మహోత్సవం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని స్థానికంగా ఉన్న పురాతన శ్రీరామాలయ గాలిగోపురం శంకుస్థాపన మహోత్సవం మండల వడ్డెరసంఘం నాయకుల పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు.

ఈమహోత్సవానికి ముఖ్యఅతిథిగా బ్రహ్మంగారిమఠం మఠాధిపతులు వీరభోగవసంత వేంకటేశ్వరస్వామి పూజా కార్యక్రమాలను చేపట్టారు. అలాగే తోట్లపల్లె అచలానంద ఆశ్రమం మఠాధిపతులు విరజానందస్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో శంకుస్థాపన మహోత్సవాల్లో పాల్గొన్నారు. అలాగే బి.మఠం మండలాధ్యక్షుడు దేవర్ల చక్రవర్తి పర్యవేక్షణలో నిర్వహించారు. పురాతన రామాలయాన్ని గతంలో నిర్మాణం చేపట్టిన తమ్మిశెట్టి కాశయ్య కుమారుడు సికె నాగరాజు దంపతులు మఠాధిపతి చేపట్టిన గాలిగోపుర మహోత్సవాల్లో పాల్గొని పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం గాలి గోపురదాత నాగరాజు మాట్లాడుతూ పూర్వ కాలంలో ఈ రామాలయాన్ని మా పెద్దలు నిర్మాణం చేపట్టారని, అదే విధంగా వారిపేరును నిలబెట్టాలని ఈ రోజు గాలిగోపుర నిర్మాణపనులు సొంత ఖర్చులతో చేపడుతున్నామని తెలిపారు.

కార్యక్రమంలో బి.మఠం వడ్డెరసంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వడ్డెరసంఘం ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ, వెంకటరత్నం, ఎంవి రామాంజినేయులు, శివరామాంజనేయులు, ఆంజనేయులు, బ్రహ్మయ్య, జిల్లా వడ్డెరసంఘం అధ్యక్షుడు గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంపా తిరుపతి, జిల్లా గౌరవసలహాదారుడు పి.మధుసూదన్ , కోశాధికారి ఆదినారాయణ, సుబ్బరాయుడు, వెంకటయ్య, ఎర్రయ్య, భక్తులు పాల్గొన్నారు.



గాలిగోపుర శంఖుస్థాపన పూజలు నిర్వహిస్తున్న మఠాధిపతులు వెంకటేశ్వరస్వామి



శంకుస్థాపన పూజా కార్యక్రమాల్లో పూజలు నిర్వహిస్తున్న గాలిగోపుర దాతలు

సినిమా గైడ్

మైదుకూరు	
విజయ్	: లై
భారత్	: నేనే రాజు నేనే మంత్రి
వెంకటేశ్వర	: జయ జానకి నాయక
ఖాజీపేట	
రాజ్	: జయ జానకి నాయక
దువ్వూరు	
రాయల్	: శతమానం భవతి

రాజయోగంతో స్వీయ క్రమశిక్షణ

ప్రొద్దుటూరు టౌన్: జీవితంలో రాజయోగాన్ని అలవర్చుకోవడం వల్ల మానవతా విలువలు, బంధుత్వాలు బలపడతాయని, స్వీయ క్రమశిక్షణ అలవడుతుందని, ఆంధ్ర, కర్ణాటక సబ్‌జోన్ ఇన్‌చార్జి రాజయోగిని పద్మాదీది అన్నారు. శుక్రవారం విజయనగరం వీధిలోని ఓంశాంతి భవన్‌లో సహజ రాజయోగ విశిష్టతను సాధన విధానంను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీకి చెందిన చిన్నారి ప్రీతిశ్రీ రాజయోగముద్రతో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది.బి.కె.శాంత, బి.కె.బెహన్‌జీ, బి.కె.రత్న, గీతాబెహెన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఎఫ్ నిధులు విద్యార్థుల ఖాతాల్లో వేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్: 2016-17 విద్యాసంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఆర్‌టీఎఫ్ నిధులను విద్యార్థుల అకౌంట్లలో వేయాలని ఎఐఎస్‌బీ పట్టణాధ్యక్షుడు సురేష్ పేర్కొన్నారు. ఆర్‌టీఎఫ్ నిధులు చెల్లించాలని కోరుతూ గురువారం ఎఐఎస్‌బీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రభుత్వ రీయంబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజు పేరుతో రూ.2130 చెల్లించిందన్నారు. ఆ నిధులను కళాశాలలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. కళాశాలలు పర్యావరణ ఫీజు రూ.800, ప్రాక్టికల్ ఫీజు రూ.3 వేలు, కళాశాల ఫీజు రూ.10 వేలు విద్యార్థుల నుంచి వసూలు చేశాయని అందువల్ల ప్రభుత్వం ఇచ్చిన ఆర్‌టీఎఫ్ ఫీజును కళాశాలలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ఇంతవరకు ఒక్క కళాశాలలో కూడా ఆర్‌టీఎఫ్ నిధులు విద్యార్థులకు ఇచ్చారా లేదా అని పరిశీలించకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. ఆర్‌టీఎఫ్ నిధుల విషయం చాలాసార్లు ఎస్‌వో దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని విమర్శించారు. 2016-17 సంవత్సరానికి ఆర్‌టీఎఫ్ నిధులు రూ.50 లక్షలు విడుదల అయ్యాయని, ఒక్కపైసా విద్యార్థులకు చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, బాలు, సంపత్ తదితరులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వనం-మనం కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు అర్బన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కౌన్సిలర్ హయాతున్ అన్నారు. గురువారం స్థానిక 25వ వార్డులోని ఉస్మాన్ మసీదు ఏరియా శీపాల బాలుడు వీధిలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఉర్దూ కాలేజీ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హయాతున్ మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మానవాళి మనుగడ చెట్లు అందించే ఆక్సిజన్‌పైనే ఆధారపడి ఉందన్నారు. వార్డ్ టీడీపీ ఇన్‌చార్జి నూరి, ఇస్మాయిల్, కళాశాల అధ్యాపకులు, జాకీర్ హుస్సేన్, బాబాఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో దళారులదే హవా!



పెన్నానగర్‌లో మధ్యలోనే నిలిచిపోయిన మరుగుదొడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ :స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం దళారులకు ఆదాయ వనరుగా మారిందనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈపథకం ప్రారంభం నుండి లబ్ధిదారులు మరుగుదొడ్ల నిర్మాణంపై ఆసక్తి చూపుతున్నా సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణదారులు నిరాసక్తత చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఆశయమైన బహిరంగ ప్రదేశాల్లో పరిసరాల పరిశుభ్రత నినాదాలకే పరిమితమౌతోందనే ప్రచారం జరుగుతోంది. మండలంలో 1708 మంది వ్యక్తిగతమరుగుదొడ్ల నిర్మాణానికై(ఐహెచ్ఎల్)కు దరఖాస్తులను అందచేశారు. వీటిలో 321 మరుగుదొడ్లు బేస్‌మట్టం నిర్మాణం, 630 ఇంత వరకు ప్రారంభం కాలేదని అధికారులు చెబుతున్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలన గ్రామాలుగా మొదట చౌటపల్లె, నంగనూరుపల్లె, చౌడూరు పంచాయతీలను ఎంపిక చేశారు. నంగనూరుపల్లెలో 50మంది ఐహెచ్ఎల్‌కై దరఖాస్తులు చేసుకోగా 26మరుగుదొడ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. చౌటపల్లెలో 64మంది దరఖాస్తులు చేయగా వంద శాతం పూర్తి అయ్యాయని బిల్లులు ఇచ్చామని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెబుతున్నారు. ఈ గ్రామంలోనే నేటికీ బహిరంగ మలమూత్ర విసర్జనకు గ్రామస్తులు వెలుతున్నారు. ఉప్పరపల్లె పంచాయతీలో బొజ్జవారిపల్లె గ్రామంలో 14మందికిపైగా ఏడాదికిందట ఐహెచ్ఎల్‌ను నిర్మించుకున్నారు. ఐహెచ్ఎల్ మంజూరైనా ఒక్క బిల్లు రాలేదు. అధికారుల చుట్టూ లబ్ధిదారులు తిరగాల్సి వస్తోంది. బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఇతరులు మరుగుదొడ్ల నిర్మాణాలపై నిరాశక్త చూపుతున్నట్లు గ్రామస్తులు చెప్పారు. పెద్దశెట్టిపల్లె పంచాయతీ నరసింహాపురం కొట్టాలలోని దళితవాడలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మధ్యలోనే నిర్మాణాలు ఆగిపోయాయి. ఎమ్మెల్యేరాచమల్లు చెన్నమరాజుపల్లె గ్రామంలో ప్రజాసమస్యలకై వెళ్లిన పుడు సకాలంలో బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే నిర్మాణాలను నిలిపివేసినట్లు వెల్లడించారు. అర్ధాంతరంగా ఆగిన నిర్మాణానికి ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో ఆగిన నిర్మాణాన్నే ఉపయోగించుకుంటున్నట్లు ఎమ్మెల్యేకు ఆకుటుంబస్తులు వెల్లడించారు. ఓడీఎఫ్‌గా ఎంపికైన గ్రామాలకు సకాలంలో బిల్లులు వస్తాయని బిల్లులు చెల్లింపుపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాజారామ మోహన్‌రెడ్డి చెప్పారు.

పెన్నానగర్‌లో దళారిదే హవా!

సోములవారిపల్లె పంచాయతీ పెన్నానగర్‌లో బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న చాకలివీధిలో ఓ దళారిదే హవాగా సాగింది. చాకలివీధిలో చాలా కుటుంబాలు గుత్తి నుండి వలస వచ్చారు. వీరికి మరుగుదొడ్లు నిర్మిస్తామని ఒక్కొక్కరి నుండి వెయ్యి నుండి రూ.2వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈదళారి నిర్మాణాలను పూర్తి చేయలేదు. ఏడాది నుంచి ఈదుస్థితే నెలకొనడంతో ఆ దళారి నిర్మాణాలు చేయకపోవడంతో ఆకుటుంబాలే వారి సొంత నిధులతో నిర్మాణాలను చేసుకోవడం జరుగుతోంది. ఈగ్రామంతో పాటు పలు గ్రామాల్లో దళారులదే హవాగా సాగుతోంది. పథకం ప్రారంభంలో మరుగుదొడ్డి మంజూరుకు వంద రూపాయలనువసూలు చేశారు. ఈ వ్యవహారం ప్రచారం జరగడంతో ఆ విధానానికి అధికారులు స్వస్తి పలికారు.

సినిమా గైడ్

ప్రొద్దుటూరు

సుధ :	లై
వెంకటేశ్వర :	జయ జానకి నాయకి
బీవీఎస్:	గౌతమ్ నంద
ఆరవేటి:	నేనే రాజు నేనే మంత్రి
అర్చన :	లక్ష్మీకటాక్షం
చాంద్ :	అంధగాడు
సినీ హబ్: స్క్రీన్-1:	నేనే రాజు నేనే మంత్రి
స్క్రీన్ -2 :	జయ జానకి నాయకి
స్క్రీన్ -3 :	ఫిదా

నేడు ఎగ్జిబిషన్ గ్రౌండ్ లీజు వేలం

ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు మున్సిపల్ అనిబిసెంట్ క్రీడా మైదానంలో ప్రతి ఏడాది దసరా మహోత్సవం సందర్భంగా నిర్వహించే ఎగ్జిబిషన్‌కు క్రీడామైదానాన్ని 45 రోజులపాటు లీజు ఇవ్వడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటలు ప్రారంభం అవుతాయని, వేలం పాటల్లో పాల్గొనే వారు దరావత్తును చెల్లించి వేలం పాటలలో పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

అభయ్ సుబ్బిరెడ్డి చిరస్మరణీయుడు



అభయ్ సుబ్బిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు అర్బన్: స్వచ్ఛంద సేవకు మారుపేరు అభయ్ సుబ్బిరెడ్డి అని సుబ్బిరెడ్డి సామాజిక సేవలు చిరస్మరణీయమైనవని ఆదరణ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అభయ్ సుబ్బిరెడ్డి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు చిరకాలం గుర్తుపెట్టుకోగల వ్యక్తి అభయ్‌సుబ్బిరెడ్డి అన్నారు. రాష్ట్రంలోనే ఉత్తమ స్వచ్ఛంద సేవకుడిగా గుర్తింపు తెచ్చుకుని జిల్లా స్వచ్ఛంద సంస్థలకు మార్గదర్శిగా నడిచారన్నారు. సుబ్బిరెడ్డి మరణ మిస్టరీని పోలీసులు చేదించాలని కోరారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు కృపాకర్, నాగభూషణం, ప్రేమ్ పాల్గొన్నారు.

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు శుక్రవారం మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూలు ప్రాంగణంలోని స్త్రీశక్తి భవన్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు 206 యూనిట్లకు 1423 దరఖాస్తులు, మైనార్టీ కార్పొరేషన్‌కు 208 యూనిట్లకు 933 దరఖాస్తులు, కాపు కార్పొరేషన్‌కు 100యూనిట్లకు 204 దరఖాస్తులు, ఎస్సీ కార్పొరేషన్‌కు 228 యూనిట్లకు 703 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎస్సీకి టార్గెట్ యూనిట్లు మంజూరు కాలేదని, దరఖాస్తులు మాత్రం 26 వచ్చాయన్నారు. వీరంతా అర్హత ధ్రువపత్రాలతో ఆయా బ్యాంకు మేనేజర్ల వద్ద ఇంటర్వ్యూలో పాల్గొనాలన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, విద్యార్హత, కులధ్రువీకరణ పత్రాలు తప్పక తీసుకురావాలన్నారు. పట్టణంలో టార్గెట్ ఇచ్చిన అన్ని బ్యాంకు ప్రతినిధులు తదితరులు హాజరవుతారన్నారు.

ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం మంజూరు

ప్రొద్దటూరు కల్చరల్: ఎంపీటీసీ సభ్యులకు అందించే గౌరవ వేతనాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. 9 మాసాల నుంచి ఎంపీటీసీ సభ్యులకు అందించే గౌరవ వేతనాన్ని ప్రభుత్వం చెల్లించలేదు. కాగా రెండు రోజుల కిందట ఆరు మాసాల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఒక్కో నెలకు రూ.3 వేల వంతున ఎంపీటీసీలకు అందిస్తుంది.

రేపు శనిత్రయోదశి

కడప, అర్బన్ : స్థానిక రామక్రిష్ణానగర్‌లో నూతనంగా ప్రతిష్ఠ జరుపుకున్న సాయినాథుని ఆలయ ప్రాంగణంలో వెలసిన వున్న శనీశ్వరునికి శనివారం శనిత్రయోదశి తైలాభిషేకం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని ప్రధాన అర్చకుడు వారణాసి శ్రీధర్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్ఎస్ఏ, కేజీబీవీ సిబ్బందికి వేతనాలు పెంపు

కడప, ఎర్రముక్కపల్లె : సర్వశిక్షాఅభియాన్, కేజీబీవీల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు పెంపుదల ఉత్తర్వులు ఎస్ఎస్ఏ,ఎస్‌పీడీ శ్రీనివాస్ విడుదల చేసినట్లు పీఆర్‌టీయూ ఫ్రంట్ ఫ్లోర్‌లీడర్ ఎమ్మెల్సీ గాదెశ్రీనివాసులునాయుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.కమలాకర్‌రావు, కొండూరు శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఎస్ఏ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఎస్‌పీడీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐ సమస్యలు పరిష్కరించాలి

కడప, ఎర్రముక్కపల్లె : ప్రభుత్వ ఐటీఐ సమస్యలు పరిష్కరించాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పామలేటి డిమాండ్ చేశారు. కడప ఐటీఐ సర్కిల్ గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐలో ట్రిప్ ప్రకారం ప్రాక్టికల్స్ చేయించకుండా లెక్చరర్లు నామమాత్రంగా చేస్తున్నారని దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు శివ, సన్ని, ప్రసాద్ పాల్గొన్నారు.



కడప, రవీంద్రనగర్ : నగర శివారు ప్రాంతమైన రామచంద్రాపురం సమస్యలకు మారు పేరుగా చెప్పవచ్చు. కష్టాలకు చిరునామాగా ఉండే, ఈ కాలనీ ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి మసకబారి పోయింది. బరువుగా ఉన్న ఈ జీవితాలకు సౌకర్యాల వెలుగు ఇచ్చే వారే లేకుండా పోయారు. నాయకులు కళ్ళ ముందు ఉండే సమస్యలు పట్టించుకోరు. ఓట్ల కోసం అయితే వస్తారు, అభివృద్ధి పట్టించుకోరు. ఇక్కడ వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేకుండా పోయాయి. కాలనీలో ప్రధానంగా ఉన్న సమస్య డ్రైనేజీ. కాలువలు ఉన్నప్పటికీ అవి పాడవటంతో నీళ్ల రోడ్ల పైకి వస్తున్నాయి. స్థానికులు కూడా చెత్తను ఇక్కడే వేసి వెళుతున్నారు. పారిశుధ్య కార్మికులు రాకపోవడం వల్ల చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. ఇది మురుగు నీటిలో కలవటం వల్ల పరిస్థితి మరింత విషమంగా మారింది. చెత్తను కాల్చుదామనుకుంటే సమీపంలోని గడ్డివాములు వుండటంతో ప్రమాదం జరుగుతుందని స్థానికులు కాల్చకుండా అలాగే వదిలేయడంలో దుర్వాసన వస్తోంది. కాలనీ వాసులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై వేగ నిరోధకాలు లేక పోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. లారీలు, స్కూల్ బస్సులు హైవే ఉన్నప్పటికీ ఈ దారి దగ్గర అవడంతో వాహనాలు అన్ని ఇటుగా వస్తున్నాయి. దీంతో మరింత కష్టంగా మారిందని చెబుతున్నారు. ఈదారి గుండా కృష్ణాపురం,వేంపల్లి,పులివెందుల ప్రాంతాలకు వెళ్ళాల్సి ఉంది. అధికారులు కాలనీ వాసులు సమస్యలు పరిష్కరించాలని కోరుకుంటున్నారు.


నిలిచిన మురుగు నీరు

మురుగు కాలువలు లేవు...



మురుగు కాలువల సౌకర్యం లేదు. కొన్నిచోట్ల ఉన్నప్పటికీ పాడై పోయాయి. మురుగు నీరంతా రోడ్లపైకి రావడంతో వాహనాల వల్ల నీరు ఇళ్ళ మీద పడుతోంది. నిలిచిపోయిన మురుగు నీటి వలన దుర్వాసనతో పాటు దోమల దాడి తట్టుకోలేకున్నాం. దీంతో అనేక రోగాలు వస్తున్నాయి. అంతేగాక పారిశుధ్యం మచ్చుకైనా కన్పించడం లేదు. కొన్ని నెలలుగా చెత్తను తీసే పారిశుధ్య కార్మికులు రావడం లేదు. చెత్తను అంతా రోడ్లపైనే పడేయంతో కుప్పల కొద్ది చెత్త పేరుకుని ఉంది. కాల్చుదామనుకుంటే సమీపంలో గడ్డి వాములు ఉండటం వలన ప్రమాదం సంభవిస్తుందని కాల్చడం లేదు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
- సుబ్బరాయుడు, స్థానికుడు

దోమలు ఎక్కువగా ఉండి జ్వరాలు వస్తున్నాయి



రోడ్లల్లో ఇలా చెత్త, మురుగు ఉండటం వలన దోమలు తీవ్రత ఎక్కువగా ఉంది. దాంతో రోగాల బారిన పడుతున్నాం. తీవ్రమైన జ్వరాలు వస్తున్నాయి. కార్పొరేషన్ వారు అధికారులు పట్టించుకోవడం లేదు.
- వెంకటసుబ్బయ్య, స్థానికుడు

కుందూ నీటిని కేసీ కెనాల్‌కు మళ్ళించి

పాత కడప చెరువును నింపాలి

కడప, అర్బన్ : ప్రతి ఏటా సకాలంలో కేసీ కెనాల్ పూడిక తీత పనులు ఆలస్యం చేయడం వలన కుందూ నదిలో వచ్చే నీళ్ళు వృథాగా పోతున్నాయని తక్షణం కుందూ నీటిని కేసీ కెనాల్‌కు మళ్ళించి పాత కడప చెరువును నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పాతకడప, మోడమీదపల్లె, పాలెంపల్లె, రూకవారిపల్లె రైతులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం చంద్ర మాట్లాడుతూ కేసీ కెనాల్‌కు చివరి ఆయకట్టు రైతులకు నీరందించే చారిత్రక నేపథ్యంలో కలిగిన 570 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాతకడప చెరువు క్రింద ఉక్కాయపల్లె గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలు ఆయకట్టుకు సకాలంలో నీరు చేరితే పాత చెరువు కింద పంటకు డోకా లేకుండా రెండో పంటకు దోహదపడుతుందన్నారు. పాతకడప చెరువులో నీరు-చెట్టు పనులను చేపట్టి మట్టిని తోడేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటారన్నారని ఆయకట్టు సంఘం చైర్మన్ పై ఆరోపించారు. ఇరిగేషన్ అధికారుల మద్దతుతో చైర్మన్ అక్రమాలకు అడ్డూ అదుపు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, బాలచంద్రయ్య, మనోహర్‌రెడ్డి, జయన్న, భాస్కర్ రెడ్డి, ఓబులేశు, విజయభాస్కర్‌రెడ్డి, చెన్నయ్య, రామయ్య, వెంకటరమణ తదితరులున్నారు.

నేడు తిరుపతిలో ఏపీఈపీడీసీఎల్ ఈజేఏసీ బహిరంగ సభ

కడప, అర్బన్ : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని తుడా ఆఫీస్ పక్కన, ఇందిరమ్మ మైదానంలో ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని 8 జిల్లాల విద్యుత్ కార్మికులతో ఉదయం 10 గంటలకు నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐక్యవేదిక జిల్లా కో-ఆర్డినేటర్ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు వేలాది మంది కార్మికులతో శాంతియుత ర్యాలీ ఉంటుందని తెలిపారు. అనంతరం ఏపీఎస్‌పీడీసీఎల్ కార్పొరేటర్ ఆఫీసులోని సీఎండీని కలిసి వినతి పత్రం, ప్రజాప్రతినిధుల లేఖలను సమర్పిస్తారని తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

కడప, క్రైం : కడప నగరం శంకరాపురంకు చెందిన జయరాజుకు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. మార్చి 18న సొంత పనినిమిత్తం ఆర్టీసీ బస్టాండుకు బైకుపై వచ్చాడు. బస్టాండు వద్ద బైకు పార్కింగ్ చేసి పనినిమిత్తం లోపలకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి దొంగలు ఆ బైకును చోరీ చేసినట్లు తెలిపారు.బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సినిమా గైడ్

కడప సినిమాలు

మురళి	: జయజానకి నాయక
రవి	:నేనే రాజు నేనే మంత్రి
సుధ	: ఫిదా
ప్రతాప్	: జయజానకి నాయక
అమీర్	: టాయిలెట్ ఎక్ ప్రేమ్‌కథ
రమేష్	: నేనే రాజు నేనే మంత్రి
తాహిర్	: లిప్‌స్టిక్ అండర్‌మై బుర్ఖా
అప్సర	: లై
రాజా	: లై
ఎస్ఆర్	: లై

అక్రమాలకు పాల్పడిన డిగ్రీ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

రాయలసీమ విద్యార్థి వేదిక డిమాండ్

కడప, వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న కొన్ని డిగ్రీ కళాశాలలు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమంగా వైవీయూ నుంచి అఫ్లికేషన్ పొందారంటూ రాయలసీమ విద్యార్థి వేదిక జిల్లా కన్వీనర్ నాగార్జున ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని డిగ్రీ కళాశాలలు రెండు ఎకరాలు భూమి లేకున్నా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అనుమతులు పొందారన్నారు. వైవీయూ అధికారులు వెంటనే ఆ కళాశాలకు గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైవీయూ అధికారులు కళాశాలను సందర్శించినపుడు మాత్రమే అన్ని వసతులు ఉన్నట్లు చూపిస్తారని కానీ మరలా చూస్తే వసతులు లేని భవనాలలోకి కళాశాలలను మారుస్తున్నారన్నారు. తనిఖీ అధికారులు కొన్ని కళాశాలలకు అనుమతి ఇవ్వవద్దని చెప్పినా అధికారులు ఇచ్చారని ఆరోపించారు. విద్యార్థుల నుంచి కూడా కళాశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

మాదినేని శ్రీరాములకు పీహెచ్ డీ

కడప, వైవీయూ : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని జర్నలిజం విభాగంలో పరిశోధకుడు మాదినేని శ్రీరాములకు నాగార్జున వర్సిటీ పీహెచ్ డీ ప్రదానం చేసింది. జర్నలిజం శాఖలోని డాక్టర్ జి.అనిత పర్యవేక్షణలో కమ్యూనికేషన్ ఇన్ పుట్స్ అండ్‌మోడల్ ఫార్మర్స్, ఏ స్టడీ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై శ్రీరాములు పరిశోధనలు చేశారు. ఈయన వైవీయూలో 2010-12 జర్నలిజం శాఖ మొదటి బ్యాచ్. 270 మంది ఆదర్శ రైతులపై పరిశోధనలు సాంకేతిక మీడియా నుంచి అందుతున్న సమాచారం తదితర అంశాలపై విశ్లేషించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య చంద్రయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య సత్యనారాయణరెడ్డి, డీన్ ఆచార్య పద్మ, జర్నలిజం శాఖ సమన్వయకర్త శ్యాంసన్ రూప్, అకడమిక్ కన్సల్టెంట్లు సునీత, స్వప్న, రామసుధ, మణికర్ణిక, పరిశోధకులు సురేష్, చిన్నవీరన్న విద్యార్థులు అభినందించారు.

ఒకే టీకాతో రెండు వ్యాధులు దూరం

సంబేపల్లె: ఎంఆర్ టీకాతో తట్టు, రుబెల్లా రెండు వ్యాధులు పిల్లలకు దూరమవుతాయని పూజారివాండ్లపల్లె పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. పూజారివాండ్లపల్లె పాఠశాలలో గురువారం ప్రాథమిక పాఠశాలతో పాటు ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ వ్యాక్సిన్‌ను వేసినట్లు తెలిపారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే ఖచ్చితంగా టీకా తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్‌యం ప్రమీలమ్మ, పార్వతమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు భూములకు ఆధార్ లింక్ చేసుకోవాలి

రామాపురం: రైతులు తమ భూములను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నరేంద్రకుమార్ పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లె గ్రామంలో గురువారం రైతు సేవలో రెవెన్యూశాఖ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల వద్దనే వారి పొలం సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వన్‌బీ, అడంగల్, ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వారంలో గురు, శుక్రవారాలు రెండు రోజులు గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ వంశీధర్, వీఆర్‌వో శంకరయ్య, టీడీపీ నేత చాన్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవడం సంతోషం

గాలివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులను ఆదుకోవడం సంతోషించదగ్గ విషయమని ఎంఈవో పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సేవాభావం స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు ఆర్యశంకర్ ఆధ్వర్యంలో బాలికలకు పాఠ్యపుస్తకాలను, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనిత, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌యం రెడ్డెన్న, ఆర్‌ఆర్ కళాశాల డైరెక్టర్ ఓబుల్‌రెడ్డి, మాదాసి వెంకటప్ప మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సేవాభావం స్వచ్ఛంధ సంస్థ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

పని చేయని మంచినీటి బోరు...

• వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు పెడుతున్న జనం

చిన్నమండెం: తాగునీటిపథకం మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో తాగడానికి నీరు లేదు.. సరఫరా చేస్తున్న ట్యాంకరు నీరు ఏ మూలకు సరిపోలేదు... గొంతు తడుపుకోవడానికి గుక్కెడునీటికోసం వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు పెడుతున్నామని వాపోతున్నారు బోనమల గ్రామం నాగూరివాండ్లపల్లె ప్రజలు. మండలంలోని బోనమల నాగూరివాండ్లపల్లెలో 60 కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నారు. వీరి దాహం తీర్చడానికి గ్రామం మొదటిలో బోరు వేసి మోటరు అమర్చారు. డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ ఏడాది వేసవి ప్రారంభం కాగానే బోరులో నీరు తగ్గింది. రానురాను నీటిమట్టం పూర్తిగా పడిపోయింది. వర్షాలు రాలేదు. బోరులోకి నీరు చేరలేదు. దీంతో గ్రామానికి రోజుకు ఒక ట్యాంకరు వంతున నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీరు ఎటూ చాలడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇంతలో వర్షాలు రావడంతో బోరులో నీరు చేరింది. తీరా మోటరు వదిలితే పాడైందని మెకానిక్ తెలిపాడు. మరమ్మతులు చేయించడంలో ఆలస్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు బోరు మోటరుకు మరమ్మతులు చేసి దాహం తీర్చాలని కోరుతున్నారు.



మరమ్మతులకు నోచుకోని నాగూరివాండ్లపల్లె నీటిపథకం బోరు

మరమ్మతులు చేయాలి...



తాగునీటిపథకం మోటరు పని చేయలేదు. ట్యాంకరు నీరు సరిపోలేదు. వ్యవసాయ బోర్లకు వెళ్లి నీరుతెచ్చుకుంటున్నాం. పంటలకు చాలడం లేదని రైతులు ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పం దించి మోటరుకు మరమత్తులు చేసి దాహం తీర్చాలి.

- అక్కులమ్మ, నాగూరివాండ్లపల్లె

ఆర్‌జేడీకి అభినందనల వెల్లువ

రాయచోటిటౌన్: పాఠశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా పనిచేస్తున్న బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డికి ఆగస్టు 15 వేడుకల్లో ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం పొందిన సందర్భంగా గురువారం మాసాపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు పలువురు అభినందనలు తెలిపారు. అనంతరం దుశ్శాలువాలు, పూలకుండీలతో సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో కడప జిల్లా పదో తరగతి ఫలితాల్లో రెండుసార్లు ప్రథమ స్థానం పొందడానికి ఆర్‌జేడీ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు నాణ్యమైన గుణాత్మక విద్యను పొందడానికి, జిల్లాలో పాఠశాల విద్య బలోపేతం కావడానికి ఆయన చేసిన మార్గనిర్దేశమే కారణమన్నారు. కార్యక్రమంలో లగిశెట్టివారిపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వంగిమళ్ల వేణుగోపాలరావు, మాసాపేట హైస్కూల్ ఉపాధ్యాయులు వెంకట్రామయ్య, మురళీకృష్ణ, బయారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా మూసా కలీముల్లా

రాయచోటిరూరల్: తెలుగుదేశం పార్టీ జిల్లా మైనార్టీ సెల్‌ఉపాధ్యక్షుడిగా ముసా కలీముల్లాను నియమించారు. మైనార్టీలకు సముచిత స్థానం కల్పించడంలో భాగంగానే రాయచోటిలో టీడీపీ బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కలీముల్లా సేవలను గుర్తించిన జిల్లా కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్X గాజుల ఖాదర్‌బాషా, నియోజకవర్గ కార్యదర్శి అంజద్‌అలీఖాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గాలివీడు: రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ భవానీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుండ్లచెరువు పంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే గ్రామాల్లో పర్యటించి వారి సమస్యల పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. రైతులందరూ ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గత కొన్ని సంవత్సరాలుగా సమస్యగా మారిన రస్తాను ఆమె పరిశీలించి పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వినీత్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

చిన్నమండెం: ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ రమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, వెంటనే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వర్మీకంపోస్టులను పూర్తి చేసి రైతలుకు సేంద్రియ ఎరువులు అందేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు చేసిన ఉపాధి పనుల రికార్డులను అప్‌డేట్ చేసి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఈసీ, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

20న చండీహోమం

రాయచోటిటౌన్: ఈనెల 20వ తేదీన వీరభద్రాలయంలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మంజుల తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు భద్రకాళీ అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన చండీహోమం నిర్వహించబడుతుందన్నారు. ఈ హోమంలో పాల్గొనే దంపతులు రూ.516 చెల్లించి రసీదు పొందాలని, పూజా సామాగ్రిని దేవస్థానం వారే సమకూర్చుతారని తెలిపారు. కావున భక్తాదులు ఈ హోమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధులు దూరం

రాయచోటిటౌన్: ఎంఆర్ వ్యాక్సిన్‌తో ప్రాణాంతకమైన తట్టు, రుబెల్లా వ్యాధులను దూరం చేయవచ్చునని ఐసీడీఎస్ సీడీపీవో వసంతాభాయి పేర్కొన్నారు. గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో రాజులకాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఈ టీకాను తప్పనిసరిగా వేయించాలన్నారు. ఎటువంటి అపోహలు లేకుండా ఈ వ్యాక్సిన్‌ను వేయించి భవిష్యత్తులో వారి ప్రాణాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లలకు ఎంఆర్ టీకా అందిస్తున్న దృశ్యం

ఇళ్లు, ఇంటి పట్టాలు ఇచ్చే వరకు పోరాడతాం

రాయచోటిటౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేసేంతవరకు పోరాడతామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి విశ్వనాథ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-15 సంవత్సరంలో అధికారులు శిబ్యాల సమీపంలో పేదలకు ఇంటి పట్టాలు ఇస్తామని దరఖాస్తులు స్వీకరించి ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వకపోతే భూపోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలను నాశనం చేస్తూ ఈ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు గంగిశెట్టి, నియోజకవర్గ సహాయ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, నాయకులు వెంకటేష్, చిన్నవెంకట్రమణ, సుజాత పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మోడల్ అంగన్వాడీ కేంద్రం పిల్లలకు యూనిఫాం పంపిణీ

రాయచోటిటౌన్: పట్టణంలోని పాతరాయచోటిలో ఉన్న మోడల్ అంగన్వాడీ కేంద్రం పిల్లలకు గురువారం వృక్షరక్షణ సమితి, మానవత సంస్థ సంయుక్తంగా యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని 51 మంది పిల్లలకు ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం వృక్షరక్షణ సమితి అధ్యక్షుడు తులసీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లల్లో పేద, ధనిక, కులమత బేధాలు లేకుండా అందరూ సమానంగా ఉండాలన్న లక్ష్యంతో యూనిఫాం అందజేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో పిల్లలకు బూట్లు, టైలు అందజేస్తామన్నారు. అనంతరం సీడీపీవో వసంతాభాయి మాట్లాడుతూ దాతలు అంగన్వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదివే పేద పిల్లలకు దాతల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ డీఈ సుబ్రమణ్యం, కొప్పల నాగిరెడ్డి, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యారంగ సమస్యలను విస్మరించిన టీడీపీ

పోరుమామిళ్ల : విద్యారంగ సమస్యలను టీడీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానని చెప్పినబాబు మరోసారి తన మాయమాటలతో విద్యార్థులను దారుణంగా మోసం చేశారన్నారు. చంద్రబాబుకు మద్యం టెండర్లపై ఉన్న ప్రేమ విద్యావ్యవస్థపై లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు పట్టణాభివృద్ధికి సహకరించండి... ఆర్డీవో



దుకాణదారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ వీరబ్రహ్మం

బద్వేలు : పట్టణాభివృద్ధికి సహకరించి, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు తోడ్పాటు అందించాలని రాజంపేట ఆర్డీఓ వీరబ్రహ్మం అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బద్వేలు పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో రహదారిలో ఉన్న దుకాణదారులు, సంబంధితశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్‌హెచ్ - 67 రోడ్డు విస్తరణలో భాగంగా నాలుగురోడ్ల కూడలిలో జంక్షన్ ఏర్పాటుపై దుకాణదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణదారులు పలు సమస్యలను ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. గత కొద్దిరోజులుగా ఆక్రమణ తొలగింపులో జరుగుతున్న చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఆర్డీఓ దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. కూడలిలో జంక్షన్ ఏర్పాటు, జాతీయ రహదారి పనుల్లో భాగంగా చేపడుతున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్ల ప్రమేయం లేదన్నారు. జంక్షన్ నుంచి 11మీటర్లు, 12మీటర్లు అనే విషయం గుర్తించలేమని, ప్రణాళిక ప్రకారం డ్రాయింగ్‌లో ఎంత వరకు కావాలో అంతవరకు మాత్రమే ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అందరికీ సమన్యాయం జరిగేలా చూస్తామన్నారు. దుకాణదారులు మాట్లాడుతూ జాతీయ రహదారి పనుల వలన చాలా ఇబ్బందులకు గురవుతున్నామన్నామని, ఆక్రమణలు తొలగించకుండా ప్రస్తుతం కొలతల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. ప్రధానంగా బైపాస్ సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు ఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి అధికారులకు మున్సిపాలిటీ అధికారులకు సమన్వయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మొదటగా జాతీయ రహదారి అధికారులు కాలువలు తీసి, ఆ తరువాత మున్సిపల్ అధికారులు పైపులైన్ పనులు చేపట్టడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ ఇప్పటికే జాతీయ రహదారి పనులు ఆలస్యమయ్యాయని, మీరందరూ జంక్షన్ ఏర్పాటుకు సహకరిస్తే త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ మాధవక్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లెంకొండలో అన్నదాన సత్రానికి శంకుస్థాపన



అన్నదాన సత్ర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు రామాపురం సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. పలువురి సహాయ సహకారాలతో సుమారు రూ.15లక్షలు వెచ్చించి ఈ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మల్లెంకొండకు భక్తుల రాక ప్రతి సంవత్సరం పెరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని అన్నదాన సత్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. శివరాత్రి రోజు అన్నదాన ఏర్పాటుకు కావాల్సిన అన్ని సదుపాయాలు కొండపైనే ఉంచేలా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, మల్లెంకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



పోరుమామిళ్లలో ఇంటిస్థలాల కోసం ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల : అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాను ఉద్దేశించి సీపీఐ సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్, ఏరియా కార్యదర్శి వీరశేఖర్, సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ 13నెలల నుంచి రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1008 సర్వే నెంబర్‌లో పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉన్నా, ఇంత వరకు రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేయలేదన్నారు. చాలా మందికి రేషన్ కార్డులు లేవని, మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, సోమయ్య, రాజేంద్ర, విశ్వానమ్మ, రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు



యంత్రం సహాయంతో వరినాటే విధానాన్ని చూపుతున్న వ్యవసాయాధికారులు

బద్వేలుటౌన్ : మండల పరిధిలోని అగ్రహారం పంటపొలాల్లో గురువారం వరినాటే యంత్రం ద్వారా వరిసాగు పద్ధతిని ప్రయోగాత్మకంగా ఆత్మసౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఠాగూర్ నాయక్ మాట్లాడుతూ బద్వేలు మండలానికి త్వరలో కస్టమ్‌హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, ఈసెంటర్‌లో రైతులకు వ్యవసాయానికి సంబంధించిన యంత్రాలను, పరికరాలను అతి తక్కువ బాడుగతో అద్దెకు అందజేస్తామన్నారు. ఈయంత్రం ద్వారా వరినాటడం వలన ఖర్చులు తగ్గి 10 శాతం అధిక దిగుబడులు వస్తాయని ఆయన తెలిపారు. అంతేగాకుండా కలుపు నిర్వహణ, ఎరువుల యాజమాన్యం కూడా సులభంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, విజయ్‌కుమార్, చంద్రమోహన్, సురేష్‌రెడ్డి మురళీ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

గోపవరం : మండల పరిధిలోని కోటిరెడ్డినగర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కేవీ రాజారఘువర్ధన్ బదిలీపై వెళుతున్న సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజారఘువర్ధన్‌ను పూలమాల, శాలువాలతో సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన రఘువర్ధన్ కాలువపల్లె పంచాయతీ గొల్లపల్లె ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వెలుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలఓబన్న పేర్కొన్నారు.

ఎంఆర్‌టీకా కేంద్రాలు తనిఖీ

పోరుమామిళ్ల : చిన్నపిల్లలకు రూబెల్లా, తట్టు వ్యాధులు రాకుండా ముందుజాగ్రత్త చర్యగా ప్రభుత్వం ఆధ్వర్యంలో వేస్తున్న ఎంఆర్ టీకా కేంద్రాలను యునిసెఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌రెడ్డి తనిఖీ చేశారు. గురువారం ఆయన మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మరికొన్ని కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డాక్టర్ శివక్రిష్ణ, విద్యాధికారి సాదు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో రమణారెడ్డి సేవలు మరువలేనివి



పూలమాల వేసి రమణారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కాశినాయన : పాత ఉప్పలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యాభివృద్ధికి ప్రధానోపాధ్యాయుడు గానుగపెంట రమణారెడ్డి అందించిన సేవలు మరువలేనివని మండల విద్యాధికారి కె.బాలఓబయ్య పేర్కొన్నారు. గురువారం ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి పలువురు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, సహోపాధ్యాయుడు సుబ్రమణ్యం, గొంటువారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

బద్వేలు	
శేఖర్	: నేనే రాజు, నేనేమంత్రి
నెషాద్	: జయ జానకి నాయక
లక్ష్మీనరసింహ	: లై
పోరుమామిళ్ల	
వెంకటేశ్వర	: లై
దేశాయి	: నేనే రాజు, నేనేమంత్రి

రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలి

కలసపాడు : రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తహసీల్దార్ దుగ్గయ్య తెలిపారు. గురువారం మండలంలోని కొత్తకోటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు ప్రతి రైతుకు ఉపయోగపడతాయన్నారు. సదస్సులో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, వీఆర్వో ప్రతాప్, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు



పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వాసవీమాతకు ఘనంగా పూజలు నిర్వహించి హోమంపూజలు నిర్వహించారు. గురువారం పోరుమామిళ్లలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి ఆలయ పునఃప్రతిష్ఠ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వాసవీమాతకు అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాసవీమాతను అలంకరించిన దృశ్యం

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

బద్వేలు	9885304960
బద్వేలుటౌన్	9640614371
పోరుమామిళ్ల	9441284007
కలసపాడు	9491946171
కాశినాయన	9985408967
గోపవరం	8374482744
బి.కోడూరు	9441815476
అట్లూరు	8142454286

సమాజ సేవలో యువత ముందుండాలి

● రోటరాక్ట్ కార్యవర్గానికి ఏపీపీ మార్తల పిలుపు



రోటరాక్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక దృశ్యం

ప్రొద్దుటూరు క్రైం : సమాజసేవ చేయడంలో యువత ఎప్పటికీ ముందుండాలని ఏపీపీ మార్తల సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లోని యూత్ క్రికెట్ క్లబ్ కార్యాలయంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎండీ అయూబ్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రోటరాక్ట్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్తల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలలో సంఘసేవ చేసేలా అలవాటు చేయాలన్నారు. ఆపదలో ఉన్నవారికి మేమున్నాం అనే భరోసాను యువత కల్గించాలన్నారు. రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ సాధు గోపాలక్రిష్ణ మాట్లాడుతూ రోటరీక్లబ్‌లో యువత కోసం రోటరాక్ట్‌ను స్థాపించారన్నారు.

రోటరాక్ట్ ద్వారా యువత సంఘసేవ చేసేందుకు అందుబాటులో ఉండాలన్నారు. బడి మానేసిన పిల్లలను స్కూల్‌లో చేర్పించడంతో పాటు మంచి విద్యను అభ్యసించేలా చేయాలన్నారు. సమావేశం చివరలో రోటరాక్ట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా, వారికి నియామకపు పత్రాలను రోటరీ క్లబ్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ అందించారు. రోటరాక్ట్ అధ్యక్షుడిగా ఎస్.అహ్మద్‌బాష, కార్యదర్శిగా జీవీ పవన్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్. మహమూద్, మహబూబ్ షరీఫ్, సంయుక్త కార్యదర్శిగా షమ్మి, కోశాధికారిగా సుదర్శన్‌లతో పాటు మరి కొందరిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు రోటరీ క్లబ్ సభ్యులు, పురప్రముఖులు, తదితరులు హాజరయ్యారు.

మసీదుల మరమ్మతుల నిధుల డీడీలు మాయం

ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని 22 మసీదులకు మరమ్మతుల కోసం నిధులు కేటాయించామని మున్సిపల్ మాజీ ఇన్‌ఛార్జి చైర్మన్ జబివుల్లా, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫరీద్‌లు జిల్లా కలెక్టర్‌కు 20 మే 2017న వినతిపత్రం పంపించారు. అలాగే మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లు మౌజన్‌లకు గౌరవ వేతనం అందించాలని కోరారు. ఒక్కొక్క మసీదుకు రూ.50 వేలు వంతున మరమ్మతు ఖర్చులు మంజూరు చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ఇటీవల జిల్లా కలెక్టర్ నుంచి మసీదుల మరమ్మతుల కోసం పట్టణంలోని 22 మసీదులకు ఒక్కొక్క దానికి రూ.8 వేలు వంతున నిధులు మంజూరు చేసి డీడీలు పంపినట్లు సమాచారం. అయితే ఈ డీడీలు మున్సిపల్ కార్యాలయానికి నెల కిందటే చేరినట్లు తెలిసింది. అయితే ఈ డీడీలు మున్సిపల్ కార్యాలయానికి నెల కిందటే చేరినట్లు సమాచారం. అయితే వాటిని మున్సిపల్ అధికారులు మసీదు కమిటీలను పిలిపించి అందజేయలేదు. ఆ డీడీలు గల్లంతయినట్లు మసీదు కమిటీలకు అందలేదని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫరీద్ ఆరోపించారు. మున్సిపాలిటీల్లో సిబ్బంది అధికారులు 22 మసీదులకు చెందిన రూ. 1.76 లక్షల నిధులను దారి మళ్లించినట్లు విమర్శించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఫరీద్ విలేకరులకు తెలిపారు. ఇన్‌ఛార్జి మాజీ చైర్మన్ జబివుల్లా మున్సిపల్ సిబ్బంది తీరుపై విమర్శించారు.

రాజకీయ లబ్ధికోసం మంత్రి ఆదిపై దుష్ప్రచారం-టీడీపీ



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు పల్లె రమేష్

ప్రొద్దుటూరు టౌన్: కొందరు స్వార్థపరులు తమ రాజకీయ లబ్ధికోసం రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులను కించపరిచారని, అవమానించారని దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ ఎస్సీసెల్ పట్టణాధ్యక్షుడు పల్లె రమేష్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి సొంత గ్రామమైన దేవగుడిలో దళితుల నివాసాల మధ్యే మంత్రి నివశిస్తున్నారని, ఆయన దళిత వ్యతిరేకి ఎంత మాత్రం కాదని పేర్కొన్నారు. దళితుడన్న భావన వారిలో కలుగకుండా ఉండటానికి మంత్రి ప్రతి నిత్యం వారితో కలిసి మెలసి తిరుగుతున్నారన్నారు. దళితుల శ్రేయస్సు కోసం జమ్మలమడుగు దళితవాడలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్, ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, జాబ్‌మేళా ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. మంత్రిపై బురదజల్లి తమ పబ్బం గడుపుకోవాలని కొందరు చూస్తున్నారని, మంత్రి ఆది గురించి తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చౌటపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు కల్చరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇవ్వాలని, లేనిపక్షంలో ఎర్రజెండా పాడుతామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఇళ్లు, స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ పింఛన్లను నూతనంగా ప్రభుత్వం మంజూరు చేయకుండా మరణించిన వారి స్థానంలో ఇతరులకు ఇస్తున్నారన్నారు. దీంతో అర్హులైన పింఛన్‌దారులు పింఛను కోసం ఎదురు చూడాల్సి వస్తోందన్నారు. గ్యాస్ సబ్సిడీని ప్రభుత్వం రద్దు చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. చౌక దుకాణాల ద్వారా పేదలకు అందాల్సిన సబ్సిడీ సరుకులు అందకుండా అన్నింటిని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఇళ్ల వద్ద మద్యం దుకాణాలను ర్పాటు చేయడం, మహిళలు నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఆందోళనలు అనంతరం రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునకు ఆ నేతలు ఇంటిస్థలాలు, గృహ నిర్మాణ దరఖాస్తులను అందజేశారు. సరస్వతి, మున్ని తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాలకు అద్దె నిధుల మంజూరు

ప్రొద్దటూరు కల్చరల్: అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న అద్దె భవనాలకు అద్దె చెల్లింపు నిధులు మంజూరయ్యాయి. ఏడాది నుండి అద్దె నిధులను ప్రభుత్వం మంజూరు చేయలేదు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు తమ సొంత నిధులతో చెల్లిస్తున్నారు. ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు పరిదిలో నాలుగు మండలాల్లో 328 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 104 సొంత భవనాలు, 42 కొత్త భవనాలు ఉన్నాయి. అద్దె భవనాల చెల్లింపుకై ప్రాజెక్టు పరిధిలో రూ.28 లక్షలు నిధులు మంజూరైనట్లు గురువారం సీడీపీవో నిర్మలాదేవి తెలిపారు. అద్దె భవనాలకు పూరిస్థాయిలో నిధులు ఇస్తున్నట్లు చెప్పారు.

పాఠశాలలకు కుళ్లిన గుడ్ల పంపిణీ

ప్రొద్దటూరు కల్చరల్: మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి అందిస్తున్న గుడ్లు పాఠశాలలకు అందడంలేదు. గుడ్లపంపిణీ నిర్వాహకుడు ప్రతి రెండు వారాలకు ఓసారి గుడ్లను పాఠశాలలకు అందచేయాలి. మండలంలోని కల్లూరు, తాళ్లమాపురం తదితర పాఠశాలలకు గుడ్లు అందడం లేదని ఎంఈవో సావిత్రమ్మ తెలిపారు. మండలంలోని చాలా పాఠశాలలకు గుడ్లు అందుతున్నాయో లేవో తమకే సమాచారం అందడంలేదని ఆమె 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. పంపిణీ అయిన గుడ్లలో కొన్ని గుడ్లకు పురుగులు ఉండడం, కుళ్లిన గుడ్లు వస్తున్నట్లు పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు. ఓ పాఠశాలలో 2 వేలకు పైగా గుడ్లను పరిశీలించగా వంద గుడ్లు కుళ్లిపోయినట్లు గుర్తించామని ఉపాధ్యాయుడు చెప్పారు.

చెక్కుల పంపిణీలో అవకతవకలపై విచారణ

కొండాపురం : గండికోట పునరావాసం పరిహారానికి సంబంధించి చెక్కుల పంపిణీలో అవకతవకలపై గురువారం తహసీల్దార్‌లు విచారణ చేపట్టారు. చెక్కుల్లో తేడా ఉన్నా నిర్వాసితులకు సంబంధించి వివరాలను సేకరిస్తున్నారు. చెక్కుల్లో కొట్టివేతలు ఉన్నా వారిని పిలిపించి విచారిస్తున్నారు. అదేవిధంగా చనిపోయిన వారికి సంబంధించిన చెక్కుల వివరాలను కూడా సేకరిస్తున్నారు. అదేవిధంగా పాఠశాలల్లో రికార్డుల్లో పుట్టిన తేదీ వివరాలను కూడా సేకరిస్తున్నారు. ఆర్డీఓ సరెండర్ కావడంతో కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో చెక్కులకు సంబంధించిన వివరాలను తహసీల్దార్లు పూర్తిగా సేకరిస్తున్నారు.

భీమగుండం... సమస్యల సుడిగుండం



రోడ్డుపై నిలిచిన మురికినీరు

పెద్దముడియం: గ్రామాల అభివృద్ధికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటూ ప్రభుత్వాలు ఎంత చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మౌలిక వసతులు లేని గ్రామాలు కోకొల్లలు. ఈ కోవకు చెందినదే పెద్దముడియం మండలం భీమగుండం గ్రామం. గ్రామాల్లో పలు చోట్ల మురికి కాలువలు లేక మురికి అంతా వీధుల్లో నిలుస్తోంది. జనంలో అవగాహన కొరవడి ఇళ్లలోని మురికినీరంతా వీధుల్లోకి వదులుతుండడంతో సమస్య జఠిలమవుతోంది. గ్రామంలోని ప్రాథమిక, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో సమస్యలు తిష్టవేశాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, తాగు నీటి సమస్య, క్రీడామైదానం లేకపోవడం, తరచూ చోరీలు జరగడం, వంట గదులు లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం పూర్తిగా పాడిపరిశ్రమపై ఆధారపడి ఉంది. మేకలు, గొర్రెలు సంపద పుష్కలంగా ఉంటుంది. గేదెలు కూడా అధికంగా ఉన్నాయి. గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది లేక పశువైద్యశాల ఉపకేంద్రం నాలుగు సంవత్సరాలుగా మూతపడింది. అంతేగాకుండా గ్రామంలో తరచూ తాగునీటి సమస్య తలెత్తుతోంది. గ్రామస్థులకు నీరు అందించే బోర్లలో తరచూ నీటిమట్టం తగ్గడం, మోటార్లు కాలిపోతుండడంతో గ్రామస్థులు నీటి ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని కొన్ని వీధుల్లో ఎత్తు ప్రాంతంలో ఉండడంతో అక్కడకు కుళాయి నీరు సరిగా వెళ్లక జనం అవస్థలు పడుతున్నారు.

మంత్రి ఆదినారాయణరెడ్డిని బర్తరఫ్ చేయాలి

కడప, రవీంద్రనగర్ : మంత్రి ఆదినారాయణరెడ్డిని బర్తరఫ్ చేయాలని దళిత గిరిజనుల హక్కుల పోరాట సంఘం కార్యాలయంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేవీ రమణ మాట్లాడుతూ దళితులు శుభ్రంగా వుండరు,అనడం సిగ్గుచేటన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శేఖర్,దళిత గిరిజనుల హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధీర్ , రాజు, నాగరాజు, మూర్తి పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలను పక్కాగా గుర్తించాలి

నారాయణ, ఎం.ఈవో



ఇంటర్వ్యూ

కడప, ఎర్రముక్కపల్లె : కడప కార్పొరేషన్ పరిధిలో బడిబయట పిల్లలను పక్కాగా గుర్తించాలని ఎంఈవో నారాయణ పేర్కొన్నారు. ఏపీజీఆర్ సర్వేపై ఆయన ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

ప్రశ్న : ఏపీజీఆర్ సర్వే అంటే ఏమిటి ?

జవాబు : ఆంధ్రప్రదేశ్ గ్రాస్ ఎన్ రోల్‌మెంట్ రేషియో ద్వారా బడిబయట పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడడం.

ప్రశ్న : ప్రజా సాధికారత సర్వే చేశారు కదా దాని పరిస్థితి ఏమిటి ?

జవాబు : ప్రజా సాధికారత సర్వే ద్వారా కడప కార్పొరేషన్ పరిధిలో 5933 మంది బడిబయట పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. విద్యాశాఖ యుడైస్ ప్రకారం జిల్లాలో 2400 మంది ఉన్నట్లు గుర్తించారు. మిగతా వారి పరిస్థితి ఏమిటని ప్రభుత్వం ఏపీజీఆర్ ద్వారా మళ్ళీ సర్వే చేపట్టింది.

ప్రశ్న : యూడైస్ కన్నా ప్రజాసాధికారత సర్వేలో అదనంగా వచ్చిన పిల్లలు ఎక్కడ ఉన్నట్లు గుర్తిస్తారు.

జవాబు : ప్రధానంగా పిల్లలు ఓవర్‌ఏజ్, అండర్‌ఏజ్, మైగ్రేడ్, బడిమానసిక పిల్లలు ఉంటారు. కడప నగరంలో ప్లేస్కూల్స్ ఉన్నాయి. సీబీఎస్‌సీ, కెఎస్‌సీకి చెందిన పాఠశాలలు యూడైస్‌లో ఉండవు. ఇక్కడ కూడా గుర్తించాల్సి ఉంది.

ప్రశ్న : సర్వేకి ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారు ?

జవాబు : కడప కార్పొరేషన్ పరిధిలో 13 మంది సీఆర్‌పీలు, 16 మంది ఒప్పంద ఉపాధ్యాయులు సర్వే నిర్వహిస్తున్నారు.

ప్రశ్న : ఒక్కొక్కరి టార్గెట్ ఎంత మంది పిల్లలు ?

జవాబు : ఒక్కొక్క సీఆర్‌పీకి ఒకరు లేక ఇద్దరు, ఒప్పంద ఉపాధ్యాయులను సహాయకులుగా ఇవ్వడం జరిగింది. ఒక్కొక్క బ్యాచ్ 300 నుంచి 600 వరకు బడిబయట పిల్లలను గుర్తించాలి.

ప్రశ్న : ఎప్పటిలోగా సర్వే పూర్తి చేయాలి

జవాబు : ఆగస్టు5వ తేదీలోగా ఏపీజీఆర్ సర్వే పూర్తి చేయాలి. అయితే ప్రజా సాధికారత సర్వేలో 5933 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు గుర్తించారు. యూడైస్‌లో 2400 మంది మాత్రమే ఉన్నారు. అలాగే సర్వేలో పిల్లల ఆధార్ నెంబర్ మాత్రం తప్పించి ఇంటి అడ్రస్ లేనివి 1255 ఉన్నాయి. వాటి వివరాలు ఇవ్వాలని విజయవాడకు కోరగా కొత్తగా జాబితా పంపించాం.

పరిజ్ఞానంతోనే శాఖలో, సమాజంలో గౌరవం

పోలీసుశాఖలో కమ్యునికేషన్ వ్యవస్థ కీలకం ● ఎస్పీ అట్టాడ బాబూజీ







మాట్లాడుతున్న ఎస్పీ బాబూజీ, హాజరైన ట్రైనీ అభ్యర్థులు, పోలీసు అధికారులు, వన్‌టౌన్ సీఐని సన్మానిస్తున్న ఎస్పీ

కడప, క్రైం : ప్రపంచం మొత్తం సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిందని, ప్రతి ఒక్కరూ వాటిపై పట్టు సాధించగలిగితే ఎలాంటి కేసులనైనా సులువుగా ఛేదించవచ్చు. పరిజ్ఞానంతో అటు పోలీసుశాఖకు ఇటు సమాజంలో ఆ వ్యక్తులకు గౌరవం లభిస్తుందని ఎస్పీ అట్టాడ బాబూజీ అన్నారు. కడప నగర శివారులోని పోలీసు శిక్షణ కేంద్రంలో కమ్యునికేషన్ కానిస్టేబుళ్ల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోలీసుశాఖలో కమ్యూనికేషన్ వ్యవస్థ అత్యంత కీలకమైందన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (పరిపాలన) శ్రీనివాసులరెడ్డి అభ్యర్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ అంశాలను వివరించారు. అనంతరం కానిస్టేబుల్ అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను సన్మానించిన ఎస్పీ... డీటీసీ కేంద్రాన్ని అభివృద్ధి పరచిన సీఐ సత్యనారాయణను ఎస్పీ బాబూజీ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ వెంకటేశ్వరనాయక్, కమ్యూనికేషన్ డీఎస్పీ హేమకుమార్, సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, ఎస్సీ,ఎస్టీసెల్ డీఎస్పీ సుధాకర్, షౌకత్ అలీ, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ వాసుదేవన్ , ట్రాఫిక్ డీఎస్పీ భక్తవత్సలం, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, డీటీసీ సీఐ శ్రీరాములు, ఆర్ఐ శ్రీశైల రెడ్డి, ఆర్ఎస్ఐ రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలి





మాట్లాడుతున్న చంద్ర,ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కడప, ఎర్రముక్కపల్లె : అర్హులైన పేదలందరికీ బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జి.చంద్ర, వెంకటశివ డిమాండ్ చేశారు. కడప కార్పొరేషన్ ఎదుట గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అందరికి ఇల్లు పథకం ద్వారా బ్యాంక్ లింకేజీతో ఇల్లు నిర్మిస్తామని చెప్పి కేవలం 2234 ఇళ్ళకు అనుమతించడం దుర్మార్గమన్నారు. సంవత్సరాల తరబడి ఒకే ఇంటిలో రెండు మూడు కుటుంబాలు ఇరుకు గదులలో దుర్భర పరిస్థితిలో జీవిస్తున్నారని తెలిపారు. దాదాపు 25 వేల కుటుంబాల వారు జన్మభూమి సభలలో ఇళ్ళు, ఇళ్ళ స్థలాలపై ధరఖాస్తు చేసుకున్నారన్నారు. అగ్గిపెట్టి లాంటి ఇల్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వాలు బ్యాంకు లింకేజీలతో ముడిపెట్టడం వలన పేదలు నష్టపోతున్నారని తెలిపారు. శాటిలైట్, టౌన్ షిప్, ఇందిరమ్మకాలనీ చెర్లోపల్లె లే అవుట్, వైఎస్ లే అవుట్‌లలో వందల సంఖ్యలో ప్లాట్లు ఖాళీ ఉన్నాయని రెవెన్యూ, హౌసింగ్ కార్పొరేషన్ , నగర పాలక సంస్థ అధికారులు సమన్వయంతో పేదలకు ఇళ్ళు ఇవ్వాలని కోరారు. అనంతరం కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎన్ .విజయలక్ష్మీ, జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా, సి.క్రిష్ణయ్య, మనోహర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లింగన్న సుబ్బరాయుడు, శంకర్‌నాయక్, శేఖర్, మధు, రవవి, దస్తగిరి, సుధాకర్, పెద్దన్న, మహ్మద్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

కడప, క్రైం : కడప నగరం బిల్టప్ సర్కిల్ వద్ద తాలూకా ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి సిబ్బందితో గురువారం సాయంత్రం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఆర్‌సీ, లైసెన్స్, ట్రిపుల్ సెల్‌ఫోన్ డ్రైవింగ్ వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు 40 కేసులు నమోదు చేసి రూ.8300లు జరిమానా విధించారు.

వీరభద్రాలయంలో 24న తలనీలాలు, దుస్తుల సేకరణకు వేలంపాట

రాయచోటిటౌన్: పట్టణంలోని భద్రకాళీ స మేత వీరభద్రాలయంలో ఈనెల 24వ తేదీన తలనీలాలు, అమ్మవారికి, స్వామివారికి భక్తులు మొక్కుబడుల కింద ఇచ్చే బట్టలు సేకరించుకునేందుకు వేలంపాట ఇర్వహిస్తున్న ట్లు ఆలయ ఈవో మంజుల తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఈ వేలం పాటలో హిందువులు మాత్రమే పాల్గొనాలని ఆమె సూచించారు.

సబ్సిడీ జిప్సంను సద్వినియోగం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె: ఆలస్యంగా కురిసిన వర్షాలకు వరి, ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవచ్చునని, దీనికి రైతులు జిప్సం, బోరాన్, జింక్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఠాగూర్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు, వీరబల్లి, చక్రాయపేట మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పూర్తిస్థాయిలో సాగులోకి రాలేదని, ఖరీఫ్‌కు తగినంత వర్షం కురవకపోవడం వల్ల చాలామంది సాగు చేయలేదని, కానీ ప్రత్యామ్నాయ పంటలకు ఇది మంచి అదును అన్నారు. కంది, ఉలవలు, అలసంద, ఆముదం విత్తనాలను ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందిస్తోందని, ఐదు హెక్టార్ల వరకు రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా మండలాల్లో ఏఏ పంటలు సాగుచేసింది ఈక్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేయాలన్నారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల్లో ఖరీఫ్‌లో సక్రమంగా వర్షాలు కురవలేదని, మిట్ట ప్రాంతాల్లో ఉలవలు, అలసందలు సాగు చేసుకోవచ్చునన్నారు. అలాగే చంద్రన్న రైతు క్షేత్రాలు అమలు తీరు ఎలా ఉందని లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలో ఉన్న 18 రైతు క్షేత్రాలపై రైతులకు అవగాహన కల్పించి పంట సాగు విధానాలు, వారి సమస్యలు సమస్యలు తెలుసుకోవాలన్నారు. పది హెక్టార్లు వేరుశనగ, ఇతర పంటలు సాగుచేసినా రైతులకు వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు అందించాలన్నారు. ఐఎన్‌యం పథకం కింద జిప్సం, బోరాన్, జింక్ సల్ఫేట్ రైతులకు కొరత లేకుండా అందిస్తామన్నారు. అలాగే ఆత్మా పథకం కింద హెచ్‌పీఎన్ఎస్ పథకం కింద నాలుగు మండలాల్లో కొత్త క్లస్టర్లను ఏర్పాటు చేశామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ దివాకర్, వ్యవసాయధికారులు రమణారెడ్డి, రామాంజనేయచారి, సంజీవరెడ్డి, ప్రవీణ్‌కిశోర్, శ్రీకర్, ఏఈవోలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ ఠాగూర్‌నాయక్

తట్టు నివారణకు ఎంఆర్ టీకా

లక్కిరెడ్డిపల్లె: తట్టును నివారించేందుకు మిజిల్స్, రుబెల్లా టీకాను తప్పనిసరిగా వేయించాలని ఎంపీహెచ్‌ఈవో రేఖానాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్వాడీ ప్రాథమిక పాఠశాలల్లో 952 మంది విద్యార్థులకు ఎంఆర్ టీకాను వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఈ టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సురేంద్రరెడ్డి, మణి, ఏఎన్‌యంలు సుధారాణి, రాధ, గౌరమ్మ, జ్యోతి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

సంబేపల్లె: రైతు భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రమ్మ తెలిపారు. గురువారం శెట్టిపల్లె గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రైతు సేవలో రెవెన్యూశాఖ గ్రామసభ నిర్వహించారు. రైతులు వారి సమస్యలను అర్జీల రూపంలో వివరిస్తే త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. డీకేటీ భూములను, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేరు మార్పులు తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటేశ్వర్లు, లేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీ - ఐదుగురికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని దప్పేపల్లె పంచాయతీలోని మేడిమాకులగుంత దళితవాడకు చెందిన కొంతమంది ఆటోలో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా గురువారం సాయంత్రం జాండ్రపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయాయయి. ట్రాక్టర్ బోల్తాపడి ఆటోలో ప్రయాణిస్తున్న నాగిరెడ్డి, గంగులయ్య, నాగరత్నమ్మ, ప్రవళ్లిక మరికొంత మందికి గాయాలయ్యాయి. హుటాహుటిన 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్లు ఎవ్వరూ లేకపోవడంతో సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. ఆసుపత్రిలో నలుగురు డాక్టర్లు ఉండగా రాత్రివేళల్లో ఒక్క డాక్టర్ కూడా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

● బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

సంబేపల్లె: ప్రతి ఉపాధ్యాయుడు అంకిత భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పీఎన్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌వలి, ఉపాధ్యాయుడు రామాంజులును గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించాలంటే ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా పనిచేసినప్పుడే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రామక్రిష్ణమూర్తి, సర్పంచ్ శశిధర్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈవో వెంకట్రమణ, మాజీ ఎంఆర్‌పీ రెడ్డెన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు, అధికారులు

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి


రికార్డులను పరిశీలిస్తున్న పులివెందుల ఏఎస్పీ క్రిష్ణారావు

రాయచోటిటౌన్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పులివెందుల ఏఎస్పీ క్రిష్ణారావు పోలీసు సిబ్బందికి సూచించారు. గురువారం రాయచోటి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూరల్, అర్బన్‌పోలీస్‌స్టేషన్‌ల భవనాలను పరిశీలించారు. అనంతరం సీఐలు మహేశ్వర్‌రెడ్డి, నరసింహరాజు,ఎస్‌ఐలు రమేష్‌బాబు, మైనుద్దీన్, మహమ్మద్‌రఫీలతో పాటు పోలీసు సిబ్బందితో మాట్లాడారు. రాయచోటి ప్రాంతంలో పలు సమస్యలపై ఆరా తీశారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దూరం

రామాపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దూరమవుతాయని ఎంపీడీవో అబ్దుల్‌రహీం అన్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ పక్కీరుపల్లె, కల్పనాయునిచెరువు పంచాయతీ గాలంగుండ్లపల్లెలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గాలంగుండ్లపల్లెలో పలువురు జ్వరాల భారిన పడినట్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్‌లో దోమలు వృద్ధి చెందుతాయని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీలైనంతవరకు నీటిని కాచి తాగడం మంచిదన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో మాట్లాడి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం వేయాలని సూచించారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య లోపించకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

పచ్చబడిన పంటలు - చిగురించిన ఆశలు


పచ్చగా కళకళలాడుతున్న ఆముదం పంట

సంబేపల్లె: ఈ ఏడాది ఖరీఫ్ కింద సాగుచేసిన పంటలు నిన్నటి వరకు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండుముఖం పట్టాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు పచ్చబడ్డాయి. ఒక దశలో వర్షాలు పడక నిరుత్సాహ పడిన రైతులు పంటలు పచ్చబడడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. మండల వ్యాప్తంగా వేరుశనగతో పాటు ప్రత్యామ్నాయం కింద కంది, ఆముదం, పెసర పంటలను సాగుచేశారు. మండల వ్యాప్తంగా 2200 హెక్టార్లలో వేరుశనగ సాగుచేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ సాగు గణనీయంగా తగ్గిపోయింది. దీంతో పాటు పప్పు ధాన్యాల కింద ప్రత్యామ్నాయ పంటలుగా కంది, పెసర తక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతోనైనా పంటలు బాగా పండి రైతు ఆశించిన రీతిలో దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు.

సినిమా గైడ్

రాయచోటి	
ప్రసాద్	: జయజానకినాయక
గౌతమ్	: నేనేరాజు నేనేమంత్రి
సాయి	: లై
సోనీరాజ్	: జయజానకినాయక
గాలివీడు	
పావని	: బాహుబలి-2

పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు

ఇంటర్వ్యూ

ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి



గోపవరం : మండలంలోని పంచాయతీ కేంద్రాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే గాకుండా చెత్త నుంచి సంపదను రాబట్టే కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామాలన్నింటినీ పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న : మండలానికి ఎన్ని డంపింగ్‌యార్డులు మంజూరయ్యాయి ?

జ : ఒక్కో గ్రామ పంచాయతీలో ఒక్కో డంపింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్థల సమస్య కారణంగా ఒక్కటి తప్ప మిగతా అన్ని పంచాయతీల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. గోపవరంలో ఇప్పటికే డంపింగ్‌యార్డు నిర్మాణం పూర్తి అయింది.

ప్రశ్న : యార్డు నిర్మాణానికి ఎన్ని నిధులు మంజూరయ్యాయి ?

జ : గ్రామ జనాభాను బట్టి ఒక్కో డంపింగ్ యార్డు నిర్మాణానికి ఉపాధిహామీ పథకంలో రూ. 3లక్షల నుంచి రూ. 10లక్షల వరకు మంజూరవుతుంది. గోపవరం డంపింగ్‌యార్డుకు రూ. 5.75 లక్షలు మంజూరయ్యాయి.

ప్రశ్న : డంపింగ్‌యార్డుతో ఉపయోగం ఏమిటి?

జ : గ్రామాల్లోని చెత్తను సేకరించి దాని ద్వారా సంపదను సృష్టించేందుకు ప్రణాళికలు తయారు చేశారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడటంతోపాటు కొందరికి జీవనోపాధి కలుగుతుంది. పంచాయతీకి ఆదాయం చేకూరుతుంది.

ప్రశ్న : ఆత్మగౌరవం పథకం పూర్తి అయిందా?

జ : ఆత్మగౌరవం పథకంలో మండలంలోని 7పంచాయతీల్లో 1275 మరుగుదొడ్లు పూర్తి కాగా, 456 పెండింగ్‌లో ఉన్నాయి. రామాపురం, టి.సంద్రపల్లె పంచాయతీల్లో 100శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. మరి కొన్నింటిని 100 శాతం త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

పారదర్శకంగా భూములను పరిశీలిస్తున్నాం...ఆర్డీఓ



అక్కెంగుండ్ల భూముల వద్ద మాట్లాడుతున్న ఆర్డీఓ వీరబ్రహ్మం, రైతుల నుంచి ఆధారాలు తీసుకుంటున్న కలసపాడు డిప్యూటీ తహసీల్దార్ నాగవాహిణి

కాశినాయన : మండలంలోని అక్కెంగుండ్ల పరిధిలోని మొత్తం 192 సర్వే నెంబర్లలోని భూములన్నింటిపైనా కలెక్టర్ బాబారావునాయుడు ఆదేశాల మేరకు సమగ్రంగా, పారదర్శకంగా విచారణ చేయిస్తున్నామని రాజంపేట ఆర్డీఓ వీరబ్రహ్మం పేర్కొన్నారు. గురువారం ఆయన కాశినాయ మండలంలోని వివాదాస్పద భూముల విచారణను ఆయన పరిశీలించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాస్పద అక్కెంగుండ్ల భూములను ఆరు ప్రత్యేక రెవెన్యూ అధికార బృందాలతో క్షేత్రాస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. మొత్తం 7,198 ఎకరాల్లో అటవీభూమి పోను, మిగిలిన భూములపై ఎవరు సాగులో ఉన్నారు, వారికి భూమిపై ఎలా హక్కువచ్చింది, వీరు స్థానికులా, స్థానికేతరులా అన్న విషయాలను పరిశీలించడంతో పాటు సంబంధిత రైతు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఆభూములకు సంబంధించిన పూర్తిపత్రాలను ఈ బృందాలు సేకరిస్తున్నాయన్నారు. ఇందులో సైనిక కోటా కింద భూములు పొందిన వారు నిబంధనల ప్రకారం పొందారా? లేక ఏమైనా అక్రమమార్గంలో పట్టాలు సంపాదించారా ? అని విచారణలో బయటపడుతుందన్నారు. పూర్తి విచారణ అయిన తరువాత నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని, ఇందులో ఎవరైనా అక్రమ మార్గంలో భూమి పట్టాలు పొందినట్లు రుజువైతే రద్దు చేయడానికి కూడా వెనుకాడేది లేదన్నారు. విచారణ అనంతరం మిగులు భూములు ఏమైనా ఉన్నట్లు అయితే అర్హులను గుర్తించి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా లబ్ధిదారులను ఎంపికచేసి స్థానికులకు భూములు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల తహసీల్దార్ శాంతారాంసింగ్, కలసపాడు డిప్యూటీ తహసీల్దార్ నాగవాహిణి, బద్వేలు తహసీల్దార్ మాధవక్రిష్ణారెడ్డి, బి.మఠం తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, గోపవరం డిప్యూటీ తహసీల్దార్ దస్తగిరి, అట్లూరు డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, కాశినాయన మండల తహసీల్దార్ రాజేష్ ఉదయ్‌సంతోష్, ఆర్‌ఐ మోహన్ రాజు, స్థానిక వీఆర్వో చెంచురామిరెడ్డి, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక హంగులుతో

అంగన్వాడీ ప్రీస్కూల్ ప్రారంభం

నూతన హంగులతో ఏర్పాటు చేసిన అంగన్వాడీ ప్రీస్కూలు





అంగన్వాడీ ప్రీస్కూల్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ పార్థసారథి

బద్వేలు టౌన్ : పట్టణంలోని పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ ప్రీస్కూల్‌ను గురువారం మున్సిపల్ చైర్మన్ పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ ప్రీస్కూల్లో కార్పొరేట్‌స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టిందన్నారు. పురపాలక శాఖా మంత్రి నారాయణ ఆదేశాల మేరకు మరికొన్ని కేంద్రాలను ఆధునికంగా తీర్చిదిద్దుతామన్నారు. చిన్నారులకు సులువుగా పాఠాలు అర్థమయ్యే విధంగా ఉండేందుకు టీవీ ద్వారా విద్యాబోధన, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆకర్షితులయ్యే విధంగా భవనాలకు అందమైన బొమ్మలు, చిన్నారులు కూర్చొనే కుర్చీలు, పలకలు, పుస్తకాలు ఉచితంగా అందించాలన్నారు. ఆయా సెంటర్లలో పనిచేసే అంగన్వాడీ కార్యకర్తలకు, సీడీపీవోలకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బాల్యం నుంచే అందించాలన్నారు. అంతేగాకుండా అవసరమైన మౌలిక వసతుల సమస్యలను తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్లు వెంకటసుబ్బమ్మ, పార్వతమ్మ, జయలక్ష్మి, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

అట్లూరు : భూసమస్యల కోసం నిర్వహించే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వేములూరు గ్రామ పంచాయతీలో రైతుసేవా గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యలు ఉన్న రైతులు గ్రామసభల్లో అర్జీరూపంలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమణ, సర్వేయర్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిద్దనకిచ్చాయపల్లెలో...

పోరుమామిళ్ల : మండలంలోని సిద్దనకిచ్చాయపల్లెలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గురువారం ముసల్‌రెడ్డిపల్లె పంచాయితీ పరిధిలోని సిద్దనకిచ్చాయపల్లెలో డిప్యూటీ తహసీల్దార్ అయూబ్‌ఖాన్ , ఆర్‌ఐ దక్షణమూర్తి, వీఆర్వోలు రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఉద్యాన పంటలు లాభదాయకం

పోరుమామిళ్ల : ఉద్యాన పంటలు ఎంతో లాభాదాయకమని వెలుగు కోఆర్డినేటర్ రాజుపేర్కొన్నారు. గురువారం మండలంలో ఉద్యానపంటలు సాగు చేసుకునే రైతులకు అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో 720 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేయించాలని లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ఈపంటలకు ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందన్నారు.

అర్హులందరికీ ఇంటిపట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు టౌన్ : అర్హులందరికీ ఇంటిపట్టాలు ఇవ్వాలని గురువారం పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని భూటకపు హామీలు ఇచ్చి అధికారంచేతబట్టి నేటికీ 4సంవత్సరాలు కావస్తున్నా, ఏ ఒక్కహామీని చేయకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో అర్హులందరికీ ఇండ్లు, ఇంటిపట్టాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని అనేకమార్లు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించినా రెవెన్యూయంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ జాతీయ రహదారి అధికారులు, దుకాణదారులతో సమావేశం నిర్వహిస్తుండగా సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటిపట్టాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్, జకరయ్య, చంద్రమోహన్ రాజు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిమాను గుర్రప్పస్వామి ఆలయంలో వేలంపాట

పోరుమామిళ్ల : మండలంలోని మద్దిమాను గుర్రప్పస్వామి ఆలయ ఆవరణలో కూల్‌డ్రింక్ షాపుకు వేలంపాటలు నిర్వహించినట్లు ఈఓ మారుతీప్రసాద్ తెలిపా రు. కూల్‌డ్రింక్ షాపుకు రూ.1.10 లక్షలు వేలంపాట పాడారని ఆయన తెలిపారు.

నేటి నుంచి చామలూరులో సామాజిక సర్వే

కొండాపురం : చామలూరులో శుక్రవారం నుంచి సామాజిక సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రెండో విడత సామాజిక సర్వే కోసం గ్రామస్థుల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారన్నారు. కలెక్టర్, ఆర్డీఓ ఆదేశాల మేరకు గ్రామస్థులు ఒప్పుకున్నందున శుక్రవారం నుంచి సర్వే చేస్తామన్నారు. గండికోట పునరావాసం కోసం రెండో విడత ముంపు గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. అయితే ప్రస్తుతానికి చామలూరు గ్రామస్థులు మాత్రమే ఇందుకు అంగీకరించడంతో సర్వే నిర్వహించనున్నారు.

మూలనపడ్డ మోడల్ ప్రీ స్కూల్ పుస్తకాలు, టీవీలు


మూలనపడ్డ పుస్తకాలు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల నగరపంచాయతీలో ప్రీ మోడల్ స్కూళ్ల పరిస్థితి నత్తనడకలా మారింది. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలను మూడింటిని ఒకే చోట చేర్చి వారికి అన్ని వసతులు కల్పించి నాణ్యమైన విద్యతోపాటు, పౌష్టికాహారాన్ని కూడా అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. అయితే ఎర్రగుంట్లలో 21 కేంద్రాలను 11 కేంద్రాలుగా కుదించి వాటికి ఈ తరహాలో వసతులు కల్పించేందుకు అందుకు తగిన ప్రయత్నం చేశారు. అయితే అన్నీ బెడిసికొట్టి కేవలం కొట్టంబడిలో మాత్రమే సాధ్యమైంది. ఇక్కడ నర్సరీ, ఎల్‌కేజీ, యుకేజీగా విభజించి మూడు గదుల్లో ఏర్పాటు చేశారు. వారికి విద్యుత్, నీరు, ఇతర వసతులన్నీ కల్పించారు. ఈ కేంద్రాలకు నగర పంచాయతీ సాధారణ నిదులనుంచి రూ.2.5లక్షలు ఖర్చు చేశారు. గదులను సుందరంగా తీర్చిదిద్దారు. బొమ్మలతో వాల్ పెయింటింగ్స్ అద్భుతంగా వేయించారు. కార్పొరేట్ స్కూల్‌గా తీర్చిదిద్దారు. ఇక్కడ ఎల్‌ఈడీ టీవీలు కూడా ఏర్పాటుకు సిద్ధం చేశారు. అయితే ఆధార్ లేకపోవడంతో ఇక్కడ సమస్యలు తలెత్తాయి.

ఆధార్ లేకుండా పుస్తకాల పంపిణీ ఎలా -కమిషనర్


విజయసింహారెడ్డి, కమిషనర్

ఈ స్కూళ్లకు ప్రత్యేక పుస్తకాలను ప్రభుత్వమే ప్రింట్ చేసి ఇక్కడికి పంపించింది. అయితే వాటిని పంపిణీ చేసేందుకు ఇప్పటికీ తమ విద్యార్థుల వివరాలు ఆధార్‌కార్డుతో సహా ఇవ్వడంలేదని కమిషనర్ తెలిపారు. భారీ ఖర్చుతో ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేశాం. అయితే ఇక్కడ నర్సరీలో 19, ఎల్‌కేజి 18,యూకేజీ 18మంది విద్యార్థులు ఉన్నట్లుగా రికార్డులు చూపిస్తున్నారని, ఎప్పుడు వెళ్లినా అంతమంది ఉండకపోవడంతో పంపిణీ చేయలేదర్నారు. ఎల్‌ఈడీ టీవీలు కూడా తెప్పించామన్నారు. సరైన ఆధారాలు లేకపోవడంతో వాటిని కూడా అమర్చలేదన్నారు. వీరికి పంపిణీ చేసిన తర్వాత మిగిలిన పుస్తకాలను ఇతర కేంద్రాలకు పంపిణీచేయాల్సి ఉందన్నారు. సూపర్‌వైజర్, సీడీపీవో కూడా సహకరించకపోవడంతో అలాగే ఉన్నాయన్నారు. వీటిపై కలెక్టర్‌కు, పీడీకి నివేదిక పంపుతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఇళ్లు ప్రభుత్వమే నిర్మించి ఇస్తుంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్

ఎర్రగుంట్ల: అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని కమిషనర్ విజయసింహారెడ్డి అన్నారు. ఎర్రగుంట్ల నగరపంచాయతీలో ఉండే అర్హులందరికీ స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఎర్రగుంట్ల నగరపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నా వద్దకు చేరుకున్న కమిషనర్ మాట్లాడుతూ ఎర్రగుంట్లకు 2000 ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 700 మంది మాత్రమే దరఖాస్తు చేశారన్నారు. అర్హులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. అలాగే డంపింగ్ యార్డుకోసం తాము అన్ని ప్రయత్నాలు చేశామని, స్థలం ఇచ్చేవారుంటే ముందుకు రావాలని కోరారు. డ్రైనేజీని నాన్ అమృత్‌కింద నిర్మించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.40కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు టెండర్లు పిలిచామని, అయితే ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. త్వరలో మళ్లీ పిలుస్తామన్నారు. ఎంవీ సుబ్బారెడ్డి, భవానిశంకర్, ఓబుళరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవలో రెవెన్యూ అధికారులు



సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

పెద్దముడియం: మండల పరిధిలోని పెద్దముడియం గ్రామంలో గురువారం రైతు సేవలో రెవెన్యూ కార్యక్రమం జరిగింది. ఇన్‌ఛార్జి తహసీల్దారు షఫి, సర్వేయర్ హరిప్రసాద్, వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు వారికి సంబందించిన సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. పాస్‌పుస్తకాల్లో తప్పుడు దొర్లడం, కంప్యూటర్ అడంగల్‌లో పొరపాట్లు, భూముల కొలతలకు సంబందించిన సమస్యలు తదితర సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చారు. అన్నింటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని, రికార్డుల్లో తప్పులు లేకుండా సరిదిద్దుతామని తహసీల్దారు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల్లో రైతులు సమస్యలను సభ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దారు షఫి పేర్కొన్నారు.

'దళితులపై మంత్రి ఆది వ్యాఖ్యలు గర్హనీయం'

ఎర్రగుంట్ల: దళితులపై మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు గర్హణీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.సులోచన, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.గంగిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

24న మండల మీట్

కొండాపురం : ఈనెల 24వ తేదీ కొండాపురం మండల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎంపీపీ అద్యక్షతన స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు. అన్ని రకాల సమస్యలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి పొందాలి-సీఐ


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

జమ్మలమడుగు రూరల్: వినాయక చవితి సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు స్టేషన్‌లో అనుమతి పొందాలని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక విగ్రహాలకు నిర్వాహకులే తగిన భద్రత కల్పించుకోవాలన్నారు. విగ్రహం వద్ద నలుగురికి తక్కువ కాకుండా రాత్రింబవళ్లు ఉండి చూసుకోవాలన్నారు. విగ్రహాలను ఎక్కడ ఏర్పాటు చేసేది, నిమజ్జనం తదితర వివరాలన్నీ పత్రంలో రాసి ఇవ్వాలన్నారు.

● **నిబంధనలు పాటించాలి**

వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని జమ్మలమడుగు రూరల్ సీఐ ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేవారు స్టేషన్‌లో అనుమతి పొందాలన్నారు. జమ్మలమడుగు రూరల్ పరిధిలోని మైలవరం, తలమంచిపట్నం, పెద్దముడియం పోలీసు స్టేషన్ల పరిధిలో విగ్రహాలు నిలుపువారు నిబంధనలు పాటించాలన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి
Hello Andhra Jyothi

● మీ సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

- ● ఎర్రగుంట్ల - 9441112349
- ● ముద్దనూరు - 8099575259
- ● జమ్మలమడుగుటౌన్ - 9948300003
- ● జమ్మలమడుగురూరల్- 9848855313
- ● మైలవరం - 9912265711
- ● పెద్దముడియం - 9494835608
- ● కొండాపురం- 9440941345

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి



జమ్మలమడుగు: పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు దండు రవి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్, గురువారం ఆర్డీవో దేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మలమడుగులో ఇళ్లులేని పేదలు ఉన్నారన్నారు. అలాగే చేనేత కార్మికులు కూడా ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే పరిశీలించి ఇళ్లులేని పేదలను గుర్తించి వెంటనే స్థలాలు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న అంజన

మైలవరం: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రైనింగ్ అధికారి (హైకోర్టు న్యాయవాది) అంజన, మన బిడ్డ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం దొమ్మరనంద్యాలలో ఆర్తి విజయా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మన బిడ్డ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు న్యాయకత్వ లక్షణాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అధికారి అం జనా మాట్లాడుతూ మహిళలకు సంబందించి హక్కుల గురించి భ్రూణ హత్యలు, శిశు మరణాలు, గృహహింసకు సంబధించి పలు విషయాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం దొమ్మరనంద్యాలలో ట్రైనింగ్ తీసుకున్న 28 మంది మహిళలకు ట్రైనింగ్ అధికారి అంజనా సర్టిఫికెట్లను వారికి పంపిణీ చేశారు. మనబిడ్డ మండల కౌన్సిలర్ విజయలత, మహిళలు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్ సమస్య పరిష్కరించండి

కలెక్టర్‌కు జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుల వినతి ● రూ. 7.50 లక్షలతో రోడ్డు నిర్మాణం - కలెక్టర్ బాబూరావునాయుడు



కలెక్టర్‌కు వినతి సమర్పిస్తున్న జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు

కడప, ఎర్రముక్కపల్లె : కడప రైల్వేస్టేషన్ సమీపంలో గల ప్రభుత్వ అప్రోచ్ రోడ్ గుంతలమయంగా ఉందని దానిని తక్షణ పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వేజోనల్ రైల్వే యూజర్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు సి.వి. సురేష్‌యాదవ్ కోరారు. కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రైల్వేస్టేషన్ చాలా సుందరంగా ఉంది కాని సమీపంలో ఉన్న ప్రభుత్వ అప్రోచ్ రోడ్డు గుంతలమయమై ఉందని తెలిపారు. ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ. 7.50 లక్షలతో రోడ్డు నిర్మాణం - కలెక్టర్

జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ తక్షణం స్పందించారు. కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పిలిపించి అప్రోచ్ రోడ్ నిర్మాణానికి ఎస్టిమేషన్ వేయాలని సూచించడంలో రూ.7.50 లక్షలు నిధులు ఖర్చవుతుందని కమిషనర్ కలెక్టర్‌కు తెలిపారు. తక్షణం వాటిని మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు.

రైల్వేస్టేషన్‌ లో తనిఖీలు...

కడప రైల్వేస్టేషన్ లో గురువారం జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు తనిఖీ నిర్వహించారు.క్యాంటీన్‌లో ఆహారాన్ని పరిశీలించారు. ప్రయాణికులు రైల్వేనిర్ణయించిన ప్రకారం ఆహారం అందించాలని తెలిపారు. కడప రైల్వేస్టేషన్ స్వచ్ఛతలో బేష్‌గా ఉందని కితాబు ఇచ్చారు.

విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలి



ఉక్కు దీక్షలో పాల్గొన్న వారికి పూల మాలలు వేస్తున్న ఐస్‌క్రీమ్‌రవి

కడప, రవీంద్రనగర్ : ఉక్కు పరిశ్రమ స్థాపనకు విభజనచట్టంలోని హామీలను నెరవేర్చాలని వైఎస్ఆర్ పార్టీ నాయకులు ఐస్‌క్రీమ్ రవి అభిప్రాయపడ్డారు. ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు పోరాట దీక్షలు 42వ రోజు గురువారం పాల్గొన్నవారికి పూలమాలలు వేసి మాట్లాడారు. రాష్ట్రం విడిపోక ముందు విభజనా చట్టం షెడ్యూల్ 13లో జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని హామీ ఇచ్చారని బీజేపీ ప్రభుత్వం కూడా మద్దతు ఇచ్చిందన్నారు. మాబు గంగాధర్, అశోక్, రమణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి ఆర్టీసీ బస్సులు

కడప లీగల్ : కడప రిమ్స్ సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలోని విద్యార్థులకు సరిపడా తగినన్ని ఆర్టీసీ బస్సులను నడిపించాలని తల్లిదండ్రులు లోక్ అదాలత్‌లో ఫిర్యాదుచేశారు. దీనిపై లోక్ అదాలత్ స్పందించింది. ఈమేరకు ఆర్టీసీ యాజమాన్యానికి సమాధానం కోసం నోటీలు జారీచేశారు. దీంతో ఆర్టీసీ కడప డిపో మేనేజర్ గురువారం లోక్ అదాలత్‌కు వచ్చారు. ఈమేరకు డీఎల్ఎస్ఏ(లోక్ అదాలత్) కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి యు.యు. ప్రసాద్ కేంద్రీయ విశ్వవిద్యాయ విద్యార్థుల తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుపై చర్చించారు. దీంతో ఆర్టీసీ యాజమాన్యం అదనంగా మరో రెండు బస్సులను బుధవారం నుంచి నడిపేందుకు అంగీకరించారు.

దివంగత సీఆర్ఐ సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి



బియ్యం బస్తాలను పంపిణీ చేస్తున్న గోవిందనాగరాజు, సీఆర్ఐ పెద్దసుబ్బరాయుడు

కడప, ఎర్రముక్కపల్లె : బీసీల సంక్షేమం కోసం కృషి చేసిన దివంగత సీఆర్ఐ సుబ్బారెడ్డి సేవలు మరువలేనివని బీసీ నాయకుడు గోవిందునాగరాజు కొనియాడారు. గురువారం సీఆర్ఐ సుబ్బారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు నగరంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అల్‌షిఫా మానసిక వికలాంగుల కేంద్రంలో, సత్యసాయి అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సీఆర్ఐ సుబ్బారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని క్రిష్టాపురానికి చెందిన పేద విద్యార్థికి రూ.20వేలు ఆర్థిక సాయం అం దించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఐ పెద్దసుబ్బరాయుడు, పల్లా రాధాక్రిష్ణ, సునీల్ జయంత్, వెంకటలక్షుమ్మ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.నాగరాజు, సీఆర్ఐ శిష్యుడు అబ్దుల్ సమద్, పెద్దసంఖ్యలో అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

డిపార్టుమెంట్ ఉద్యోగులుగా పరిగణించాలి

కడప, అర్బన్ : జీడీఎస్ ఉద్యోగులను డిపార్టుమెంట్ ఉద్యోగులుగా పరిగణించాలని, న్యాయమైనకోర్కెలను వెంటనే పరిష్కరించాలని ఆల్‌ఇండియా గ్రామీణ డాక్ సెవక్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగుల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి బుధవారం నుంచి సమ్మెను ప్రారంభించారు. సమ్మె రెండో రోజు ఆయన మాట్లాడుతూ 7వ వేతనం, సవరణకు, పోస్టల్ వ్యవస్థ ఏర్పడినప్పటినుంచి వెట్టి చాకిరిని కేంద్ర ప్రభుత్వం అర, కొర జీతాలకు పని చేయించుకుంటోందన్నారు. సమ్మె లో మహిళా జీడీఎస్‌లు, ఈడీడీఏ, ఈడీఎంసీ, బీపీఎంలు, జీడీఎస్‌లు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల ఫలితాలు విడుదల

కడప, రవీంద్రనగర్ :2017-18 విద్యాసంవత్సరానికి నాలుగోతరగతి ప్రవేశానికి నిర్వహించిన వైఎస్ ఆర్ క్రీడాపాఠశాల ఫలితాలు అధికారికంగా ప్రకటించామని కలెక్టర్ తెలిపినట్లు క్రీడాపాఠశాల ప్రభుత్వ అధికారి నటరాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2 నుంచి 30వ తేదీ వరకు గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కని ప్రతిభ కనబరచిన వారిని శాప్ వారు ఈ నెల 12న వెబ్‌సైట్‌లో వుంచారని తెలిపారు. పాఠశాలకు ఎంపికైన 20 మంది బాలురు 20 మంది బాలికలకు ఉత్తరాలు పంపినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 1వ తేదీలోగా పాఠశాలలో హాజరు కావాలన్నారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప, ఎర్రముక్కపల్లె : నిరక్షరాస్యులైన లక్ష్మీవెంకటేశ్వర రజకసంఘం సభ్యులను మోసం చేసిన పాలెం శ్రీదేవి, ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు లోన్ మంజూరు అయితే తమకు తెలియకుండా ఆ సొమ్ము స్వాహా చేసిందని తెలిపారు. తమకు లోన్ కావాలని దరఖాస్తు పెట్టుకుంటే పాత లోన్ కడితే ఇస్తామని చెప్పడంతో తాము అవాక్కయ్యారన్నారు. తక్షణం విచారణ చేసి తమ లోన్ డబ్బు తమకు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీ వెంకటేశ్వర రజక సంఘం సభ్యులు చిన్న చంద్ర, గంగులయ్య, సుబ్బరాయుడు, గంగులమ్మ, రాజయ్య, రాజ, భాగ్యమ్మ, బాబు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

పాఠశాల విద్యా కమిషనర్‌కు వ్యాయామ ఉపాధ్యాయుల వినతి



సంధ్యారాణిని కలిసిన ఒంటేరు, శివశంకరరెడ్డి

కడప, రవీంద్రనగర్ : పాఠశాల విద్యా కమిషనర్ సంధ్యారాణిని ఉపాధ్యాయుల సంఘం గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి విజయవాడలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ డీఈవో పూల్‌లో వున్న వ్యాయామ ఉపాధ్యాయుల అన్ని జిల్లాల్లా పూర్తిస్థాయి డేటా ఖాళీల వివరాలు జేడీ సర్వీసెస్‌కు వచ్చిన వెంటనే సర్దుబాటు చేస్తామని ఆమె తెలిపినట్లు తెలిపారు. 30శాతం పదోన్నతులు సర్దుబాటు కంటే ముందు జరపాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న అంజన

మైలవరం: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రైనింగ్ అధికారి (హైకోర్టు న్యాయవాది) అంజన, మన బిడ్డ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం దొమ్మరనంద్యాలలో ఆర్తి విజయా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మన బిడ్డ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు న్యాయకత్వ లక్షణాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అధికారి అం జనా మాట్లాడుతూ మహిళలకు సంబంధించి హక్కుల గురించి భ్రూణ హత్యలు, శిశు మరణాలు, గృహహింసకు సంబంధించి పలు విషయాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం దొమ్మరనంద్యాలలో ట్రైనింగ్ తీసుకున్న 28 మంది మహిళలకు ట్రైనింగ్ అధికారి అంజనా సర్టిఫికెట్లను వారికి పంపిణీ చేశారు. మనబిడ్డ మండల కౌన్సిలర్ విజయలత, మహిళలు పాల్గొన్నారు.

ఖాతాల్లో జమవుతున్న ఫసల్ బీమా పరిహారం

• వేంపల్లెకు రూ.6.50 కోట్లు మంజూరు

వేంపల్లె : వేంపల్లె స్టేట్ బ్యాంకు పరిధిలో ఫసల్ బీమా ప్రీమియం చెల్లించిన రైతులకు రూ.6.50 కోట్లు మంజూరైంది. మొత్తం సుమారు 1300 మంది రైతులకు ఈ మొత్తం మంజూరైంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పత్తిపంటకు బీమా ప్రీమియం చెల్లించారు. ఆయా రైతులకు రెండు రోజులుగా స్టేట్ బ్యాంకుకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఎకరాకు రూ.16 వేల నుంచి రూ. 17వేల మధ్యలో నగదు జమ అవుతున్నట్లు తెలిసింది. దీంతో కరువుతో ఇబ్బంది పడుతున్న రైతాంగానికి ఫసల్ బీమా ఉపయోగకరంగా మారింది.

గండి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకూడదు



గండి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ కృష్ణారావు

చక్రాయపేట : ప్రసిద్ధ గండి క్షేత్రంలో జరిగే శ్రావణ మాస ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని పులివెందుల ఏఎస్పీ కృష్ణారావు ఆదేశించారు. ఏఎస్పీ కృష్ణారావు కొత్తగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గండి వీరాంజనేయ స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ గురుప్రసాద్, పూజారి కేసరి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామి మహిమలను అడిగి తెలుసుకున్నారు. శ్రావణ మాసంలో నాలుగో శనివారంలో గండికి భారీగా భక్తులు చేరుకుంటారని, వారిని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని పోలీసులకు తెలపడంతో పాటు గండి క్షేత్రంలో కలియతిరిగారు. అలాగే చివరి శనివారం కావడంతో ఆంజనేయస్వామి గ్రామోత్సవం ఉంటుందని సహాయ కమిషనర్ గురుప్రసాద్ ఏఎస్పీకి తెలియజేశారు. పాపాఘ్ని నదిలో ఆస్నానం ఏర్పాటు చేసి ముఖ్య అతిథులను ఆహ్వానించి సత్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణుడు, పోలీసులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న మేఘాలు.. కురవని వర్షాలు



సింహాద్రిపురంలో ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు

సింహాద్రిపురం: మండలంలో ఎక్కడ చూసినా కారు మేఘాలు కమ్ముడం, వర్షం రాకుండా పోవడం షరా మామూలైంది. దీంతో ఖరీఫ్ సాగులో విత్తనం పడక ఎక్కడ చూసినా బీడు భూములు ఎడారులను తలపిస్తున్నాయి. ఈ సందర్భంగా మండలంలో వర్షపాతం నమోదు చూస్తే చాలా అధ్వానంగా కనీస వర్షపాతం కూడా నమోదుకాక పోవడం రైతులను ఇబ్బందులు పెడుతోంది. ఏప్రిల్ మాసంలో సాధారణ వర్షపాతం 5.0 మిల్లీమీటర్లు కాగా కేవలం 3.0 మి.మీటర్ల వర్షం కురిసింది. మే మాసంలో 32.0 మి.మీటర్ల వర్షపాతం కాగా, ఆ నెలలో 23.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్ మాసంలో 66.0 కాగా 94.8మి. మీటర్ల వర్షపాతం నమోదైంది. జూలై మాసంలో 101.0 మి.మీ కాగా కేవలం 24.8మి.మీల వర్షపాతం నమోదైంది. ఆగష్టు మాసంలో 107.0 సాధారణ వర్షపాతం కాగా ఇప్పటి వరకు నమోదు కాలేదు. దీంతో జూలై మాసంలో పదును వర్షం కురిసి విత్తనం వేసిన సందర్భంలో అతి తక్కువ వర్షం కురవడం దారుణం. దీంతో ఖరీఫ్లో విత్తనం పడక రైతులు కరువుబారిన పడినట్లే. అరకొరగా వేసిన విత్తనం వర్షాభావంతో పంట పెరగకుండా భూమినంటిపెట్టుకుపోయింది. దీంతో రైతులు ప్రతిరోజు మేఘాలు కమ్మినప్పుడు ఆశగా ఎదురుచూడడం, చివరకు వర్షం కురవకుండా ఆ మేఘాలు సైతం వెళ్లిపోవడంతో రైతులు నిరాశకు లోనవడం పరిపాటైంది. ఈ ఏడాది బతికేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పశువులకు కూడా ఎక్కడా పచ్చిక లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. ఏదైనా వరుణదేవుడు కరుణిస్తే తప్పా రైతులు బతికే పరిస్థితి కనిపించడం లేదు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలివ్వాలి



తహసీల్దార్కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పులివెందుల టౌన్: అర్హులైన పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం, ఏరియా కార్యదర్శి బాషలు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ పేదలకు సొంత ఇల్లు లేక, బాడుగలు చెల్లించలేక, పిల్లలను చదివించడానికి ఆర్థిక స్తోమత లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని అనేక వాగ్దానాలు, హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా వాటి అమలుకు నోచుకోలేదన్నారు. అనంతరం తహసీల్దార్కు వినతిపత్రం అందించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అంజనప్ప, రజియ, చాంద్బాషా, సుశీల, ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి జగన్, ఏఐటీయూసీ నజీర్, పర్వీన్, మాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

పులివెందుల	
మారుతి	: ఫిదా
లక్ష్మీ	: నక్షత్రం
రాఘవేంద్ర	: లై
శ్రీనివాస	: జయ జానకి నాయక
సుజాత	: నేనే రాజు నేనే మంత్రి
వేంపల్లె	
తిరుమల	: శమంతకమణి
వెంకటేశ్వర	: ఫిదా
సూర్యహాల్	: గౌతంనంద

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రైతు సేవ

వేంపల్లె : రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామ సభలను నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీరమణ తెలిపారు. మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో రెవెన్యూ శాఖ రైతు సేవలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన సమస్యలకు సంబంధించి వినతిపత్రాలను అందుకున్నారు. వాటికి పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ పరమేశ్వర్, తాళ్లపల్లె గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన




విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఈ రమణమ్మ

తొండూరు: విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్ఈ రమణమ్మ పేర్కొన్నారు. గురువారం తొండూరు ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు భోజనం చేసే సమయంలో చేతులు బాగా శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం దంతాలు బాగా శుభ్రం చేసుకోవాలని, సురక్షితమైన నీరు తాగాలన్నారు. రాత్రి పడుకునే ముందు దోమలు కుట్టకుండా దోమతెరలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లను సంరక్షించడమే కర్తవ్యం

వేంపల్లె : చెట్లను నాటి వాటిని సంరక్షించడమే మనముందున్న కర్తవ్యమని మాజీ గ్రంథాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అలవలపాడు గ్రామం నుంచి పెర్నపాడు గ్రామం వరకు రూ.3.50 లక్షల వ్యయంతో అవెన్యూ ప్లాంటేషన్ పని మంజూరు పత్రాన్ని గురువారం బాలస్వామిరెడ్డి, గ్రామ సర్పంచు అన్నారెడ్డి సువర్ణలు డ్వాక్రా గ్రూపు సభ్యురాలు నారాయణమ్మకు అందించారు. ఈ సందర్భంగా పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి రోడ్డుకు ఇరువైపులా నాటించేలా చర్యలు తీసుకోవాలని వెలుగు సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో సీసీ నాగేశ్వరమ్మ, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల కార్యక్రమానికి తరలిరావాలి



విలేకరులతో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

తొండూరు : 21వ తేదీ సోమవారం కడపలో జరిగే వికలాంగుల కార్యక్రమానికి జిల్లాలోని వికలాంగులందరూ తరలిరావాలని వికలాంగుల రాష్ట్ర సమితి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం తొండూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు కడపలోని స్థానిక వైఎస్సార్ ప్రెస్క్లబ్ హాల్లో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వికలాంగుల చైర్మన్ కోటేశ్వర్రావులు హాజరవుతారన్నారు. వారి చేతులమీదుగా వికలాంగులకు ట్రై సైకిళ్లు, బస్ పాస్లు, చెవిటిమిషన్లు, వృద్ధులకు కంటి అద్దాలు, చేతికర్రలు తదితర వాటిని పంపిణీ చేస్తారన్నారు. ఈ సమావేశానికి హాజరయ్యే వికలాంగులు 5 ఫొటోలు, మెడికల్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సు కాపీలను వెంట తెచ్చుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేరుశనగలో జిప్సంను ఉపయోగించాలి

• వ్యవసాయశాఖ డీడీఏ విజయభారతి



వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ డీడీఏ విజయభారతి

వేంపల్లె: వేరుశనగ పంట పూత దశలో ఉన్నందున జిప్సం వాడితే అధిక నూనెశాతం కలిగి గింజ నాణ్యత పెరుగుతుందని వ్యవసాయశాఖ డీడీఏ విజయభారతి రైతులకు సూచించారు. మండలంలోని పాములూరు గ్రామంలో వేరుశనగ పంటను గురువారం ఏడీఏ రమణారెడ్డితో కలిసి తనిఖీ చేశారు. రైతులకు ఉచితంగా మినీకిట్ ద్వారా పంపిణీ చేసి సాగైన పంటలను వారు పాములూరు గ్రామంలో పరిశీలించారు. పంటల సాగుకు సంబంధించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. వందశాతం ఉచితంగా పంపిణీ చేస్తున్న జిప్సం, జింక్ అందిందా లేదా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె, వేముల ఏఓలు జ్యోత్స్న, శ్రీవాణి, గోవర్ధన్, ఏఈఓలు సురేష్, గౌతమి, తబిత తదితరులు పాల్గొన్నారు.

నేడు అలవలపాడులో విద్యుత్ గ్రామసభ

వేంపల్లె: మండలంలోని అలవలపాడు గ్రామంలో శుక్రవారం విద్యుత్ గ్రామసభ నిర్వహిస్తున్నామని ఏఈ శ్రావణ్కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు, వ్యవసాయ వినియోగదారులకు ఏదైనా సమస్య ఉంటే పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎంపీడీవోగా వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



మైదుకూరు రూరల్ : మైదుకూరు మండల అభివృద్ధి అధికారిగా వేణుగోపాల్‌రెడ్డి గురువారం తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై మైదుకూరు ఎంపీడీవోగా వచ్చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

ఎన్నాళ్లిలా నడిచేది

క్రిష్ణంపల్లె రహదారి నిర్మాణ పనులు చేపట్టరా?

దువ్వూరు : మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో కృష్ణంపల్లెకు వెళ్లే రహదారి అధ్వాన్నస్థితికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానగూడురు నుంచి కృష్ణంపల్లెకు వెళ్లే రహదారి 12 సంవత్సరాలుగా నిర్మాణ పనులకు నోచుకోలేదు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న డ్రైనేజీ, పంట కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా దారిలో మోకాళ్ల లోతు నీళ్ల నిలుస్తున్నాయి. దీంతో దారికి ఇరువురి ఉన్న ఇళ్లలోకి వర్షపునీరు చేరుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పనులకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసినా ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో ఇళ్లలోకి వర్షపునీరు చేరుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.


ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

రోడ్డు పనులు చేపట్టాలి



దారి వెంబడి గుంతలు ఏర్పడడంతో నడిచేందుకు వీలు లేదు. చిన్నపాటి వర్షం పడినా దోమలు చేరి వ్యాధుల బారిన పడుతున్నాం. రోడ్డును బాగు చేయాలి.

- లక్ష్మీదేవి, కానగూడూరు గ్రామం,

ఇళ్లలోకి వర్షం నీరు చేరుతోంది



ప్రధాన రహదారిలో అధికంగా గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వచ్చినప్పుడు లోతట్టులో ఉన్న ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి. ఇంటిలోని సామాగ్రి దెబ్బతింటోంది. రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం త్వరగా పనులు చేపట్టాలి.

- ఓబుళమ్మ, కానగూడూరు గ్రామం.

పదిశాతం రాయితీతో ప్రయాణించండి


మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మోషే

మైదుకూరు రూరల్ : కేవలం వంద రూపాయల ఖర్చుతో వనితాకార్డును కొనండి... నెల రోజుల పాటు మీ కుటుంబంలోని ఐదుగురు సభ్యులు పది శాతం రాయతీతో ఎక్కడికైనా ప్రయాణించండి మైదుకూరు డిపో మేనేజర్ మోషే పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబంలోని ఐదుగురు సభ్యులు కేవలం వంద రూపాయలను ఖర్చు చేసి వనితాకార్డును తీసు కోవాలని తెలిపారు. ఐదుగురు సభ్యులకు సపరేట్ కార్డులు కావాల్సిన వారు ఇరవై రూపాయలను అదనంగా చెల్లించి ఐదుకార్డులు పొందవచ్చునని తెలిపారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని, రాయతీతో ప్రయాణం చేసి డబ్బులను ఆదా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీవో కె.సుబ్బమ్మ, నాయక్ తదితరులు ఉన్నారు.

సమస్యలు తీర్చాలంటూ ఆందోళన


ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మైదుకూరు రూరల్ : ప్రజల సమస్యలను తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎ.వి.రమణ, నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు పేర్కొన్నారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో గురువారం సీపీఐ కార్యకర్తలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. టీడీపీ ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోలేక పోయిందని తెలిపారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేయాలని, ఎస్సీ,ఎస్టీ, బీ.సీలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేయాలని, అర్హులైన వితంతువులకు,వికలాంగులకు, వృద్ధులకు పింఛన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. క్యార్యక్రమంలో బీవీ శ్రీనివాసులు, నరసిహులు, చిన్నయ్య, నాగరాజు, సుబ్బమ్మ, గౌసియా, విజయమ్మ, పవన్‌కుమార్, వెంకటేష్, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిగడ్డితో అధిక పాల దిగుబడి


ఆవు దూడకు మందులు వస్తున్న ఏడీ ఖదీర్‌బాషా

చాపాడు : గేదెలకు, ఆవులకు పచ్చిగడ్డిని ఆహారంగా ఇస్తే అధిక పాల దిగుబడి పొందవచ్చని మైదుకూరు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఖదీర్‌బాష అన్నారు. మండలంలోని ఓబుళరెడ్డిపేట గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ గ్రామాల్లో పశుగ్రాస క్షేత్రాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులందరూ పచ్చిగడ్డిని పెంచుకోవాలన్నారు. ఈశిబిరంలో సాదారణ చికిత్సలు 105, నట్టల నివారణ కోసం 72 దూడలకు, 362 గొర్రెలు, మేకలకు మందులు వేసినట్లు పశువైద్య అధికారిణి శిరీష తెలిపారు. 37 గర్భకోశ చికిత్సలు చేశామన్నారు. ఈ శిబిరంలో పశువైద్య అధికారులు సురేష్‌రెడ్డి, గీతాప్రియ, వీఎల్‌వో వెంకటేశ్వర్లు, వీఎస్‌ఏ ఎరపురెడ్డి, సూపర్‌వైజర్ మురళి, సీబీవో ఉషా, పశుమిత్రులు సిద్దయ్య, దస్తగిరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే ప్రతిభ గుర్తింపు


విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ప్రిన్సిపాల్ మద్దిలేటిరెడ్డి

ఖాజీపేట: విద్యార్థులు పోటీ తత్వంతో పరీక్షలు రాసినప్పుడే గుర్తింపు వస్తుందని ఆర్‌వీఎస్‌ఎస్‌వి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటిరెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులకు కేంద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో ఆ కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు బంగారు, వెండి, రజిత పతకాలు అందచేశారు.
కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్స్ విష్ణువర్ధన్, రవి, ఉప్రేంద, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వేపరాలపల్లెలో బాల ఓబన్న యాదవ్ (50) అనే వ్యక్తి పాము కాటుకు గురై మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు గురువారం ఓబన్న తన ఇంటి ఆవరణలోని పిచ్చి మొక్కలను పీకుతుండగా పాము కరించింది. వెంటనే అతనిని ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్లు వారు తెలిపారు.

ట్రెజరర్‌గా కారంశెట్టి సుబ్బారావు



ఖాజీపేట : ఆర్య వైశ్య సంఘం కార్యవర్గంలో ట్రెజరర్‌గా కారంరెట్టి సుబ్బారావు ఏకగ్రీవంగా ఆర్యవైశ్య కమిటి సభ్యులు ఎన్నుకొన్నారు. దీంతో ఆయన గురువారం కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పదవి బాధ్యతలు చేపట్టారు. పదవికి వన్నె తెస్తానన్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా పలువురు మెచ్చుకొనేలా పని చేస్తానన్నారు. ఆయనకు పదవిరావడంతో పలువురు ఆర్యవైశ్య సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో రెడ్యం

ఖాజీపేట : నంద్యాల ఉప ఎన్నికలో పోటాపోటీగా ఉండడంతో వివిధ పార్టీ నేతలు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే నంద్యాల గోస్‌పాడ్ మండలంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో నంద్యాల పార్లమెంటు రాష్ట్ర పరిశీలకుడిగా పనిచేశారు.

మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

మైదుకూరు రూరల్ : మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, అన్ని రంగాలలో చైతన్యవంతులైతే తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని ప్రొద్దుటూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అడిషనల్ సీడీపీవో పసుపులేటి పేర్కొన్నారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ సభాభవనంలో గురువారం సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఎమ్.విజయలక్ష్మి ఆధ్యక్షతన ముర్రుపాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సమీప గ్రామాల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, జననిర్మాణ కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో పసుపులేటి మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నపిల్లల సంరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. పిల్లలకు ముర్రుపాలు ఎంతో శ్రేష్టమైనవని, వ్యాధి నిరోధక శక్తిని ఇస్తాయని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ మేనేజర్ జోజి,నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలి



సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న పేదలు

బ్రహ్మంగారిమఠం : మండలంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇంటిస్థలాలను మంజూరు చేయాలంటూ సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం బి.మఠం 5రోడ్ల కూడలి నుంచి ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి మండల సిపిఐ కార్యదర్శి జె. హృదయనాథ్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఉన్నటువంటి నిరుపేదలందరికీ మండల తహసీల్దార్ ఇంటిస్థలాలను మంజూరు చేయాలంటూ ఆయన తెలిపారు. అదేవిధంగా ఇంటిస్థలాలు మంజూరు చేసి పేదలకు గృహాలను కూడా మంజూరు చేయాలని ఆయన తెలిపారు. అనంతరం వినతి పత్రం సీనియర్ అసిస్టెంట్ జానకి రామయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చందు, ఈశ్వరయ్య, బ్రహ్మయ్య, ప్రభాకర్, సర్పంచ్X మహిళానేతలు, గ్రామ ప్రజలు, నిరుపేదలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు

కొండాపురం : రైతులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవిన్యూ సదస్సులు ఉపయోగపడుతాయని తహసీల్దార్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సుగుమంచిపల్లె గ్రామంలో గురువారం రైతు సేవలో రెవిన్యూ శాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. ఎక్కువగా భూములకు సంబంధించి అర్జీలు వచ్చినట్లు ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు.

అవీ.. ఇవీ..

ఎంఆర్ టీకాలు తప్పక వేయించండి

పెద్దముడియం: ఎంఆర్ టీకాలను తప్పక వేయించాలని ఇన్‌ఛార్జి వైద్యాధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారంమండలంలోని సుద్దపల్లె, జంగాలపల్లె, జె.కొట్టాలపల్లె, పెద్దపసుపుల గ్రామాల్లో వైద్య సిబ్బంది మొత్తం 539 మంది చిన్నారులకు ఎంఆర్ టీకాలు వేశారు. ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమానికి డాక్టర్ సురేష్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని చిన్నారులకు తప్పకుండా టీకాలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. సిబ్బంది కూడా ఏ ఒక్క చిన్నారిని వదలిపెట్టకుండా టీకాలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాష, ఓబులేసు, ఇందిర, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయస్వామి ఉత్సవం

జమ్మలమడుగు: ఈనెల 19న జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువులో అభయ ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 19వ తేదీ ఉదయాన్నే భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కుబడులు చెల్లిస్తారు. అలాగే గ్రామంలో గ్రామోత్సవం, చెక్కభజన ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం దేవాలయం ప్రాంగణంలో అన్నదానం, రాత్రి తోలుబొమ్మల నాటకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని గ్రామోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీవారు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు

మైలవరం: భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యాక్రమం ద్వారా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని వద్దిరాలలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 1బి అడంగల్, ఆన్‌లైన్ తదితర భూ సమస్యలకు సంబందించి రైతులు రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభలను రైతులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐసీఎల్‌లో 'వనం-మనం'

ఎర్రగుంట్ల: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఎర్రగుంట్ల ఐసీఎల్ కర్మాగారంలో గురువారం మైన్స్, ప్లాంటులో మొక్కలు నాటారు. ప్లాంటు వీపీ ఎంఆర్ సింగ్ ఆధ్వర్యంలోని బృందం 1000మొక్కలు నాటినట్లు తెలిపారు. కానుగ, రైన్‌ట్రీ, బాదం, వేప మొక్కలు నాటారు. సుబ్రమణ్యం, రత్నవేల్‌సామి, మున్వర్, రామిరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

'గీతాశ్రమం పీఠాధిపతిపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్: శారద జూనియర్ కళాశాల విద్యార్థులను బయటకు పంపి తాళాలు వేయడానికి ప్రయత్నించిన గీతాశ్రమ పీఠాధిపతి గంగాధరానందగిరి స్వామిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి ఓబులేసులు పేర్కొన్నారు. కళాశాల నిర్వాహకులు బాడుగలు చెల్లించలేదన్న సాకుతో విద్యార్థులను బయటకు పంపడం, సిబ్బందిని అవమానించడం దారుణమన్నారు. బాడుగుల విషయం ఏర్పేడు ఆశ్రమం చూసుకుంటుందని, గంగాధరానందగిరిస్వామి తలదూర్చడం తగదన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా సగర (ఉప్పర) సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళీ తన కుమార్తె నాగమోక్ష రెండవ పుట్టిన రోజును పురష్కరించుకుని స్థానిక రామేశ్వరం బైపాస్‌రోడ్డులో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అన్ని బంధాలను కోల్పోయి వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధుల పట్ల ప్రేమతో చూసుకోవాలని మాదాసు మురళీ అన్నారు.

వానతో అన్నదాత కులాసా



రాజుపాళెం: పత్తిపంటకు జీవంపోసిన వర్షపునీరు



జమ్మలమడుగు పోలీసు స్టేషన్ ఆవరణంలో వాననీరు

రాజుపాళెం: ఖరీఫ్‌లో సాగైన పత్తి, మినుము, కంది పంట రైతులకు గురువారం సాయంత్రం పడ్డ వర్షానికి రైతుల్లో ఆనందం నింపింది. 40 రోజులు వర్షం లేక సాగు చేసిన పంట పొలాలు పెరుగుదల నిలిచిపోయాయి. ఈ వర్షంతో పంటల్లో ఎరువులు విత్తుకోవడం, మందులు పిచికారి చేస్తే ఏపుగా పెరుగతాయని, మంచి వర్షం కురిసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుందూ నది ప్రాంతంలో వరిసాగు చేసే రైతులకు కూడా ఈ వర్షం మంచి ఊరటను ఇస్తుందన్నారు. ఏది ఏమైనా ఈనెలకు గాను భారీ వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జమ్మలమడుగులో వర్షం

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగులో గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం దాకా మంచి వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణంలో వర్షపునీరు నిలిచింది. ఆర్డీవో కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయం వద్ద వర్షపునీరు నిలిచాయి. ఇంకా వర్షం కురవాలని ప్రజలు వానదేవున్ని కోరుతున్నారు.

మట్కాతో జీవితాలను పాడుచేసుకోవద్దు- సీఐ

ప్రొద్దుటూరు క్రైం : మట్కాతో జీవితాలను పాడుచేసుకోవద్దని అర్బన్ సీఐ సదాశివయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి సంజీవనగర్‌లో ఆర్బన్ సీఐ సదాశివయ్య నేతృత్వంలో పరివర్తన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో సీఐ సమావేశమై, మట్కా రాయడం కానీ, ఆడటం కానీ చేయవద్దని సూచించారు. మట్కా వల్ల చేజేతులారా జీవితాలను నాశనం చేసు కుంటున్నారన్నారు. మట్కాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, తమ విజ్ఞప్తిని మన్నించి మట్కా కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యక లాపాలకు దూరంగా ఉంచి కుటుంబాలతో సంతోషంగా ఉండాలన్నారు. ఎస్ఐలు మధు మల్లేశ్వర్‌రెడ్డి, ఆంజినేయులు ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

ప్రొద్దుటూరు టౌన్: కడ పజిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించాల్సిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను వాతావరణం సరిగా లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు నిర్వాహక సంఘం అధ్యక్షుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి, కార్యదర్శి అహమ్మద్‌బాషలు ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్‌ను సంప్రదించి పోటీలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. వర్షాల వల్ల పోటీలు జరగాల్సిన ఆర్‌సీపీఈ వ్యాయామ కళాశాలలో రన్నింగ్ ట్రాక్ పోటీలకు అనుకూలంగా లేనందున పోటీలను వాయిదా వేసినట్లు తెలిపారు.

రోటరాక్ట్ అధ్యక్షుడిగా అహమ్మద్‌బాష

ప్రొద్దటూరు కల్చరల్: రోటరాక్ట్ అధ్యక్ష, కార్యదర్శులుగా అహమ్మద్‌బాష, పవన్‌కుమార్‌రెడ్డిలు ఎన్నికైనట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎండి అయూబ్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా మహమూద్, మహబూబ్‌షరీఫ్, సహాయ కార్యదర్శిగా షమ్మి, కోశాధికారిగా సుదర్శన్‌తో మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

వినాయక విగ్రహ ఏర్పాటుకు డీఎస్పీ అనుమతి తప్పనిసరి

● నిబంధనలు మీరితే కఠిన చర్యలు- సీఐ



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

ఎర్రగుంట్ల: వినాయకచవతి సందర్భంగా విగ్రహాల ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరు డీఎస్పీ అనుమతి తప్పకుండా తీసుకోవాలని ఎర్రగుంట్ల సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటనాయుడు తెలిపారు. గురువారం రాత్రి ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వినాయ విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ప్రతి సంవత్సరం లాగేనే ఈసంవత్సరం కూడా నిబంధనలు పాటించాలన్నారు. మున్సిపాలిటీ, విద్యుత్, గ్రామపంచాయతీ వారి అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసినప్పటినుంచి నిమజ్జనం వరకు టపాసులు పేల్చరాదన్నారు. మద్యం సేవించి విగ్రహం సమస్యలు సృష్టించినా, వాగ్వాదానికి దిగినా, గొడవకు కారణమైనా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు చూసించిన చోటే నిమజ్జనం చేయాలని, విమజ్జనం సాయంత్రం 5గంటలలోపు పూర్తిచేసుకోవాలని సూచించారు. విగ్రహాల వెంట చిన్నారులు, మహిళలు వెళ్లరాదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా నిర్వాహకులదే బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఇతరులకు ఇబ్బందిలేకుండా రాత్రి 10 గంటల లోపే మైకులు బంద్‌చేయాలన్నారు. ముఖ్యంగా విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటినుంచి, నిమజ్జనం వరకు కాపలాగా నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే కూడళ్లలో విగ్రహం చాలాసేపు ఆపడం నిషేదం అన్నారు. ముఖ్యంగా రాత్రిపూట నిమజ్జనం పూర్తిగా నిషేదం చేస్తున్నట్లు తెలిపారు. దీన్ని నిర్వాహకులు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రిని వెంటనే తొలగించాలి-దళితులు

జమ్మలమడుగు రూరల్: రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డిని మంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలని సమతా దళితX యునైటెడ్ కమిటీ దళిత నేతలు, సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం జమ్మలమడుగులో అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖానికి నల్లబ్యాడ్జీలు కట్టుకుని ధర్నా చేపట్టారు. మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెవరెండ్ బడెం సుందర్‌రాజు మాట్లాడుతూ దళితుల స్వేచ్ఛను, బతుకులను కించపరచి మాట్లాడటం సరికాదన్నారు. సమత దళితX యునైటెడ్ కమిటీ వ్యవస్థాపకుడు సైమన్, అధ్యక్షుడు మర్రి ప్రకాశం, మాలమహానాడు రాష్ట్ర నాయకులు చిన్నయ్య, మంగదొడ్డి సింగరయ్య, బిర్రు



ధర్నా చేస్తున్న దళితులు

ఫిలిప్, చేనేత సమస్యల పరిష్కార కమిటీ జిల్లా సభ్యుడు బడిగించల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో...

మంత్రిని పదవి నుంచి తొలగించాలని డీహెచ్‌పీఎస్ కన్వీనర్ దండు రవి, చంద్రకుమార్ డిమాండ్ చేశారు. దళితుల పట్ల చిన్నచూపు మాని వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

మంత్రి ఆదిని పదవి నుంచి తొలగించాలి

● మాలమహానాడు డిమాండ్

ప్రొద్దుటూరు టౌన్: దళితులను కించపరుస్తూ మాట్లాడిన రాష్ట్ర గిడ్డంగుల శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డిని వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లం విజయ్‌మోహన్ డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి వాఖ్యలకు నిరసనగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీల పట్ల మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, వెంటనే వారికి మంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల పట్ల చిన్నచూపు ఉన్న మంత్రి ఆదిని ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్ట ప్రకారంకఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాయలసీమ ఇన్‌ఛార్జి వారాధి ఇమ్మానుయేల్, సీమాంధ్ర స్టూడెంట్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరేష్, ఎస్ఎఫ్ఐ డేవిడ్‌రాజు, ఓబులేసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా బండినాగరాజు

కమలాపురం రూరల్: కమలాపురం నూతన ఎంపీడీవోగా బండి నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో అనంతపురం జిల్లా శింగనమలై మండలంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తూ పదోన్నతిపై కమలాపురం ఎంపీడీవోగా వచ్చారు. గత పది నెలలుగా ఈ స్థానంలో ఇన్ ఛార్జి ఎంపీడీవోగా త్రిమూర్తిరెడ్డి విధులు నిర్వహించారు. ఎట్టకేలకు పూర్తిస్థాయి ఎంపీడీవోను నియమించారు.

ఆసుపత్రి సలహా కమిటీ చైర్మన్ గా రాజశేఖర్‌రెడ్డి

పెండ్లిమర్రి: మండల కేంద్రంలోని పెండ్లిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సలహా కమిటీ చైర్మన్ గా రాజశేఖర్‌రెడ్డి నియమితులైనట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం సలహా కమిటీని ప్రభుత్వం నియమించిందని, శుక్రవారం మధ్యాహ్నం చైర్మన్ , సలహా కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం వుంటుందని, ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జి పుత్తా నరసింహారెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఏడు రకాల రికార్డులను నిర్వహించాలి

కమలాపురం రూరల్: జాతీయ గ్రామీణాభివృద్ధి పథకంలో ప్రతి పంచాయతీ తప్పకుండా ఏడు రకాల రిజిస్టర్లను నిర్వహించాలని డ్వామా (ఉపాధి హామీ పథకం) అదనపు పీడీ మొగిలిచండు సురేష్ తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని ఉపాధి కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పథకాన్ని పకడ్బందీగా, ప్రతిష్టాత్మకంగా సాంకేతికపరంగా నిర్వహిస్తోందన్నారు. ఉపాధి హామీ ద్వారా రైతు పొలాలలో పంటకుంటల తవ్వకాలు చేపట్టామని, అందులో 65237 పనులు ప్రారంభించగా 15268 పూర్తయి రాష్ట్రంలోనే మొదటిస్థానంలో వున్నామన్నారు. జిల్లాలో వీఎన్ పల్లె మండలం మొదటిస్థానంలో వుందన్నారు. హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కల పెంపకానికి రైతులకు ఉచితంగా మొక్కలు అందజేస్తామని, అందుకు ఐదెకరాలకు మించకుండా భూమి వుండాలన్నారు. రైతుకు రెండేళ్ల వరకు ఆర్థిక సాయం, ఎరువులు కూడా అందిస్తామన్నారు. పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శితో కలిసి ఫీల్డు అసిస్టెంట్ తప్పనిసరిగా ఏడు రకాల రికార్డులు నిర్వహించాలని, మండల స్థాయిలో పనిదస్త్రాల నిర్వహణ చేపట్టాలని ఆయన తెలిపారు.


ఉపాధి రికార్డులు పరిశీలిస్తున్న మొగిలిచండు సురేష్

అధికారుల గైర్హాజరుపై జడ్పీ చైర్మన్ ఆగ్రహం


అధికారుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న జడ్పీ ఛైర్మన్ రవి

పెండ్లిమర్రి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం ఉదయం జడ్పీ ఛైర్మన్ గూడూరు రవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు గైర్హాజరు కావడంపై జడ్పీ ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ ఏఈ సోమశేఖర్‌రెడ్డి హాజరుపట్టికలో 18వ తేదీ కూడా సంతకం చేయడంతో ఎందుకు ఇలా ఒకరోజు ముందుగానే విధులకు హాజరైనట్లు సంతకం చేశారని ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. అధికారుల తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిల్లలకు ఎంఆర్ టీకా తప్పనిసరి

పెండ్లిమర్రి: పిల్లలకు ఎంఆర్ టీకాను తప్పనిసరిగా వేయిస్తే మీజల్స్, రూబెల్లా వ్యాధులు రావని ప్రభుత్వవైద్యాధికారి బాలకొండ్రాయుడు తెలిపారు. గురువారం మండల పరిధిలోని గంగనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలలోని 490 మంది పిల్లలకు ఈ టీకాను వేశారు. కార్యక్రమంలో హెచ్ ఎం సురేష్‌బాబు, ఏఎన్ ఎంలు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మ దహనం


మంత్రి ఆది దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కమలాపురం రూరల్: దళితుల ఆత్మగౌరవం దెబ్బతినేలా టీడీపీ మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు ఉదయ్‌కిరణ్ అన్నారు. గురువారం మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మను ఏఐఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్, సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచి పదవుల కోసం పార్టీలు మారుతూ నీచరాజకీయాలు చేసే మంత్రి ఆదికి దళితుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. దళితులను అవమానపరచినందుకు ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి వుంటే వెంటనే ఆదిని మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు నాయకులను అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు క్రిష్ణయ్య, సీపీఐ నాయకురాలు సావిత్రమ్మ, బీఎస్పీ నాయకులు రమణ, పుల్లయ్య, బాల ఓబయ్య, రమణ, భూషణం, శివ పాల్గొన్నారు.

కోట్లూరు మాజీ సర్పంచ్ మృతి


సంతాపం తెలుపుతున్న పుత్తా, తదితరులు

వల్లూరు: మండల పరిధలోని కోట్లూరు మాజీ సర్పంచ్ అవదానం సుబ్బనరసయ్య మృతి చెందారు. ఈయన కోట్లూరు గ్రామ పంచాయతీకి 30 సంవత్సరాలుగా సర్పంచ్ సేవలను అందించి పంచాయతీ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారు. ఈయన మృతికి టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి సతీమణి సుభద్రమ్మ, కర్నాటకకు చెందిన పీఠాధిపతి తదితరులు సంతాపం తెలిపారు. పుత్తా వెంట స్థానిక నేతలు కృష్ణారెడ్డి, మస్తాన్ , దివాకర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి తదితరులు ఉన్నారు.

రైతుల కోసమే రెవెన్యూ సదస్సులు

వల్లూరు: రైతుల కోసమే ప్రభుత్వ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నపుత్త గ్రామంలో గురువారం రైతు సేవలో రెవిన్యూశాఖ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అండంగల్, 1బీ, ఆన్ లైన్ తదితర సమస్యలుంటే అర్జీల రూపంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీప్రసన్న, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

వల్లూరు: ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలని ఉపాధి అదనపు పీడీ మొగిలిచెండు సురేష్, ఎంపీడీవో సాంబశివారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో గురువారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల పత్రాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించడంతో పాటు కూలీలకు సకాలంలో వేతనాలను కూడా అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలతో పత్తి పంటను దక్కించుకోవాలి


పత్తిపంటను పరిశీలిస్తున్న వీరయ్య

సికెదిన్నె: రైతులు వర్షాధారంగా సాగు చేసిన పంటలను రక్షించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. మండలంలోని గోర్లపల్లె, తదితర ప్రాంతాలలోని పత్తిపంటను గురువారం మండల వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు సకాలంలో పడనందున వల్ల పత్తి ఎర్రబారిందని, సకాలంలో అధికారులు తెలిపిన విధంగా మందులు వాడి పంటను రక్షించుకోవాలన్నారు. మోతాదుకు మించి మందులు వాడరాదని, ప్రతి 20 రోజులకు ఒకసారి ఎరువులు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుమంత్ రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కరువు రైతును ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వీరపునాయునిపల్లె: వర్షాభావ పరిస్థితుల కారణంగా గత మూడు సంవత్సరాలుగా కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓబులేసు అన్నారు. మండలంలోని ఎస్.పాలగిరి, వీరపునాయునిపల్లె గ్రామాలలో రాష్ట్ర సీపీఐ కరువు బృందం పర్యటించింది. మండలంలో సాగులో ఉన్న చీనీ, పత్తి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావంతో నష్టపోయిన పంట రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వయసుపైబడిన రైతులకు పింఛన్ ఇవ్వాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు చంద్ర, కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, రామయ్య, విజయలక్ష్మి, బసీరున్నీసా, కొమ్మద్ది ఈశ్వరయ్య, రైతు సంఘం జిల్లాసహాయ కార్యదర్శి దేవిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెండ్లిమర్రి: రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వీరయ్య, ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిన్నమరాజుపల్లె గ్రామంలో డ్రిప్‌తో సాగు చేసిన ప్రత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించి, విత్తనశుద్ధి చేయడం వల్ల కొద్ది మేర చీడ పీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. మోతాదులో మాత్రమే మందులను పిచికారి చేయాలన్నారు. రైతులకు ఎర్రదోమ, ఆకుపచ్చ తెగులు నివారణకు వేయాల్సిన మందులు, మోతాదులను వివరించారు. కార్యక్రమంలో ఏవో నాగఅర్చన, ఎంపీఈవో చిట్టి, రైతులు పాల్గొన్నారు.


ప్రత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఏ వస్తువు కొన్నా రసీదు తీసుకోవాలి

సికెదిన్నె: మార్కెట్‌లో ఏ వస్తువు కొన్నా అందుకు సంబంధించిన రసీదు బిల్లు తీసుకోవాలని మూడవ అదనపు మెజిస్ట్రేట్ పద్మశ్రీ తెలిపారు. రాయచోటి రోడ్డులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో విద్యార్థులకు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండి ఏ చట్టం ఎలా పని చేస్తుందో తెలుసుకోవాలన్నారు. ఎస్ఐ హేమకుమార్ మాట్లాడుతూ ప్రజలు సమాజంలో ఏమైనా జరిగినప్పుడు పోలీసులకు నిర్భయంగా సమాచారం అందించాలన్నారు. సమాచారాన్ని అందించినవారిని కోర్టుకు రావాలని అడగరని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలిగించమని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్లు సుబ్రమణ్యం, ఉదయ్‌శ్రీ, కళాశాల అధ్యాపకుడు నరసింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పులివెందుల
13
కడప। శుక్రవారం 18 ఆగస్టు 2017
పులివెందుల । తొండూరు । వేముల । వేంపల్లె । లింగాల । సింహాద్రిపురం । చక్రాయపేట

ప్రతి బాధితునికి న్యాయం చేయాలి : ఏఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ కృష్ణారావు

పులివెందుల టౌన్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితునికి న్యాయం చేసేలా పోలీసులు కృషి చేయాలని ఏఎస్పీ కృష్ణారావు సూచించారు. గురువారం ఆయన పులివెందుల ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో సీఐలు, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి, ప్రతి కదలికను పసిగట్టాలన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, ఎర్రచందనం, బెల్టు షాపులను నియంత్రించాలన్నారు. పోలీసులు గ్రామాలలో పల్లె నిద్ర చేపట్టి శాంతియుత వాతావరణం కల్పించాలన్నారు. అలాగే మండల, తాలూకా కేంద్రాలలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అనుమానాస్పద వ్యక్తులపై దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో పోలీసులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రసాద్, రామకృష్ణుడు, మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రైతులు సకాలంలో ఎరువులు వాడాలి : డీడీఏ


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ డీడీఏ విజయభారతి

పులివెందుల టౌన్: ప్రభుత్వం భూసార పరీక్షల ద్వారా రైతులకు ఉచితంగా అందిస్తున్న జిప్సం, జింక్, బోరాన్ ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖ డీడీఏ విజయభారతి సూచించారు. గురువారం మండలంలోని కనంపల్లె, మోటూతలపల్లె గ్రామాలలో సాగుచేసిన వేరుశనగ, పెసర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ పంట ఊడల సమయంలో సూక్ష్మపోషకాలైన జిప్సం వేయడం వలన కాయల నాణ్యత, పరిమాణం పెరుగుతాయన్నారు. అదే విధంగా మండలంలో 38 మంది రైతులకు మినీ కిట్స్ కింద వేరుశనగలో ఐసీజీవి 91, పెసరలో ఐపీఎల 2-14 రకం విత్తనాలను గతంలో పంపిణీ చేశారన్నారు. రైతులు తమ పొలాలలో పంటలను సాగు చేశారో లేదో అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రమణారెడ్డి, ఏఓలు మధుసూదన్ రెడ్డి, నాగభూషణరెడ్డి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ట్రిపుల్‌ఐటి పి.డి. ఎంపిక


శంషాద్‌బేగంను అభినందిస్తున్న డైరెక్టర్ భగవన్నారాయణ

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ సమన్వయకర్తగా పనిచేస్తున్న శంషాద్‌బేగం అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైంది. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొననుందని డైరెక్టర్ భగవన్నారాయణ తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల పంపిణీలో పురుషులతో పాటు మహిళలకు సమాన కోటా కల్పించాలనే అంశాలను ప్రధానం చేసుకొని జండర్ బారీర్ ఇన్ స్పోర్ట్స్ చాలెంజ్ అండ్ రెమిడీస్ అనే జర్నల్‌కు గానూ సదస్సుకు ఎంపికైంది. రాయలసీమ నుంచి ఎంపికైన శంషాద్‌బేగం హాకీ టోర్నమెంట్‌కు అంపైర్‌గా ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, బ్యాంకాక్ తదితర దేశాల్లో పాల్గొందని తెలిపారు. ఆమెను డైరెక్టర్ భగవన్నారాయణతో పాటు ఏఓ అమరేంద్రకుమార్ సంద్ర అభినందించారు.

అడిషనల్ లోడ్ రుసుం వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి : ఎస్ఈ

పులివెందుల టౌన్: అడిషనల్ లోడ్ రుసుం చెల్లించి విద్యుత్ వినియోగదారులు తమ సర్వీసును క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో విద్యుత్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సర్వీసు లేకుండా విద్యుత్ వాడటం నేరమన్నారు. అలాగే సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగరాజు, ఏడీఏ రఘు, ఏఈలు రవీంద్రప్రసాద్, జయసుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, ఎఎఓ షనీ సైదా, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ టీకాలు వేయించాలి

వేంపల్లె : పిల్లలందరికీ మీజిల్స్ రూబెల్లా టీకాలను తప్పనిసరిగా వేయించాలని ఉపసర్పంచు మునీర్ తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక ఉర్దూ హైస్కూల్లో మీజిల్స్, రూబెల్లా టీకాల కార్యక్రమాన్ని ఉపసర్పంచు దగ్గరుండి ప్రారంభించారు. హెల్త్ ఎడ్యుకేటర్ బాబాఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో పిల్లలకు టీకాలు వేయించారు. భవిష్యత్తులో పిల్లలకు వ్యాధులు రాకుండా ముందుజాగ్రత్త చర్యగా టీకాలు వేయించడం మంచి పరిణామమన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

వేముల: ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనికి నిర్లక్ష్యంగా వాహనం నడపడమే కారణమని ఏపీ ఓసి జేఏసీ కన్వీనర్ పేర్ల పార్థసారధిరెడ్డి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని గురువారం పేర్ల పార్థసారధిరెడ్డి ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనం నడపడం, డ్రైవింగ్ చేసేటపుడు సెల్‌ఫోన్ లో మాట్లాడడం, ఇయర్‌ఫోన్‌లో పాటలు వింటూ వాహనాలు నడపడం వలన అధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై వాహనదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట బాస్కర్‌రెడ్డి, బాలబయపురెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం


మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న పాత్రికేయులు

పులివెందుల టౌన్: 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు విలేకరులు మాట్లాడుతూ 1967 ఆగస్టు 17వ తేదీన ఏపీయూడబ్ల్యూజె ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి జర్నలిస్టుల వృత్తి, వేతన భద్రత, సంక్షేమం, వృత్తి రక్షణ వంటి ప్రధాన లక్ష్యాలతో నూతన ఒరవడిని సృష్టించిందన్నారు. జర్నలిస్టుల పితామహుడు, నేషనల్ హెరాల్డ్ పత్రిక సంపాదకుడు మాణికొండా చలపతిరావు ఏపీయూడబ్ల్యూజేని స్థాపించారన్నారు. అప్పటి నుంచి ఆయన జర్నలిస్టుల కోసం ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలో నడిచిన నేషనల్ హెరాల్డ్ పత్రికకు చలపతిరావు సుమారు నాలుగు దశాబ్దాల కాలం పాటు పనిచేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 37మంది సభ్యులతో ఏపీయూడబ్ల్యూజె ప్రారంభమైందన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, వెల్ఫేర్ ఫండ్, అక్రిడిటేషన్లు, బస్ పాస్‌లు, మండలస్థాయి వరకు సాధించడమే ముఖ్య ఉద్దేశంగా ఏపీయూడబ్ల్యూజే పనిచేసిందని, మరింత ప్రగతి సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు గంగామహేశ్వర్‌రెడ్డి, అమర్‌నాథ్, రమేష్ బాబు, చంద్ర సుదాకర్‌రెడ్డి, ప్రభంజనరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, ఓం ప్రకాష్, రామ్మోహన్ , పవన్ కుమార్, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పులివెందుల టౌన్: గ్రామీణ డాక్ సేవకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.సి రాముడు అన్నారు. గురువారం స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద నిరవధిక సమ్మెలో గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగుతోందన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. జీడీఎస్ కమిటీ నివేదికను వీలైనంత త్వరగా అమలు చేస్తామని కేంద్రం ఆదేశాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ సభ్యులు కుళాయప్ప, జమీఉల్లా, భాస్కర్, బాలగంగయ్య, సీరజ్, భాస్కర్‌రెడ్డి, దస్తగిరి, మాబు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

గ్రామీణ డాక్ సేవకుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం గ్రామీణ తపాలా ఉద్యోగులు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు రాముడు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్టీసీ సర్కిల్ నుంచి మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు.

చంద్రన్న బీమాను సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె : చంద్రన్న బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఉపసర్పంచు మునీర్, ఏపీఎం ఖాదర్‌వల్లిలు విజ్ఞప్తి చేశారు. స్థానిక క్రిస్టియన్ కాలనీలో ఇటీవల పొన్నా గంగరాజు అనారోగ్యంతో మృతిచెందగా ఆయన భార్యకు చంద్రన్న బీమా పథకం తక్షణ సహాయం కింద రూ.5 వేలను గురువారం పంపిణీ చేశారు. మిగతా రూ.25 వేలు బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం చంద్రన్న బీమాలో పేర్ల నమోదు కార్యక్రమం జరుగుతోందని, అర్హులైన ప్రతిఒక్కరూ వెలుగు కార్యాలయంలో సంప్రదించి నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీమా మిత్ర అరుణకుమారి, రామాంజులు, రమాదేవిలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు వేలం

లింగాల: లింగాల పోలీస్‌స్టేషన్ లో 2015 సంవత్సరంలో వివిధ కేసులకు సంబంధించి పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలకు గురువారం వేలం నిర్వహించారు. ఈ వేలానికి మండలం నుంచి దాదాపు 50 మంది దాకా పాల్గొన్నారు. ఈ ఆరు ద్విచక్ర వాహనాలు వేలం వేయగా రూ.44600 వచ్చినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొని ద్విచక్ర వాహనాలు తీసుకున్న వారు శుక్రవారం డబ్బులు చెల్లించి వాహనాలు తీసుకెళ్లాలని ఆయన తెలిపారు.

ట్రిపుల్‌ఐటికి విద్యార్థి ఎంపిక



లింగాల : మండల పరిధిలోని పెద్దకుడాల గ్రామానికి చెందిన ప్రదీప్ అనే విద్యార్థి నూజివీడు ట్రిపుల్‌ఐటికి ఎంపికైనట్లు పులివెందుల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ట్రిపుల్‌ఐటిలో మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో ప్రదీప్ నూజివీడు ట్రిపుల్‌ఐటిలో సీటు సంపాదించాడన్నారు. పెద్దకుడాల గ్రామానికి చెందిన పాలెరాజు కుమారుడు ప్రదీప్. గత 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 9.3 జి.పి.ఏ సాధించాడన్నారు. విద్యార్థి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పులివెందులటౌన్: నియోజకవర్గానికి మంజూరైన ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ కృష్ణయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని హౌసింగ్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 1297 ఇళ్లు మంజూరయ్యాయని, అందులో కేవలం 253 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. కావున క్షేత్ర స్థాయిలో సిబ్బంది ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులకు సూచించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ సుబ్బరాయుడు, ఏఈ, వర్క్ ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు.